www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 59
శనివారం | 14-6-2025
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: తదియ మ.3.47 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.22 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.7.41-9.21, తె.4.28-6.06, దుర్ముహూర్తం: ఉ.5.44-7.28, అమృతఘడియలు: సా.5.41-7.21, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వీడని మిస్టరీ!

విమాన ప్రమాదంపై అంతు చిక్కని కారణాలు


అహ్మదాబాద్‌లో విమానం కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

రంగంలోకి ఎన్‌ఐఏ, ఏఏఐబీ.. నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ

బ్లాక్‌బాక్స్ దొరికింది.. హాస్టల్ శిథిలాల కింద లభ్యం

ఎయిరిండియాలో బోయింగ్‌ల కుదింపు?

బాధిత కుటుంబాలకు అండగా..

విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన మోదీ

న్యూఢిల్లీ, జూన్ 13: ఎంతో ఆనందంగా లండన్‌కు బయలు దేరిన 241 మంది జీవితాలను బుగ్గి చేసిన ఘోర విమాన ప్రమాదంపై మిస్టరీ ముడి వీడలేదు. ప్రమాదం జరిగి 2 రోజులవుతున్నా.. కారణాలు అంతు చిక్కడంలేదు. సాంకేతిక లోపమా? పక్షులు ఢీకొనడం వల్లే ఇంత పెద్ద ప్రమాదం సంభవించిందా? అసలు ఏం జరిగింది? అనే విషయాలపై పౌర విమానయాన శాఖకు స్పష్టత రాలేదు. ఈ క్రమంలో ప్రమాద కారణాలను అన్వేషించేందుకు జాతీయ దర్యాప్తు బృందం(ఎన్‌ఐఏ) అధికారులు రంగంలోకి దిగారు. అదేవిధంగా పౌర విమానయాన సంస్థకే చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్

మిగతా 2వ పేజీలో...

తల్లికి ఆనందం!

సంతాన లక్ష్మికి లక్ష్మీ కటాక్షం
కూటమి సర్కారుకు 'వందనం'

వందనం... అభివందనం





అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం మాళాపురం గ్రామానికి చెందిన రత్నమ్మ, రామాంజి దంపతులకు ఆరుగురు సంతానం. వీరిలో ఐదుగురికి 'తల్లికి వందనం' వచ్చేసిన ఆనందమిది!

నెల్లూరు జిల్లా కావలికి చెందిన దార్ల జ్యోతికి నలుగురు సంతానం. వీరందరికి ఒకేసారి తల్లికి వందనం పథకం ద్వారా రూ.52వేలు జమ అయ్యాయి. పిల్లలతో కలిసి ఆమె ఇలా హర్షం వ్యక్తం చేశారు.

జగన్ హయాంలో ఇంటికి ఒక్కరికే

నేడు.. చదువుకుంటున్న వారందరికీ!

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ

ముగ్గురు పిల్లలున్న వారు 2 లక్షలకు పైగానే

నలుగురు పిల్లలున్న వారూ భారీగానే

'తల్లికి వందనం' నిధుల జమ దాదాపుగా పూర్తి

(అమరావతి, న్యూస్‌నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

వదినా... నీ అకౌంట్‌లో డబ్బులు పడ్డాయా?

పక్క వీధిలో మా బంధువులున్నారు. మూడు పదమూళ్లు... 39 వేలు పడ్డాయట!

పిల్లల స్కూలు ఫీజుకోసం అప్పు చేయాల్సిన అవసరం తప్పిపోయింది!

సైకిల్‌పై స్కూలుకు వెళ్లాలని పెద్దోడి ఆశ! కొనిచ్చేస్తా! చిన్నోడినీ సైకిల్‌పై తీసుకెళతాడు!

రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ పల్లెలో తల్లులను పలకరించినా... ఇవే ముచ్చట్లు! కూటమి సర్కారు కొలువుదీరి ఏడాదైన సందర్భంగా 'తల్లికి వందనం' నిధులను జమ చేశారు. ఆ డబ్బులు గురువారం సాయంత్రం నుంచి తల్లుల ఖాతాల్లో పడటం మొదలైంది. సాంకేతిక

మిగతా 13వ పేజీలో...

అమ్మ కళ్లలో ఆనందం
ప్రతి ఇంటా సంబరం





24 గంటలు టైమిస్తున్నా!

రూ.2 వేలు నా ఖాతాలో పడినట్లు నిరూపించాలి

లేదంటే తీవ్ర చర్యలు.. వైసీపీకి లోకేశ్ హెచ్చరిక

23 నుంచి 'తొలి అడుగు'

కూటమి ఏడాది సుపరిపాలనపై ఇంటింటి ప్రచారం 13

ఇరాన్‌పై ఇజ్రాయెల్

భీకర దాడులు

ఆర్మీ చీఫ్, నలుగురు జనరల్స్, ఆరుగురు అణు శాస్త్రవేత్తల మృతి


ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఓ భవనం


ఇజ్రాయెల్ దాడిపై టెహ్రాన్‌లో నిరసన

వంద సైనిక, అణు, క్షిపణి స్థావరాలపై గురి

200 యుద్ధ విమానాలతో తెల్లవారుజామున దాడి

330 బాంబులు, క్షిపణులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రం ధ్వంసం

ఇజ్రాయెల్ సైన్యం, మొసాద్ సంయుక్త ఆపరేషన్

ఇరాన్‌లోకి డ్రోన్లు, ఆయుధాలు అక్రమంగా చేరవేత

ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరించిన ఇరాన్

టెల్ అవీవ్, టెహ్రాన్, జూన్ 13: ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలు, క్షిపణి కేంద్రాలే లక్ష్యంగా... ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో (టెహ్రాన్ స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో).. ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన 200కు పైగా యుద్ధవిమానాలు భీకర దాడులకు దిగాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దశలవారీగా

మిగతా 11వ పేజీలో...

తదుపరి దాడులు మరింత క్రూరం

ఇకనైనా మాతో అణు ఒప్పందం కుదుర్చుకోండి

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



జాగ్రత్తగా ఉండండి!

అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు

డిబేట్‌లోని వారూ చేయకూడదు

సాక్షి యాంకర్ కొమ్మినేనికి సుప్రీం హెచ్చరిక

రాజధానిపై అసభ్య వ్యాఖ్యల కేసులో జైలు నుంచి విడుదలకు ఆదేశం 14

ట్రయల్ కోర్టు షరతులకు లోబడి బెయిల్

నేడు నీట్ ఫలితాలు

13

భయం పోయింది.. భద్రత పెరిగింది

కూటమి ఏడాది పాలనలో భారీగా తగ్గిన నేరాలు

వైసీపీ హయాంలో ఏటా 1.52 లక్షల కేసులు

కూటమి వచ్చాక లక్ష లోపే నమోదు

టెక్నాలజీతో నేరాల అదుపు.. సోషల్ సైకోలకు చెక్

'ఈగల్'తో గంజాయి స్మగ్లింగ్, సాగు కట్టడి

'శక్తి' యాప్‌తో మహిళలకు భరోసా 3

పోలీసింగ్ మార్పుతో నేరస్థుల వెన్నులో వణుకు

రక్తమోడిన రహదారులు

పది మంది దుర్మరణం.. కర్ణాటకలో ఐదుగురిని బలిగొన్న ఆర్టీసీ బస్సు ఓవర్‌టేక్

మృతుల్లో నలుగురు చిత్తూరు జిల్లా వాసులు.. 14 మందికి గాయాలు 14

చిత్తూరులో అతివేగానికి ముగ్గురు బలి.. అనకాపల్లిలో బైకును లారీ ఢీకొని ఇద్దరు

చేనేతలకు వేతనాల పెంపు.. మంత్రి సవిత ప్రకటన 13

కన్నీటి కథలు..!!

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో మరణించిన ప్రతీ ఒక్కరి ప్రయాణం వెనక ఒక్కో కథ. లండన్‌లో ఉన్న భార్యను కలిసేందుకు బయలుదేరిన వ్యక్తి ఒకరైతే.. భార్య అస్థికలను స్వగ్రామంలోని నదిలో కలిపి ఆమె ఆఖరి కోరిక తీర్చి లండన్ తిరుగు ప్రయాణమైన భర్త మరొకరు.. వివాహ వేడుక కోసం స్వస్థలానికి వచ్చి లండన్ తిరిగి వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన ఏడు నెలల గర్భిణి ఇంకొకరు.. ఇలా ఎందరికో ఆఖరి మజిలీగా మారిన ఈ ప్రయాణం ఎన్నో కుటుంబాలను చిదిమేసింది..!!

అంజూ.. ఫ్లైట్ ఎక్కాను.. రేపటికి చేరుకుంటా!


భార్య అంజలిబెన్‌తో విజయ్ రూపాణీ(ఫైల్)

"అంజూ నేను ఫ్లైట్ ఎక్కా. విమానం బయలుదేరబోతోంది. నేను రేపు వస్తాను" ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ తన భార్య అంజలిబెన్‌తో చివరిగా ఫోన్‌లో మాట్లాడిన మాటలివి. ఆ కాసేపటికే ఆయన మరణించారు. లండన్‌లో ఉంటున్న తమ కుమార్తె ఇంటికి అంజలిబెన్ మే 19న వెళ్లారు. విజయ్‌రూపాణీ కూడా జూన్ 5న లండన్ వెళ్లేందుకు టికెట్ కూడా బుక్ చేసుకున్న విజయ్ రూపానీ.. పంజాబ్‌లోని లుథియానా ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. మళ్లీ జూన్ 10న ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకున్నా.. ఆఖరి నిమిషంలో ప్రయాణం వాయిదా వేసుకున్నారు. చివరికి గురువారం విమానం ఎక్కి ఈ లోకాన్ని వీడారు.

భార్య అస్థికలను నదిలో కలిపేందుకు వచ్చి..


భార్య భారతిబెన్‌తో అర్జున్ పటోలియా (ఫైల్)

సూరత్‌కు చెందిన అర్జున్ పటోలియా(36) తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి 2009 నుంచి లండన్‌లోనే స్థిరపడ్డాడు. అర్జున్ భార్య భారతిబెన్ మే 23న మరణించింది. భారతి అంత్యక్రియలను అర్జున్ లండన్‌లోనే పూర్తి చేశాడు. అయితే, తన అస్థికలను స్వగ్రామంలోని నర్మదా నదిలో కలపాలన్న ఆమె చివరి కోరికను తీర్చేందుకు అర్జున్ సూరత్ వచ్చాడు. ఆమె అస్థికలను నదిలో కలిపాడు. తిరిగి లండన్ బయలుదేరి విమాన ప్రమాదంలో మరణించాడు. వారి పిల్లలు అనాథలుగా మిగిలారు.

తండ్రి అంత్యక్రియలకు వచ్చి...


తల్లి సవితాబెన్‌తో కేతన్ పటేల్

గుజరాత్, మెహసాన్ జిల్లాలోని ఉంఝా ప్రాంతానికి చెందిన కేతన్ పటేల్(40) లండన్‌లో స్థిరపడ్డారు. ఇటీవల తన తండ్రి మరణించగా.. అంత్యక్రియల కోసం 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఆ కార్యక్రమాలు ముగించుకుని తల్లి సవితాబెన్ పటేల్(70)తో కలిసి అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరారు. కానీ, ఆ విమానం కూలిపోవడంతో తల్లీకొడుకులు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

పెళ్లి కోసం వచ్చి గర్భస్థ శిశువు సహా దంపతులు..


భర్త వైభవ్ పటేల్‌తో జినాల్

గుజరాత్, దోల్కా జిల్లాలోని కేలియావాస్నా అనే గ్రామానికి చెందిన జినాల్ పటేల్, వైభవ్ పటేల్‌ది ప్రేమ వివాహం. జినాల్ ప్రస్తుతం 7నెలల గర్భిణి. తమ కుటుంబసభ్యుల్లో ఒకరి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ జంట మే 5న లండన్ నుంచి భారత్‌లోని స్వగ్రామానికి వచ్చింది. గురువారం ఎయిరిండియా విమానంలో తిరుగు ప్రయాణమై వారు ప్రాణాలు కోల్పోయారు.

పెళ్లైన నాలుగు నెలలకే


యువ దంపతులు సావ్దాన్ చౌదరి, థాపుబెన్

ధనేరాలోని థారావ్ గ్రామానికి చెందిన సావ్దాన్ చౌదరి, థాపుబెన్‌కు నాలుగు నెలల క్రితమే వివాహమైంది. అహ్మదాబాద్ నుంచి ఎయిరిండియా విమానంలో లండన్ బయలుదేరిన ఈ జంట విమాన ప్రమాదంలో మరణించగా.. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

భార్యతో కలిసి లండన్ వెళ్తూ..


గౌరవ్ బ్రహ్మభట్, కల్యాణి బ్రహ్మభట్

గాంధీనగర్‌కు చెందిన గౌరవ్ బ్రహ్మభట్ గతంలో లండన్‌లో పని చేసేవారు. ఆ సమయంలో పరిచయమైన మహారాష్ట్రకు చెందిన కల్యాణిని పెళ్లి చేసుకున్నారు. ఢిల్లీలోని ఓ ఫార్మా కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్న గౌరవ్ ఇటీవల ముంబైకి బదిలీ అయ్యారు. కల్యాణి గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఓ కంపెనీలో పని చేస్తున్నారు. తాము తొలిసారి కలిసిన లండన్‌కు చాలాకాలం తర్వాత వెళ్లేందుకు ఎయిరిండియా విమానం ఎక్కిన గౌరవ్ దంపతులు ప్రమాదంలో మరణించారు.

నిశ్చితార్థం చేసుకుని తిరిగి వెళ్తూ..


కాబోయే భార్య విభూతితో హార్దిక్

గుజరాత్, బోటాడ్ జిల్లాలోని అద్తల గ్రామానికి చెందిన హార్దిక్ దేవరాజ్(27) రెండేళ్లుగా లండన్‌లో ఉంటూ అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సజోద్ గ్రామానికి చెందిన విభూతి అనే యువతిని లండన్‌లో కలిశాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని అనుకొని పెద్దలను ఒప్పించారు.. నెల రోజుల క్రితం వారు భారత్‌కు రాగా.. సజోద్‌లో నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. పెళ్లికి సమయం ఉండడంతో తిరిగి లండన్ బయలుదేరిన ఆ యువ జంట తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయింది.

వీడని మిస్టరీ!



"వీడియోలను బట్టి చూస్తే.. విమానం వేగం కోల్పోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇంజన్లు విఫలం కావడమే కారణం కావొచ్చు. దీనికి ఇంధనం కల్తీ మరో కారణమైన ఉండొచ్చు." - సీనియర్ మాజీ పైలట్

(మొదటిపేజీ తరువాయి)

బ్యూరో(ఏఏఐబీ) అధికారులు విచారణ ప్రారంభించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం.. వైమానిక రంగ నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని కూడా నియమించింది. ఈ కమిటీ అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ రూపొందించిన ప్రోటోకాల్ ప్రకారం విచారణ చేస్తుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు అన్ని కోణాల్లోనూ విచారణ చేయనున్నట్టు చెప్పారు. అదేవిధంగా వైమానిక రంగం భద్రత, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలనే అంశాలపై కూడా ఉన్నత స్థాయి కమిటీ దృష్టిసారిస్తుందని వివరించారు. ఇదిలావుంటే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిని సందర్శించి.. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఎన్ఐఏ సహా..

జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) అధికారులు సహా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఇతర ఏజెన్సీలకు చెందిన అధికారులు కూడా అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అయితే, వారు ఏయే అంశాలపై దృష్టి పెట్టారు? ఏకోణంలో విచారణ చేపట్టారనే విషయాలను గోప్యంగా ఉంచారు. మరోవైపు, ఈ ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని ఎయిర్ ఇండియా ప్రకటించింది. మొత్తం విమానంలో ప్రయాణించిన వారిలో ఒకే ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని తెలిపింది. ఇక, ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) అధికారులు ఘటనా స్థలంలోని అణువణువునూ నిశితంగా పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వం సహా ఎయిర్ ఇండియా అధికారులు విమాన ప్రమాద సమయంలో ఇంజన్, ల్యాండింగ్ గేర్ పరిస్థితిపై ప్రత్యేకంగా విచారణ సాగిస్తున్నాయి. కుప్పకూలిన విమానం నిర్వహణ సమస్యలు సహా ఎయిర్ ఇండియా సంస్థ లొసుగులు, ఇతర అనేక అంశాలపైనా దృషించారు.

పైలట్లు ఏమన్నారంటే..

ఈ రెండు వీడియోలను వీక్షించిన పైలట్లు ల్యాండింగ్ గేర్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇంజన్ల విఫలం, ఇంధనం కల్తీపైనా సందేహాలు వెలిబుచ్చారు. విమానం గగనతలం వైపు ఎగిరిన ఐదు సెకన్లలోనే సాధారణంగా పైలట్ ల్యాండింగ్ గేర్‌ను పైకి ఎత్తుతారని కెప్టెన్ అమిత్ సింగ్ చెప్పారు. గగన తలంలో సానుకూల ఎత్తుకు చేరుకున్న వెంటనే ల్యాండింగ్ గేర్‌ను సాధారణ స్థితికి తీసుకువస్తారని మాజీ కెప్టెన్ మనోజ్ హతీ తెలిపారు. ల్యాండింగ్ గేర్‌ను వెనక్కి తీసుకోవడం వల్ల విమానం పైకి ఎగరడానికి సహాయపడే మృదువైన ఏరోడైనమిక్ ప్రవాహం ఏర్పడుతుందని వివరించారు. "పైలట్లు పరధ్యానంలో ఉంటే.. ఒక్కొక్కసారి గేర్ అప్ చేయడం మరిచిపోవచ్చు. ప్రస్తుతం జరిగిన ఘటనలో రెండు ఇంజన్లు విఫలమైనా అయి ఉండాలి. లేదా పక్షులైనా ఢీకొట్టి ఉండాలి. లేదా రెండూ జరిగి ఉండాలి. ఈ విమానం రన్‌వే చివరకు వచ్చే సరికి శక్తిని కూడగట్టుకోలేక పోయినట్టు తెలుస్తోంది(వీడియోల ఆధారంగా). బహుశ ఇంజన్లలో సమస్యలు వచ్చి ఉంటాయి." అని కెప్టెన్ అమిత్ సింగ్ వివరించారు. "వీడియోలను బట్టి చూస్తే.. విమానం వేగం కోల్పోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. దీనికి ఇంజన్లు విఫలం కావడమే కారణం కావొచ్చు. అదేసమయంలో ఇంధనం కల్తీ మరో కారణమైన ఉండొచ్చు." అని మనో హతీ పేర్కొన్నారు. మరికొందరు సీనియర్ పైలెట్లు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంజన్లు విఫలం కావడం లేదా, ఇంధనం కల్తీ కావడం వల్లే ఈ ఘోరం సంభవించి ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. గత ఏడు దశాబ్దాల కాలంలో జరిగిన ఏడు విమాన ప్రమాదాలను విశ్లేషిస్తే ఇంజన్లు విఫలం కావడం అనేది అత్యంత అరుదేనని తెలిపారు. మరోవైపు, డీజీసీఏ ఇచ్చిన ప్రకటనలో రెండు ఇంజన్లు విఫలమయ్యాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే 'మేడే కాల్' వచ్చిందని, నిర్ణీత వేగాన్ని అందుకున్నాక ఇంజన్లలో సమస్య వచ్చి ఉంటుందని పేర్కొంది.

నివేదిక ఎప్పుడు?

వైమానిక నిబంధన 13 ప్రకారం ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఘటన జరిగిన నాటి నుంచి 30 రోజుల్లో సిద్ధం చేయాలి. కానీ, అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ(ఐసీఏవో) మాత్రం ఈ విషయాన్ని ఆయా దేశాలకే వదిలి వేసింది. దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలా? వద్దా? అనేది కూడా ప్రభుత్వ ఇష్టాన్ని బట్టే ఉంటుంది. అంతేకాదు, తుది నివేదిక ఇచ్చేందుకు ఏడాది పాటు సమయం ఉంటుంది.



మృతదేహాలను పోస్టుమార్టం కోసం తీసుకొచ్చిన సిబ్బంది


అహ్మదాబాద్‌లో ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదన

బ్లాక్ బాక్స్ దొరికింది!

- విమాన ప్రమాద కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం



అహ్మదాబాద్, జూన్13: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం ఎలా జరిగింది? దీనికి కారణాలేంటి? సాంకేతిక వైఫల్యమా? పక్షులు ఢీకొన్నాయా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం చూపే కీలకమైన బ్లాక్‌బాక్స్ ఎట్టకేలకు లభించింది. నారింజ రంగులో దీర్ఘచతురస్రాకృతిలో ఉండే బ్లాక్‌బాక్స్ ద్వారా విమాన ప్రమాదాలకు సంబంధించిన కీలక విషయాలు తెలుస్తాయి. ఏ నిమిషానికి ఏం జరిగిందో దీనిలో నిక్షిప్తమవుతుంది. విచారణాధికారులకు ఇది అత్యంత కీలకం. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐ-171 విమాన ప్రమాదం తర్వాత అందరి దృష్టీ బ్లాక్ బాక్స్‌పైపడింది. దీని కోసం అధికారులు తీవ్రంగా గాలించారు. శుక్రవారం వైద్య విద్యార్థుల హాస్టల్ శిథిలాల్లో పైకప్పు కింద బ్లాక్ బాక్సును గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు గుర్తించారు. ఈ విమానంలో రెండు బ్లాక్ బాక్సులున్నాయి. వీటిలో ఒకటి డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) దొరికిందని డీజీసీఏ అధికారవర్గాలు తెలిపాయి. దీనిలో రికార్డయిన సంభాషణలను విశ్లేషించనున్నట్టు పేర్కొన్నాయి. విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే 'మేడే కాల్' వ్యవహారం వెలుగుచూడడంతో దానిపై దృష్టి సారించనున్నారు. కాగా బ్లాక్ బాక్స్‌లు క్రాష్ రెసిస్టెంట్‌గా పనిచేస్తాయి. తీవ్ర విపత్తులు, అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు వాటిని గుర్తించేందుకు వీలుగా వీటిని రూపొందిస్తారు. ప్రతి కమర్షియల్ విమానంలోనూ రెండు చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక దాన్ని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్(సీవీఆర్)గా, రెండో దాన్ని ఫ్లైట్ డేటా రికార్డర్(ఎఫ్‌డీఆర్)గా పేర్కొంటారు. భూమిపై, నదులు, సముద్రాల్లో విమాన ప్రమాదాలు సంభవించినా బ్లాక్ బాక్స్‌లు సమాచారాన్ని పదిలంగా ఉంచుతాయి. గత 25 గంటల్లో జరిగిన సంభాషణల సమాచారం వీటిలో నిక్షిప్తమౌతుంది. ఈ రెండింటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదానికి ముందు విమానంలో ఏం జరిగింది, పైలట్లు ఏం మాట్లాడారో, వ్యవస్థలెలా పనిచేశాయో దర్యాప్తు అధికారులు తెలుసుకుంటారు. అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటనలో వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రతతో విస్ఫోటనం జరిగింది. అయినా డీవీఆర్‌తో కూడిన బ్లాక్ బాక్స్ చెక్కు చెదరలేదు.

ఎలా బతికానో నాకే అర్థం కావట్లేదు!

- విమానం కూలగానే నేనూ చనిపోయాననుకున్నా
- విమాన ప్రమాదంలో బతికి బయటపడ్డ రమేశ్ వ్యాఖ్యలు
- రమేశ్‌ను పరామర్శించిన ప్రధాని మోదీ


రమేశ్‌ను పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

అహ్మదాబాద్, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైన ప్రయాణికుడు విశ్వాస్‌కుమార్ రమేశ్ (45)! తాను బతకడం నిజంగా అద్భుతమేనని రమేశ్ చెప్పారు. ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం డీడీ న్యూస్‌తో ప్రమాద ఘటన గురించి వివరించారు. విమానం కూలగానే తాను కూర్చున్న సీటు ఊడి పడిందని, అందువల్లే తాను బతికి బయటపడ్డానని చెప్పారు. విమానంలో ఎడమవైపు ఉన్న తన 11ఏ సీటు అత్యవసర ద్వారానికి సమీపంలో ఉందన్నారు. "అంతా నాకళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కావడం లేదు. విమానం కింద పడగానే నేనూ చనిపోయాననుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి శిథిలాల్లో ఉన్నా. విమానం కూలిన తర్వాత నేను కూర్చున్న భాగం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయింది. విమానం డోర్ విరిగిపోయి ఉంది. నా సీటు విరిగిపోయి, ఎగిరి పడ్డా. వెంటనే లేచి, శిథిలాల నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చా. విమానం కుడివైపు భాగంలో ఉన్నవారికి పక్కనే గోడ ఉండడంతో బయటపడే మార్గం లేకపోయింది. ఎడమవైపు మాత్రం కొంత ఖాళీ ప్రదేశం ఉండడంతో నేను బయటపడగలిగా. నేను బతికానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నా కళ్ల ముందే ప్రయాణికులు ప్రాణాలొదిలారు. శిథిలాల నుంచి బయటకు వచ్చేటప్పుడు మంటల ధాటికి నా ఎడమ చేతికి గాయమైంది" అని రమేశ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్‌ను శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆయనకు ప్రాణాపాయంలేదని వైద్యులు తెలిపారు. కాగా బ్రిటన్‌లో నివాసముంటున్న రమేశ్ గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన ప్రాణాలతో బయటపడడాన్ని ఊహకందని అద్భుతంగానే భావిస్తున్నారు. ఎయిరిండియా విమానంలోని 11ఏ సీటులో రమేశ్ కూర్చున్నారు. ఈ సీటు అత్యవసర ద్వారాల్లో ఒకదానికి దగ్గర్లో ఉండడం కూడా రమేశ్ ఈ ప్రమాదం నుంచి బయటపడడానికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు. సీట్ మ్యాప్ ప్రకారం.. బోయింగ్ 787-8 విమానాల్లో ఎకానమీ క్లాస్‌లో మొదటి వరుసలో ఉన్న ఆరు సీట్లలో 11ఏ ఒకటి. అత్యవసరంగా బయటకి వెళ్లే మార్గాల్లో ఒకదానికి దగ్గర్లో ఉన్న కిటికీ సీటు ఇది. కాగా, ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 27బోయింగ్787-8 డ్రీమ్‌లైనర్ విమానాలున్నాయి. రానున్న రోజుల్లో ఈ విమానాలన్నింటినీ భద్రతా పరీక్షలకు పంపే అవకాశాలు ఉన్నాయి.

ఈ వినాశనం బాధాకరం

- బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం: నరేంద్ర మోదీ
- అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన ప్రధాని


రూపాణీ కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలుపుతున్న మోదీ

అహ్మదాబాద్, జూన్ 13: విమాన ప్రమాద స్థలంలో జరిగిన వినాశనం బాధాకరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ విషాద ఘటనలో తమవారిని కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోయిన ప్రాంతాన్ని ప్రధాని శుక్రవారం పరిశీలించారు. పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఆ రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘవితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. సుమారు 20 నిమిషాలు అక్కడే ఉండి.. ప్రమాద స్థలంలో పరిస్థితి, సహాయక చర్యల వివరాలను తెలుసుకున్నారు. బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంలోకి విమానం దూసుకెళ్లిన తీరును అధికారులు వారికి తెలిపారు. అనంతరం మోదీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విమాన ప్రయాణికుల్లో ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేశ్‌ను, విమానం కూలిన భవనంలో గాయపడి చికిత్స పొందుతున్న 25మంది మెడికోలు, ఇతరులను పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు. తర్వాత అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గుజరాత్ సెయిల్ కార్యాలయంలో ఆ రాష్ట్ర అధికారులు, పౌర విమానయాన అధికారులతో ప్రమాద ఘటనపై సమీక్షించారు. సహాయక చర్యల తీరు, మృతదేహాల గుర్తింపు వంటి అంశాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు తగు సహాయసహకారాలు అందించాలని ఆదేశించారు. తర్వాత ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "అహ్మదాబాద్‌లో విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించాను. అక్కడ జరిగిన వినాశనం బాధాకరం. సహాయక చర్యలుచేపట్టిన అధికారులు, బృందాలతో సమావేశమై పరిస్థితిని తెలుసుకున్నాను. ఈ విషాదకర ఘటనలో తమవారిని కోల్పోయిన బాధితులకు తోడుగా నిలుస్తాం"అని పేర్కొన్నారు.

విజయ్‌భాయ్ ఇకలేరని నమ్మలేకపోతున్నా..

విమాన ప్రమాదంలో కన్నుమూసిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ కుటుంబసభ్యులను ప్రధాని మోదీ పరామర్శించారు. అహ్మదాబాద్‌లోని విజయ్ రూపాణీ నివాసానికి వెళ్లి.. ఆయన భార్య అంజలి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. "విజయ్ భాయ్‌తో ఎన్నో ఏళ్లుగా కలిసి పనిచేశాను. గుజరాత్ అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన ఇక లేరన్న విషయాన్ని నేను నమ్మలేకపోతున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. విమానం కుప్పకూలిన ఘటనలో మరణించిన వారి కుటుంబసభ్యులు, బంధువుల కోసం ఎయిరిండియా శుక్రవారం 4 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీ, లండన్‌లోని గట్విక్ ఎయిర్‌పోర్టులలో ఈ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని... మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అహ్మదాబాద్‌కు చేరుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తాయని ప్రకటించింది.

పరిమళించిన మానవత్వం

200 మంది వలంటీర్లు..900 యూనిట్ల రక్త దానం

విమాన ప్రమాద బాధితులను ఆదుకునేందుకు క్యూకట్టిన వైనం

అహ్మదాబాద్, జూన్ 13: మానవత్వం పరిమళించే మంచి మనిషులు క్యూ కట్టారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో గాయపడిన వారికి రక్తదానం చేసేందుకు వందల సంఖ్యలో కదలివచ్చారు. గంటల వ్యవధిలోనే రక్త దానం చేస్తామంటూ.. వందల కొద్దీ పౌరులు మానవత్వాన్ని చాటుకున్నారు. స్వచ్ఛంద సంస్థ 'సహాయ్' నేతృత్వంలో రెడ్ క్రాస్ అహ్మదాబాద్ చాప్టర్ ప్రారంభించిన రక్త దాన శిబిరానికి 200మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 900యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ శిబిరం శుక్రవారం కూడా కొనసాగింది. "ప్రమాదం జరిగిన గంట వ్యవధిలోనే బాధితులకు రక్త దానం చేసి వారి ప్రాణాలను నిలపాలని తలపోశాం. ఆ వెంటనే రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సంప్రదించాం. బీజే మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఓ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మేం ఊహించనంతగా స్పందన వచ్చింది. రక్త దానం చేస్తామంటూ 200మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. విమాన ప్రమాద ఘటనలో బాధితులకు ప్రాణం నిలపాలన్న ఆతృతే వారిలో కనిపించింది. గురువారం రాత్రి 11గంటల వరకు 900 యూనిట్ల రక్తాన్ని సేకరించాం"అని 'సహాయ్' సభ్యుడు సాగర్ తెలిపారు.

కూతురు ఇంటికి పిలిచిందని...


హేమంత్ , నేహాబెన్

గుజరాత్, ఆనంద్ జిల్లాలోని ఖంబాట్‌కు చెందిన హేమంత్ పాండ్యా(52), నేహాబెన్ పాండ్యా(48) దంపతులకు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. వారి కుమార్తె పెళ్లి చేసుకుని భర్తతో కలిసి లండన్‌లో నివాసముంటోంది. కూతురి ఆహ్వానంతో లండన్ బయలుదేరిన పాండ్యా దంపతులు విమానం ఎక్కిన వెంటనే సెల్ఫీ తీసుకున్నారు. కానీ వారికిదే చివరి ఫొటో, ఆఖరి ప్రయాణమైంది.

లండన్ చేరగానే ఫోన్ చేస్తా నాన్నా..!!

ఫ్లైట్ బయలుదేరే టైమైంది. లండన్ చేరగానే ఫోన్ చేస్తా నాన్నా.. అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానంలోని ఎయిర్ హోస్టేస్‌లో ఒకరైన మిథాలీ పాటిల్ (23) తన తండ్రి మోరేశ్వర్ పాటిల్‌తో చివరిగా ఫోన్‌లో మాట్లాడిన మాటలివి. రెండేళ్లుగా ఎయిర్ హోస్టేస్‌గా పని చేస్తున్న మిథాలీ జీవిత ప్రయాణం హఠాత్తుగా ముగియగా.. ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ట్రావెలింగ్ సరదా ప్రాణాలు తీసింది

వడోదరకు చెందిన నీరజ్ లవానియా(50) అపర్ణ(49) దంపతులకు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. ప్రతీ ఏటా ఏదో ఒక కొత్త ప్రాంతానికి వెళ్లేవారు. ఎప్పటికైనా లండన్ చూడాలన్న వారి కోరిక తీర్చుకునేందుకు అహ్మదాబాద్‌లో గురువారం ఎంతో ఉత్సాహంగా విమానం ఎక్కారు. విమానం ఎక్కే ముందు నీరజ్ చివరిగా తన సోదరుడు సతీష్‌కు ఫోన్ చేసి తన లండన్ ప్రయాణం కోసం చెప్పాడు. ఆ తర్వాత కాసేపటికే ఆ దంపతులు చనిపోయారు. నీరజ్ దంపతుల ఏకైక కుమార్తె(16) కూడా తల్లిదండ్రులతో కలిసి వెళ్లాల్సింది. కానీ అమ్మమ్మ(70)కు తోడుగా ఇంట్లో ఉండిపోయింది.

మరిది పెళ్లికి వచ్చి ..


ఫాతిమా, సాధిక భాను

వడోదరకు చెందిన సాధిక భాను(23) తన భర్త, కుమార్తె ఫాతిమా(2)తో కలిసి కొంత కాలంగా లండన్‌లో నివాసముంటోంది. మే 16న జరిగిన తన మరిది వివాహం కోసం కూతురు ఫాతిమాను తీసుకుని సాధిక ఇటీవల వడోదర వచ్చింది. వేడుకల తర్వాత లండన్‌కు తిరుగు ప్రయాణమైన సాధిక, ఫాతిమాకు కుటుంబసభ్యులు విమానాశ్రయానికి వచ్చి సాగనంపారు. కానీ వారికి అదే చివరి చూపు అయింది. ప్రమాదంలో సాధిక, చిన్నారి ఫాతిమా మరణించారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ కృపాసాగర్

శ్రీవారి సేవలో జస్టిస్ కృపాసాగర్

తిరుమల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఉదయం అభిషేక సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే పంజాబ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజూరి నెహ్రూ కౌల్, కేంద్రమంత్రి కమలేష్ పాశ్వాన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అగ్రిగోల్డ్ భూములపై సీఐడీ విచారణ

కనిగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను సీఐడీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత భూరికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే తొలిరోజు కనిగిరి, వెలిగండ్ల మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు.



భయం పోయింది.. భద్రత పెరిగింది

కూటమి ఏడాది పాలనలో భారీగా తగ్గిన నేరాలు

- వైసీపీ హయాంలో ఏటా 1.52 లక్షల కేసులు..
- కూటమి వచ్చాక లక్ష లోపే నమోదు
- టెక్నాలజీతో నేరాల అదుపు.. సోషల్ సైకోలకు చెక్
- 'ఈగల్'తో గంజాయి స్మగ్లింగ్, సాగు కట్టడి
- 'శక్తి' యాప్‌తో మహిళలకు భరోసా
- పోలీసింగ్‌లో మార్పుతో నేరస్థుల వెన్నులో వణుకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో బిక్కుబిక్కు మంటూ బతికిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం రాకతో పెద్ద ఉపశమనం లభించింది. ప్రభుత్వం మారితే భయం పోయి భద్రతకు భరోసా ఉంటుందనే వారి నమ్మకం నిజమైంది. అరాచకం అంటే ఎలా ఉంటుందో ఐదేళ్లు అనుభవించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అటువంటిది మచ్చుకైనా కనిపించలేదు. ఐదేళ్లు గాడి తప్పిన శాంతిభద్రతలు నేడు అదుపులోకి వస్తున్నాయి. అరాచక శక్తులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రతి పల్లెలో సీసీ కెమెరాలతో నిఘా.. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్లతో పర్యవేక్షణ.. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పోలీసింగ్‌కు శ్రీకారం.. ఫలితంగా నేరస్థుల వెన్నులో వణుకుపుడుతోంది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అంచనా వేసేందుకు ఏటా నమోదయ్యే కేసుల సంఖ్య ప్రధాన కొలమానం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏకంగా 7,61,067 కేసులు నమోదయ్యాయి. సరాసరి రోజుకు 417, నెలకు 12,684, ఏడాదికి 1,52,213 కేసులతో రికార్డు సృష్టించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 జూన్ 1నుంచి 2020 మే 31వరకూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 1,86,386 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయి. తర్వాతి ఏడాది 2020-21లో 1,58,505 కేసులు నమోదయ్యాయి. 2021-22లో మరింత పెరిగి ఆ సంఖ్య 1,66,244కు చేరింది. 2022-23లో 1,38,746 కేసులు.. ఎన్నికల ఏడాది 2023-24లో 1,11,186 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టరయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం గత ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చాక నేరాలకు పాల్పడిన వారిని వెతికి పట్టుకుని కేసులుపెట్టి జైలుకు పంపింది. ఏడాది(జూన్ 2024నుంచి మే 2025) కాలంలో నమోదైన కేసుల సంఖ్య 99,675 మాత్రమే. దీనికి కారణం నేరాలను ముందే పసిగట్టే టెక్నాలజీని ఏపీ పోలీసులు అందిపుచ్చుకోవడం. నేరం జరిగితే వేగంగా స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం..అనుభవజ్ఞుడైన పాలకుడి దిశానిర్దేశం అని ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి అభిప్రాయపడ్డారు.

నాడు 'దిశ' మోసం.. నేడు 'శక్తి' ధైర్యం..

జగన్ పాలనలో తాడేపల్లిలోని ఆయన ప్యాలెస్ ముందే గంజాయి బ్యాచ్ దివ్యాంగురాలిపై అఘాయిత్యానికి పాల్పడితే చలించలేదు. కానీ, పొరుగు రాష్ట్రంలో వైద్య విద్యార్థిని హత్యతో ఇక్కడ 'దిశ' పేరుతో చట్టం చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. ఐదేళ్లలో ఆ చట్టం అమల్లోకి రాకపోగా కేవలం దిశ యాప్‌తోనే కాలం వెళ్లదీసి మహిళాలోకాన్ని మోసం చేశారు. మహిళలకు రక్షణగా ఉండాల్సిన పోలీసుల్ని వైసీపీ ఖాకీలుగా మార్చేసి కనీస శిక్షణ లేని మహిళా సంరక్షణ కార్యదర్శులకు యూనిఫామ్ వేసి మహిళా పోలీసులంటూ మభ్య పెట్టారు. ఐదేళ్ల అరాచక పాలనలో మహిళలపై నేరాలకు సంబంధించి 1,34,046 కేసులు నమోదయ్యాయి. ప్రతిపక్ష నేతల కుటుంబాల్లోని మహిళలు మొదలుకొని సొంత చెల్లిపైనే సోషల్ మీడియాలో దారుణమైన ట్రోల్స్ చేయించారు. ప్రభుత్వం మారగానే సోషల్ సైకోలకు చుక్కలు కనిపించాయి. మహిళల్ని సోషల్ మీడియాలో ఒక్క మాట అన్నా టీవీ డిబేట్లలో నీచ వ్యాఖ్యలు చేసినా పోలీసులు లాక్కెళ్లి లాకప్‌లో పడేశారు. వైసీపీ సోషల్ సైకో వర్రా రవీంద్ర రెడ్డి నుంచి సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్, నీచ వ్యాఖ్యల కృష్ణంరాజు వరకూ ఎవ్వరినీ వదల్లేదు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన 174 మందికి గత జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 31 మధ్య కోర్టుల ద్వారా శిక్షలు పడ్డాయి. మహిళల రక్షణ కోసం శక్తి యాప్ అందుబాటులోకి వచ్చింది. వాట్సాప్ ద్వారా ప్రతి మహిళకు, యువతికి పోలీసులు భరోసా ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుశిక్షితులైన మహిళా పోలీసులతో 164 శక్తి బృందాలను ఏర్పాటు చేసి ఆ విభాగానికి మహిళా ఐజీ రాజకుమారిని హెడ్‌గా నియమించింది. వైసీపీ పాలనలో ఏటా 26,809 కేసులు నమోదు కాగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 25,923 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయి.

గంజాయి కట్టడికి 'ఈగల్'..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఆంధ్రప్రదేశ్ పేరు వినిపించేది. మన్యంలో పది వేల హెక్టార్లలో అమాయక గిరిజనులతో సాగు చేయిస్తున్న ముఠాలను అడ్డుకునే పరిస్థితి అప్పట్లో లేదు. ప్రభుత్వం మారగానే గంజాయి కట్టడికి ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో 450 మంది పోలీసులతో 'ఈగల్' విభాగం ఏర్పాటైంది. గంజాయి సాగుపై స్థానిక పోలీసులతో కలిసి ఉక్కుపాదం మోపడంతో వంద ఎకరాల్లో కూడా ఈ ఏడాది సాగు లేదు. విద్యార్థుల్లో, యువతలో చైతన్యం తీసుకొచ్చి మత్తుకు దూరంగా ఉంచే ప్రయత్నం సత్ఫలితాలు ఇస్తోంది. వేల సంఖ్యలో అరెస్టులు, వాహనాలు సీజ్, లక్షల కిలోల గంజాయి దగ్ధంతో పరిస్థితి బాగా అదుపులోకి వచ్చింది. పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ఐజీ రవికృష్ణ నేతృత్వంలోని ఈగల్ బృందం కృషి చేస్తోంది.

సామాజిక అణచివేతకు చెక్..

దళిత డ్రైవర్‌ను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేయడం, మాస్క్ అడిగిన దళిత వైద్యుడు సుధాకర్‌ను నడిరోడ్డుపై పెడరెక్కలు విరిచి కొట్టడం మొదలుకొని రాజమండ్రిలో దళిత యువకుడికి పోలీసు స్టేషన్లో శిరోముండనం వరకు జగన్ పాలనలో దళితులను ఎంతో హింసించారు. రాజధాని ఎస్సీ రైతులపైనే అట్రాసిటీ కేసులు.. దళిత మహిళకు న్యాయం చేయాలన్నందుకు తెలుగు మహిళ అనిత (ప్రస్తుత హోంమంత్రి)పై కేసులు పెట్టి వేధించడం వరకూ పలు సందర్భాల్లో సామాజికంగా దళితులను అణిచివేసే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. గత ప్రభుత్వంలో దళితులపై సగటున ఏడాదికి 2,600 కేసులు నమోదు కాగా ఆ సంఖ్య ప్రస్తుత ప్రభుత్వంలో 2,170కి తగ్గింది.

ఏలూరులో వేగ జ్యూయలర్స్ ప్రారంభం

ఏలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద విశాలమైన ప్రాంగణంలో వేగ జ్యువెలర్స్ షోరూమ్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ షోరూమ్‌ను సినీ నటి సంయుక్త మీనన్‌తో కలిసి సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వేగ జ్యువెలర్స్ కస్టమర్లకు నాణ్యమైన సేవలను అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తూ, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిందన్నారు. సంయుక్త మీనన్ మాట్లాడుతూ ప్రతీ లక్ష రూపాయల కొనుగోలుపైన ఉచిత బంగారం నాణెం అందించడమే కాకుండా సంప్రదాయ నగల నుంచి ఫ్యాషన్ నగలు వరకు ఆభరణాలు అందుబాటులో ఉంచారని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ ప్రజల విశ్వాసం పొందిందని ఆ సంస్థ చైర్మన్లు, బండ్లమూడి రామోహ్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్‌కుమార్, డైరెక్టర్లు వనమా సుధాకర్ అన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, తదితరులు షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



వేగ జ్యూయలర్స్ ప్రారంభోత్సవంలో సంయుక్త మీనన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలకృష్ణ

బెలుం గుహలకు వారసత్వ జాబితాలో చోటు

మంత్రి దుర్గేష్ హర్షం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పురాతన సంస్కృతీ వారసత్వానికి ప్రతీక అయిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహలకు భౌగోళిక వారసత్వ జాబితాలో చోటు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. భౌగోళిక వారసత్వ ప్రదేశంగా వచ్చిన గుర్తింపుతో మరింత అభివృద్ధికి అవకాశం ఉందని ఆయన ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వందల ఏళ్లనాటి ఈ గుహలకు పర్యాటకంగా మరింత ప్రాచుర్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయలసీమలో పదుల సంఖ్యలో ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటన్నింటినీ అభివృద్ధి చేస్తామని మంత్రి చెప్పారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయండి: గవర్నర్

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025ను 'రక్తాన్ని ఇవ్వండి. ఆశను ఇవ్వండి. కలిసి మనం ప్రాణాలను కాపాడుదాం' అనే ఇతివృత్తంలో జరుపుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత అందరూ ఏపీ రెడ్‌క్రాస్ మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని, స్వచ్ఛంద రక్తదానికి ముందుకు వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 రెడ్‌క్రాస్ రక్త కేంద్రాల్లో రక్తదానం చేయాలని కోరారు.

లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు: టీటీడీ

తిరుమల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. లడ్డూ ప్రసాదంపై తెలంగాణకు చెందిన భక్తుడు చేసిన ఆరోపణలు అసత్యమని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. 'జూన్ 8న శ్రీవారి లడ్డూప్రసాదం తినేటప్పుడు నోట్లో గాయమైందని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ ఆరోపించారు. వైద్య పరీక్షల్లో నాలుక కొరుక్కోవడంతో గాయమైనట్టు తేలింది. టీటీడీ నుంచి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశంతో లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో అతను చేసిన అసత్య ఆరోపణల్ని ఖండిస్తున్నాం' అని టీటీడీ పేర్కొంది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో యుద్ధం!

ఇరాన్ గుండెలమీద కొట్టాం అన్నారు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ. అతిశయోక్తి ఏమీ లేదు. ఇజ్రాయెల్ చేతిలో అది నవనాడులూ కుంగిపోయేలా దెబ్బతిన్నది. అనేక దశాబ్దాలుగా ఎన్నడూ చవిచూడని ఘోరపరాభవం ఇది. దిక్కూమొక్కూలేని గాజాలో ఎంతదాష్టీకంతో మానవహననాన్ని సాగిస్తున్నదో, అదే తరహాలో ఇరాన్‌లోనూ ఇజ్రాయెల్ రెచ్చిపోయింది. ఇరానియన్లు గాఢనిద్రలో ఉండగా, ఇజ్రాయెల్‌కు చెందిన రెండువందల యుద్ధవిమానాలు చొరబడి, వేర్వేరు ప్రాంతాల్లోని కనీసం వందచోట్ల వందలాది క్షిపణులను కురిపించాయి. యురేనియం శుద్ధి ప్లాంట్లు, సైనికస్థావరాలు, మిసైల్ కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిపానని ఇజ్రాయెల్ చెప్పుకుంది కానీ, నూటయాభైమంది సామాన్యజనం కూడా మరణించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కేంద్రకార్యాలయం మీద దాడిచేసి ఆ సంస్థ అధినేత సహా పలువురు కీలకనాయకులనూ, అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టడం చిన్న విషయం కాదు. ఇరాన్ ఏకంగా తన సైన్యాధ్యక్షుడినే ఈ దాడుల్లో కోల్పోవడం తీవ్ర అవమానం. నంతాజ్ అణుకేంద్రం సహా అనేక కీలకస్థావరాలమీద పదేపదే విరుచుకుపడి, ఇరాన్ అణుకార్యక్రమాన్ని ఇక అడుగు కూడా కదలనివ్వకుండా చేయగలిగింది ఇజ్రాయెల్. యుద్ధానికి కాలుదువ్విన ఇజ్రాయెల్‌కు గట్టిగుణపాఠం చెబుతానని ఇరాన్ హెచ్చరికలు చేస్తోంది. అది ఎప్పుడో, ఏ స్థాయిలో ఉంటుందో తెలియదు.

ఇరాన్ అణుకార్యక్రమం అమితవేగంగా సాగుతోందని, వారాల్లో కాకున్నా, కొద్దినెలల్లోనే అది అణ్వస్త్రాలను తయారుచేయగల స్థాయికి చేరుకుందని ఇటీవల పాశ్చాత్య మీడియానుంచి వరుసకథనాలు వెలువడుతున్నప్పుడే మనకు అసలు కథ అర్థమైంది. ఇరాన్ కట్టుతప్పిందని, నిబంధనలను ఉల్లంఘిస్తోందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) గవర్నర్ల బోర్డు గురువారం తీర్మానించడంతో, దాడికి పూర్వరంగం సిద్ధమవుతోందని తెలిసిపోయింది. ఇప్పుడు నెతన్యాహూ కూడా తన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' లక్ష్యాన్ని నొక్కిచెబుతూ, ఒకటీ రెండూ కాదు, ఏకంగా తొమ్మిది అణుబాంబులు తయారుచేయగలిగే శక్తి ఇరాన్‌కు ఉందన్నారు. శుద్ధిచేసిన యురేనియం ఇరాన్ దగ్గర ఎంతో పోగుపడిందనీ, ఆ దేశాన్ని ఇప్పుడే ఆపకపోతే అణ్వాయుధాలు తయారుచేసి ప్రపంచపటం నుంచి ఇజ్రాయెల్‌ను చెరిపేస్తుందని, ఈ ముందస్తు దాడులు ఆత్మరక్షణకేనని నెతన్యాహూ అంటున్నారు. ఇరాన్ ముప్పు పూర్తిగా తొలగిపోయేంతవరకూ ఈ ముప్పేటదాడి కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో నంతాజ్ అణుకేంద్రం పూర్తిగా ధ్వంసమైందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రకటించింది. ఒకపక్క అమెరికాతో దశలవారీ చర్చలు జరుగుతూండగా, ఇజ్రాయెల్ ఈ దాడులు చేయడం విశేషం. ఈ చర్యతో తమకు సంబంధం లేదని అమెరికా వెంటనే ప్రకటిస్తూ, ప్రతీకారం పేరిట హద్దులు దాటవద్దని ఇరాన్‌ను హెచ్చరించింది. కానీ, ఇరాన్‌కు ఇది తగిన గుణపాఠమని, మరిన్ని దాడులకు గురికాకుండా ఉండాలంటే దారికొచ్చి, తనతో ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు చేయడం విశేషం. ఇజ్రాయెల్ దాడిలో తన పాత్రేమీలేకున్నా, తనకు చెప్పే ఈ దాడి జరిగిందని అమెరికా తేల్చేసింది. బరాక్ ఒబామా ఏలుబడిలో కుదిరిన ఒక చక్కని అంతర్జాతీయ ఒప్పందాన్ని 2018లో నిలువునా పాతరేసిన ట్రంప్, ఈ విడతలో మళ్ళీ ఒప్పందం కోసం పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఇరాన్ తన యురేనియం శుద్ధికార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసి, ఇప్పటికే తన దగ్గరున్న 400కేజీల యురేనియంను నాశనం చేయాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారని, అందుకు ఇరాన్ అంగీకరించడం లేదని వార్తలు వచ్చాయి. అరవైరోజుల్లో రాజీకి రావాలని అప్పుడే హెచ్చరించాను, ఇవాళ 61వ రోజు అని ఈ దాడుల అనంతరం ట్రంప్ ట్వీట్ చేయడం విశేషం.

అప్పట్లో ఒబామా ఆధ్వర్యంలో కుదిరిన ఒప్పందం ఇరాన్‌ను మిగతా ప్రపంచానికి జవాబుదారీని చేసి, పరిధుల్లోనూ, పర్యవేక్షణలోనూ ఉంచింది. అప్పటివరకూ యుద్ధభయంతో ఉన్న ప్రపంచానికి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. యుద్ధం తప్ప శాంతి గిట్టని, ఒప్పందాల మాటే నచ్చని నెతన్యాహూ మాత్రం ఆదినుంచీ దానిని వ్యతిరేకిస్తూ ట్రంప్ అధికారంలోకి రాగానే సదరు ఒప్పందాన్ని కాలదన్నేట్టు చేశారు. ఇప్పుడు మళ్ళీ ఒప్పందం పేరిట ఒక కొత్త కథకు ట్రంప్ తెరదీసినా, ఇరువురి అంతిమ లక్ష్యం ఇరాన్‌ను నాశనం చేయడమే. ఇజ్రాయెల్ దాడితో ఆదివారం ఒమాన్‌లో జరగాల్సిన మరోవిడత చర్చలకు విఘాతం ఏర్పడింది. సైన్యంతో తప్ప, సామరస్యంగా వ్యవహరించడం గిట్టని నెతన్యాహూ, తన చేతికి మట్టి అంటకుండా ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అనుకుంటున్న ట్రంప్ ఈ ప్రపంచాన్ని పెనుప్రమాదంలోకి నెట్టకపోతే అంతేచాలు.

మోదీ పాలనపై సామాన్యుడి సణుగుడు

ఏ విషయం పైన అయినా ఒకే ఒక్క సరైన దృక్పథమనేది ఉండదు. ఐన్‌స్టీన్ అమోఘ సృష్టి సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని జయంత్ నార్లికర్ సహా పలువురు శాస్త్రవేత్తలు ప్రశ్నించారు. దురుద్దేశమనేది లేనంతవరకు ఏ దృష్టి కోణంలోనైనా ఎంతో కొంత సత్యం తప్పక ఉంటుంది. ఆ సత్యాన్ని గౌరవించి తీరాలి. భిన్న దృక్పథంలోని సత్యాన్ని గుర్తించి, గౌరవించే గుణ విశేషం ప్రస్తుత ప్రభుత్వానికి లేనే లేదు. గత 11 సంవత్సరాలలో అటువంటి సుగుణాన్ని అలవరచుకునే ప్రయత్నం అది ఏ కోశానా చేయలేదు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయ్యాయి. సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా ఉన్న నాయకులలో ఆయన మూడవవారు. ఆ అత్యున్నత పదవిలో ఇంతకాలం ఉండడమే, తన పార్టీని ఎన్నికలలో గెలిపించగల ఆయన పట్టుదల, సామర్థ్యానికి నిదర్శనం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రతి ప్రభుత్వంలోను మంచి–చెడు రెండూ ఉంటాయి. ఎన్డీఏ ప్రభుత్వమూ ఇందుకు మినహాయింపు కాదు. ఒక ప్రభుత్వ పనితీరును అంచనా వేసేందుకు ప్రజలు ప్రాతిపదికగా తీసుకునే ప్రమాణాలు భిన్నంగా ఉంటాయి. అవి పరిమాణాత్మకమైనవి కావు. 'సుపరిపాలన' అనేది ఆ అంచనాకు ప్రమాణం, ప్రాతిపదిక. సుపరిపాలన ఉంటే ఒక దేశం సకల ప్రజలకు మెరుగైన, బలమైన, న్యాయమైన సమాజంగా కనిపిస్తుంది. తన కుటుంబానికి మరింత సౌఖ్యదాయక జీవితం చేకూరగలదనే సంతృప్తి ప్రతి వ్యక్తికీ సమకూరుతుంది. సుపరిపాలన నాణ్యతను పరిమాణాత్మకంగా వివేచించలేము, గ్రహించలేము. నా అంచనాలో భారత్ అందరికీ మెరుగైన, బలమైన, అనుకూలమైన జీవన స్థితిగతులను సమకూర్చేదిగా లేదు. లక్షలాది ప్రజల స్థితిగతులు మెరుగుపడ్డాయి, సందేహం లేదు. అయితే మరెన్నో లక్షల మంది బతుకులు నిత్య అనిశ్చితి, పేదరికం, నిరుద్యోగం, భయంతో నాశనమయ్యాయి. ఎంతో మందికి ఈ హాని ఇంకా మరింత తీవ్రంగా వాటిల్లుతోంది.

భారతదేశ వృద్ధిరేటును పెంపొందించే లక్ష్యంతో ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ విధానాలను అమలుపరిచాము. యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల పాలన (2004–14)లో సగటు జీడీపీ వృద్ధి రేటు పాత అంచనాల ప్రకారం 7.46 శాతం కాగా కొత్త అంచనాల ప్రకారం 6.7 శాతంగా ఉన్నది. 2014–15 తరువాత, మరీ ముఖ్యంగా 2019–20 తరువాత అధికారిక గణాంకాలే జీడీపీ వృద్ధిరేటు మందగిస్తున్నదని వెల్లడించాయి. 2024–25లో వృద్ధిరేటు పెరుగుదల స్వల్పస్థాయిలోనే ఉన్నది.

ప్రజల మెరుగైన జీవన పరిస్థితులకు ప్రమాణం వారి తలసరి ఆదాయమే కానీ, జీడీపీ పరిమాణం కాదు. యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల పాలనలో దేశ ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు కంటే ఎక్కువయింది. వాస్తవంగా అది 2.64 రెట్లు పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే భారత ప్రజల తలసరి ఆదాయం 543 నుంచి 1438 డాలర్లకు పెరిగింది. ఎన్డీఏ ప్రభుత్వాల పాలన మొదటి పది సంవత్సరాలలో భారత ప్రజల తలసరి ఆదాయం 1.89 రెట్లు మాత్రమే పెరిగింది. అంటే 1438 నుంచి 2711 డాలర్లకు పెరిగింది. 11వ సంవత్సరంలో అది 2878 డాలర్లకు పెరిగింది. ఈ ప్రకారం తలసరి ఆదాయం విషయంలో మన దేశం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నది. మరి అభివృద్ధి చెందిన దేశంగా పరిగణన పొందాలంటే తలసరి ఆదాయం 14,000 డాలర్లకు పెరగాలి. ఇది ఎప్పటికి సాధ్యమవుతుంది?



'భారతీయుడిని అయినందుకు గర్విస్తున్నానా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే సమాధానం సానుకూలంగా ఉంటుంది. 'భారత్‌ను పరిపాలిస్తున్న తీరుతెన్నుల పట్ల సంతోషంగా ఉన్నానా' అని ప్రశ్నించుకుంటే జవాబు వ్యతిరేకంగా ఉంటుంది. సమస్త భారతీయులకు మరింత మెరుగైన, శక్తిమంతమైన, న్యాయమైన సమాజంగా భారత్ వర్ధిల్లే రోజు కోసం ఎదురుచూస్తున్నాను.

అసమానతలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు సంపన్నులు/ అధిక సంపన్నులు (దేశ జనాభాలో ఎగువ 20 శాతం), పేదలు/నిరుపేదలు (దేశ జనాభాలో దిగువ 20 శాతం) అందరిలోను భయం, అభద్రత గూడు కట్టుకున్నాయి. మెజారిటేరియనిజం ప్రబలమవుతోంది, మతోన్మాదం పెచ్చరిల్లుతోంది, కుల ఘర్షణలు పెరిగిపోతున్నాయి, విద్వేష ప్రసంగాలు, రాతలకు అడ్డూ అదుపు ఉండడం లేదు, ఆశ్రిత పెట్టుబడిదారీతనం నిర్లజ్జగా వర్ధిల్లుతోంది, నేర విచారణా వ్యవస్థ కూలిపోయింది; సమాఖ్య పాలనా పద్ధతి బీటలు వారింది, పాలనలో నిరంకుశ ధోరణులు తీవ్రమవుతున్నాయి. ఇందుకు రెండు ఉదాహరణలు చాలు: (1) ఆదాయ పన్ను చట్టం నుంచి మనీలాండరింగ్ నిరోధక చట్టం దాకా అనేక చట్టాలను రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడానికి దుర్వినియోగం చేస్తున్నారు; (2) నిధుల కొరత నెదుర్కొంటున్న ముంబై సబర్బన్ రైల్వేస్ పరిధిలో 2014–25 సంవత్సరాల మధ్య సంభవించిన రైలు ప్రమాదాలలో 29,970 మంది మరణించగా 30,214 మంది గాయపడ్డారు. ఈ సబర్బన్ రైల్వే నెట్‌వర్క్ పరిస్థితుల మెరుగుదలను ఉపేక్షించి ముంబై–అహ్మదాబాద్‌ల మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.1,08,00 కోట్లు ఖర్చు పెట్టారు.

దేశం దృఢంగా ఉండడమంటే ఏమిటి? సమైక్యంగా ఉండడం, ఇరుగు పొరుగుదేశాలతో స్నేహ, సహకార సంబంధాలు కలిగి ఉండడం, సరిహద్దులు భద్రంగా ఉండడం, సమర్థమైన సాయుధ బలగాలు, ప్రపంచ దేశాలతో సహృద్భావపూర్వక దౌత్య, వాణిజ్య సంబంధాలు ఉండడం, అంతర్జాతీయ వేదికలపై గౌరవప్రదమైన ప్రాధాన్యం లభించడం. పహల్గాంలో ఉగ్ర ఘాతుకం, ఆపరేషన్ సిందూర్ తరువాత మన బలహీనతలు బయల్పడ్డాయి. ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ అఫ్ఘానిస్తాన్‌లకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలను పంపలేదు. ఆ దేశాలూ పహల్గాం, సిందూర్‌పై బహిరంగంగా మాట్లాడలేదు. అనేక దేశాలు ఉగ్రవాద దాడిని ఖండించాయి. అయితే ఏ దేశమూ ఆ దాడి వెనుక ఉన్న పాకిస్థాన్ ప్రమేయాన్ని ఖండించలేదు. సంప్రదాయ యుద్ధ తంత్రంలో పాకిస్థాన్‌పై భారత్‌కు ఉన్నదని అనుకుంటున్న ఆధిక్యతపై సందేహాలు ముసురుకున్నాయి. పలు అంతర్జాతీయ కూటములలో సభ్య దేశంగా ఉన్న భారత్ ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించింది. పైగా దౌత్య వ్యవహారాలలో భారత్, పాకిస్థాన్‌లకు సమ ప్రాధాన్యమిస్తోంది. ఐఎమ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ల బోర్డ్‌లో సభ్యత్వమున్నా ఆ రెండు సంస్థలూ ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌కు భారీ రుణాలు మంజూరు చేయడాన్ని భారత్ నిలువరించలేకపోయింది. ఫ్రెంచ్, రష్యన్, ఇజ్రాయెలీ సైనిక సామగ్రితో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ నాలుగు రోజుల యుద్ధం చేసింది. భారత్ శక్తిమంతంగా ఉండవచ్చుగానీ మనం విశ్వసిస్తున్నంత శక్తిమంతంగా లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి అధికారాన్నీ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నారు. ప్రభుత్వ విజయాల ఘనత తనదే అని ఆయన చెప్పుకోవచ్చు గానీ ప్రభుత్వ వైఫల్యాలు అన్నిటికీ ఆయనే బాధ్యత వహించి తీరాలి. 'భారతీయుడిని అయినందుకు గర్విస్తున్నానా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే 'అవును, గర్విస్తున్నాను' అని తప్పక సమాధానం చెప్పుకుంటాను. 'భారత్‌ను పరిపాలిస్తున్న పద్ధతి పట్ల సంతోషంగా ఉన్నానా' అని ప్రశ్నించుకుంటే సంతోషంగా లేను అనేదే స్పష్టమైన సమాధానం. సమస్త భారతీయులకు మరింత మెరుగైన, శక్తిమంతమైన, న్యాయమైన సమాజంగా భారత్ వర్ధిల్లే రోజు కోసం ఎదురుచూస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఆ 'చీకటి రోజుల్లో' నేను–నా దేశం

వర్తమానం గతంతో ముడివడివుంటుంది. మన ప్రజాస్వామ్య వక్రగతికి ఒక పూర్వ దృష్టాంతం–ఎమర్జెన్సీ. ఈ జూన్ 26కు సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం ఆ 'చీకటి అధ్యాయం' మొదలయింది. నేను నా 'India after Gandhi'లో ఆ చీకటి రోజుల గురించి వివరంగా రాశాను. అత్యవసర పరిస్థితి కాలంలో భారతదేశ చరిత్ర గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఎమ్మా టార్లో (Unsettling Memories. Narratives of the Emergency in Delhi), గ్యాన్ ప్రకాశ్ (Emergency Chronicles: Indira Gandhi and Democracy's Turning Point), క్రిస్టోఫెజఫ్రెలాట్, ప్రతినావ్ అనిల్ (India's First Dictatorship: The Emergency, 1975–1977), సుగత శ్రీనివాసరాజు (The Conscience Network: A Chronicle of Resistance to a Dictatorship | Untold History of India's Emergency Resistance | US Solidarity, Indian Diaspora & Gandhi-Inspired Civil Rights) పుస్తకాలు చదవాల్సిందిగా సూచిస్తున్నాను. ఈ కాలమ్‌లో ఢిల్లీలో ఒక కళాశాల విద్యార్థిగా ఎమర్జెన్సీ కాలంలో నా వ్యక్తిగత అనుభవాలను రేఖా మాత్రంగా వివరిస్తాను. వీడని జ్ఞాపకాలవి.



ఇంటర్నెట్ అప్పటికి ఇంకా సుదూర భావి అద్భుతమే. విశ్వసనీయమైన సమాచారానికి ఆకాశవాణి, దూరదర్శన్‌పై ఆధారపడే పరిస్థితి లేదు. పలు పత్రికా కార్యాలయాలు ఉన్న బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లో ఒక పెద్ద బ్లాక్ బోర్డ్‌పై ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ఫ్లాష్ అవుతున్నాయి. అమేథీలో సంజయ్‌గాంధీ ఓడిపోయాడన్న వార్త వచ్చినప్పుడు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. రాయబరేలీలో ఇందిర అపజయం పాలయ్యారని తెలియగానే మరింతగా హర్షధ్వానాలు చేశాము.

మే 1975లో నేను న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం పూర్తి చేశాను. వేసవి సెలవులకు డెహ్రాడూన్‌లో ఉండే నా తల్లిదండుల వద్దకు వెళ్లాను. సెలవుల్లో ఉన్నప్పుడే అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. జూలై మూడవ వారంలో కళాశాల కేంపస్‌కు తిరిగివచ్చాను. ఎమర్జెన్సీ విషయం నా మనసులో లేనేలేదు. ప్రధాని ఇందిర తన ప్రత్యర్థులు అందరినీ ఖైదు చేయడం, దీని ప్రభావాలు, పర్యవసానాలు వర్తమాన, భావి భారత దేశంపై ఎలా ఉంటాయన్న విషయమై నేనేమీ ఆలోచించలేదు. అసలా విషయమే నాకు పట్టలేదు. అప్పుడు నా వయసు 17 సంవత్సరాలు మాత్రమే. కళాశాల క్రికెట్ జట్టులో నాకొక స్థానాన్ని దక్కించుకోవడం గురించే నా ధ్యాస అంతా. ఆ మాటకొస్తే స్టీఫెన్స్‌లోని నా సహపాఠాలు ఎవరికీ రాజకీయాల గురించి పెద్దగా ఆసక్తి లేనివారే. రాజకీయ వ్యవహారాల పట్ల మా ఉదాసీనతను కళాశాల పాలకవర్గం పనిగట్టుకుని ప్రోత్సహించేది. ఢిల్లీ విశ్వవిద్యాలయ స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గ స్థానాలకు ఎన్నికలు చాలా తీవ్ర పోటీతో జరిగాయి. ఆ ఎన్నికలలో ఓటు వేసేందుకు స్టీఫెన్స్ విద్యార్థులకు అనుమతి లేదు! విశ్వవిద్యాలయంలోని ఇతర కళాశాలల–హిందూ, హన్స్‌రాజ్, రాంజాస్, కిరోరిమాల్ విద్యార్థులు అందరూ చాలా ఉత్సాహంగా ఆ ఎన్నికలలో పాల్గొన్నారు. సరే, ఢిల్లీకి మరో చివర జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న విశ్వవిద్యాలయం విద్యార్థులు అందరూ రాజకీయాలలో మరింత చురుగ్గా ఉండేవారు.

మహాత్మాగాంధీ సన్నిహితుడు సి.ఎఫ్ ఆండ్రూస్ మా కళాశాలలో అధ్యాపకుడుగా ఉండేవారు. ఈ విషయాన్ని మేము గొప్పగా, సగర్వంగా చెప్పుకునే వాళ్లం. మా కళాశాల నుంచి హర్ దయాళ్, బ్రిజ్‌కృష్ణ చండీవాలా మొదలైన స్వాతంత్ర్య సమరయోధులు వచ్చినప్పటికీ ముంబై, పూణే, కోల్‌కతా, చెన్నై, వారణాసి, అలహాబాద్, పాట్నా తదితర నగరాలలోని కళాశాలలతో పోలిస్తే స్వాతంత్ర్యోద్యమానికి చేసిన దోహదం వెలవెలబోతుంది. రాజకీయాల పట్ల ఉపేక్ష స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగింది. స్టీఫెన్స్ నుంచి ప్రభవించిన ప్రతిభావంతులు సివిల్ సర్వీసెస్‌లో చేరేందుకు ప్రథమ ప్రాధాన్యమిచ్చేవారు. 1960 దశకంలో కొంతమంది మార్క్సిజం పట్ల ఆకర్షితులయ్యారుగానీ వారు కేవలం దారి తప్పినవారు మాత్రమే. వారి సమకాలికులు ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ పదవులనధిష్ఠించడమే లక్ష్యంగా పెట్టుకునేవారు. జర్నలిస్టులు, విద్యావేత్తలు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు అయినవారూ చాలా మంది ఉన్నారు. నాకు తెలిసిన స్టీఫెన్స్ కళాశాలకు గుణ విశేషాలు చాలా ఉన్నాయి గానీ రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొనడం వాటిలో ఒకటి కానేకాదు. మేము వర్తమానంలో నివసించేవాళ్లం, భవిష్యత్తు వర్తమానం అయినప్పుడు మాత్రమే దాని గురించి ఆలోచించే వాళ్లం.



■ రామచంద్ర గుహ

గతానుగతం

వేసవి సెలవుల అనంతరం జూలైలో కళాశాలకు తిరిగివచ్చాను. కళాశాలలో పరిస్థితులు యథాతథంగా ఉన్నాయి. ప్రతిపక్ష నాయకుల నిర్బంధం, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు మమ్మలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. ఎప్పటిలాగానే పిచ్చాపాటీ చేసేవాళ్లం, సందడి చేసేవాళ్లం, ఆడుకునేవాళ్లం. 1975 ద్వితీయార్థంలో క్రికెట్‌లో నా నైపుణ్యాలను మరింతగా మెరుగుపరచుకోవడంపై శ్రద్ధ పెట్టాను. అలాగే నా తోటివారు తమ తమ ప్రత్యేక అభిరుచులకు ప్రాధాన్యమిచ్చేవారు. షేక్స్పియర్ నాటకాలు చదవడం, బ్రిడ్జి ఆడడం, శాస్త్రీయ సంగీతం వినడం మొదలైన వాటిపై వారు అమితాసక్తి చూపేవారు.

సరే, ఎమర్జెన్సీ కొనసాగుతూనే ఉన్నది. దాని మాటున జరుగుతున్న ఘోరాలూ మాకు మెల్లమెల్లగా తెలియవస్తున్నాయి. ప్రధానమంత్రి కుమారుడు సంజయ్‌గాంధీకి ప్రమేయమున్న ఉదంతాలు తెలిసినప్పుడు దిగ్భ్రాంతికి లోనవుతుండేవాళ్లం. విద్యార్థులు ఎంతగానో అభిమానిస్తుండే విజయన్ (ఉన్ని) నాయర్ విషయం సంజయ్ దృష్టికి వెళ్లింది. ఆయన, విజయన్ డెహ్రాడూన్ స్కూల్‌లో సహ విద్యార్థులు. ఇరువురికీ ఉమ్మడి స్నేహితుడు అయిన ఒక వ్యక్తి ద్వారా కళాశాల అధ్యాపకత్వాన్ని వదిలివేసి, 'దేశాన్ని పాలించడం'లో తనకు సహాయకారిగా ఉండేందుకు రమ్మని సంజయ్ ఆహ్వానించాడు. అయితే ఇందుకు విజయన్ ససేమిరా అన్నారు. తాను తన వృత్తిలో సంతృప్తికరంగా ఉన్నానని సంజయ్‌కు సమాధానమిచ్చారు. యూనివర్సిటీ కాఫీ హౌస్‌లో మేము ఒక వ్యక్తిని రోజూ చూస్తుండేవాళ్లం. ఆయన గడ్డం గోధుమ రంగులో ఉండేది. ఆయన సులోచనాలు కూడా అదే రంగులో ఉండేవి. గంటల తరబడి అక్కడే కూర్చునేవాడు. సదా కాఫీ తాగుతూ ఉండేవారు. కాఫీ కాకపోతే ధూమపానం. చివరకు మేము ఆ వ్యక్తి ఇంటెలిజెన్స్ బ్యూరో ఏజెంట్ అనే నిర్ధారణకు వచ్చాం. కేంపస్‌లో పరిస్థితుల గురించి వాకబ్ చేయడమే అతని విధి. అందుకే నిత్యం యూనివర్సిటీ కాఫీ హౌస్‌లో ఉండేవాడు.

ఈ అనుభవాలతో, నాలో అప్పటివరకు నిద్రాణంగా ఉన్న రాజకీయ చైతన్యం మేలుకోవడం ఆరంభమయింది. ఏప్రిల్ 1976 రెండో వారంలో ఒక రాత్రి ఆకాశవాణి ప్రభుత్వ కాకారాయుడు ఒకరు చేసిన ఓ వ్యాఖ్య నా రాజకీయ చైతన్యాన్ని జాగరూకం చేసింది. ఆ రాత్రి మేము ఒక ట్రాన్సిస్టర్ రేడియో చుట్టూ మూగి క్రికెట్ కామెంటరీ వింటున్నాం. పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో వెస్టిండీస్‌పై టెస్ట్ మ్యాచ్ చివరిరోజు అది. 400కు పైగా పరుగులు సాధిస్తేగానీ మన జట్టు విజయం సాధించే అవకాశం లేదు. మన లిటిల్ మాస్టర్ల ద్వయం –సునీల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్ – ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఇంకేముంది, ఆకాశవాణిలోని మన వ్యాఖ్యాత తన ఆనందాన్ని ఇలా వ్యక్తంచేశాడు: 'యే ఇందిరాగాంధీ కా దేశ్ హై! యే బీస్ సూత్రి కారి కారమ్ కా దేశ్ హై!' (ఇది ఇందిరా గాంధీ భూమి! ఇది ఆమె ఇరవై సూత్రాల కార్యక్రమం అమలవుతున్న దేశం). ఈ వ్యాఖ్య విన్న వెంటనే అది దేశానికి చాలా అవమానకరంగా ఉన్నదని నేను భావించాను. క్రికెటర్లు తమ ప్రతిభాపాటవాలతో దేశానికి సాధించిన కీర్తిచంద్రికలను నిరంకుశ పాలకురాలు అయిన రాజకీయవేత్త ఘనతగా పేర్కొనడం మితిమీరిన భజనపరత్వం కాక మరేమిటి?


1977 సంవత్సరారంభంలో ఎమర్జెన్సీని ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలు ప్రకటించారు. ఇందిర, ఆమె కాంగ్రెస్‌ను వ్యతిరేకించే నాలుగు పార్టీల కలయికతో కొత్త జనతా పార్టీ ఆవిర్భవించింది. మా కళాశాలకు సమీపంలో ఉన్న మారిస్ చౌక్‌లో జనతా పార్టీ ర్యాలీ నొకదాన్ని నిర్వహించారు. వేలాది ఇతర విద్యార్థులతో పాటు నేనూ ఆ సభకు వెళ్లాను. సోషలిస్టు రాజ్ నారాయణ్ నెహ్రూల–కీర్తిశేషులు, సజీవులు, పుట్టబోయేవారు–పై తీవ్ర విమర్శలు చేశారు. నెహ్రూ సోదరి విజయలక్ష్మీ పండిట్ డెహ్రాడూన్ నుంచి ప్రత్యేకంగా వచ్చి ఆ ర్యాలీలో ప్రసంగించారు పౌర హక్కులు పునరుద్ధరించాలని, తన మేనకోడలి నియంతృత్వ పాలనకు చరమ వాక్యం పలకాలని ఓటర్లకు ఆమె పిలుపునిచ్చారు. పలువురు విద్యార్థి నాయకులు (మా కళాశాలకు చెందినవారు ఒక్కరూ లేరు), జనసంఘ్ నాయకుడు అటల్ బిహారీ వాజపేయి కూడా ఆ ర్యాలీలో ప్రసంగించారు. వాజపేయి ఉపన్యాసం శబ్ద సౌరళ్యంతో సంస్కారవంతంగాను, శ్రావ్యంగాను ఉన్నది. ఆయన హాస్యోక్తులు, చతురోక్తులకు శ్రోతలు పగలబడి నవ్వారు. క్రికెటేతర వ్యవహారాలు, సెయింట్ స్టీఫెన్స్ కళాశాల వెలుపలి ప్రపంచంపై నా శ్రద్ధాసక్తులను ఆ బహిరంగ సభ ఇతోధికంగా పెంచింది. ఈ ర్యాలీ అనంతరం కొద్దివారాలకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు ఆరంభమయింది. నేనూ, నా స్నేహితుల బృందం పలు ప్రధానపత్రికల ప్రధాన కార్యాలయాలు ఉన్న బహదూర్ షా జాఫర్ మార్గ్‌కు వెళ్లాము. ఇంటర్నెట్ అప్పటికి ఇంకా సుదూర భావి అద్భుతమే. విశ్వసనీయమైన సమాచారానికి ఆకాశవాణి, దూరదర్శన్‌పై ఆధారపడే పరిస్థితి లేదు. ఒక పత్రికా కార్యాలయం బయట ఒక పెద్ద బ్లాక్ బోర్డ్‌పై ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ఫ్లాష్ అవుతున్నాయి. అమేథీలో సంజయ్‌గాంధీ ఓడిపోయాడన్న వార్త వచ్చినప్పుడు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. రాయబరేలీలో ఇందిర అపజయం పాలయ్యారని తెలియగానే మరింతగా హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి.

నిరంకుశ పాలన ఓడిపోయింది. వంశపారంపర్య రాజకీయాలు ముగిశాయి. అవునా? అయ్యో! యాభై సంవత్సరాల తరువాత నిరంకుశ పాలన, వంశ పారంపర్య రాజకీయాలు రెండూ మనలను వెంటాడుతున్నాయి, పీడిస్తున్నాయి. కాకపోతే తేడా అల్లా ఇప్పుడు వాటికి వివిధ పార్టీలలో ప్రాతినిధ్యం ఉన్నది; పరిపూర్ణ ఆలంబన కూడా లభిస్తోంది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మౌలిక వసతులతో ప్రగతికి బాటలు

దేశ ప్రగతి మౌలిక సదుపాయాల వృద్ధిపై ఆధారపడి ఉంటుంది. పౌరులకు అవసరమైన సేవలు అందించడం వీటితో సాధ్యపడుతుంది. మౌలిక సదుపాయాల కల్పన ఒక్క రోజులో జరిగే పని కాదు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలతో ప్రభుత్వాలు పనిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఇతర దేశాలపై ఆధారపడకుండా, స్వయం సమృద్ధితో దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ, అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరం. మన దేశం అంతర్జాతీయ అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడంలో ఈ వసతులదే కీలక భూమిక. దీనిని గుర్తించిన నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దార్శనిక దృక్పథంతో పనిచేస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతను కల్పించింది. వీటి కల్పనలో స్థిరమైన వృద్ధిని కొనసాగించడం, జాప్యాన్ని నివారిస్తూ సకాలంలో ప్రాజెక్టులను పూర్తిచేయడం మరొక కీలక అంశం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ పనిచేస్తేనే నిర్ధారిత లక్ష్యాలను చేరుకోగలం.



దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను పట్టణాలతో అనుసంధానించే ప్రక్రియలో భాగంగా గ్రామీణ రహదారుల నిర్మాణం గత 11 సంవత్సరాలలో వేగం పుంజుకోవడం శుభ పరిణామం. దేశంలో దాదాపుగా 99 శాతం గ్రామాలను అనుసంధానించే కార్యక్రమం పూర్తిచేశారు. రైల్వే లైన్ల డబ్లింగ్, రైలు మార్గాల విద్యుదీకరణ, మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలో తొలిసారిగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్వదేశీ సెమీ, హై స్పీడ్ రైళ్లు పరుగులు తీయడం నిర్ధారిత లక్ష్యాన్ని చేరుకోవడానికి నిదర్శనం. అందుబాటు వ్యయంతో ప్రజలకు విమాన ప్రయాణ స్వప్నాన్ని సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేసింది. గత దశాబ్ద కాలంలో 85 విమానాశ్రాయాల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటితో పాటు 73 విమానాశ్రయాలు, 13 హెలిపోర్టులు, 2 జల విమానాశ్రయాలను ఉడాన్ పథకంతో అనుసంధానించారు. పెద్ద నగరాలకు పరిమితమైన మెట్రో రైలు సౌకర్యాన్ని గత పదేళ్లలో 23 నగరాలకు చేరువ చేశారు.

రవాణా వ్యయాన్ని తగిస్తూ అంతర్జాతీయ వాణిజ్యానికి చేయూతనిస్తూ అంకుర సంస్థలు, వ్యాపారులు, రైతులకు నూతన అవకాశాలను చేరువ చేయడానికి కృషి చేస్తున్నారు. పీఎం గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక(ఎన్ఎంపీ)లో భాగంగా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సమగ్ర, సమీకృత ప్రణాళిక రూపొందించే దిశగా ఒక ప్రగతిశీల విధానంగా దీనిని తీర్చిదిద్దారు. 2014 నుంచి 2024 మధ్య రోడ్డు రవాణా, జాతీయ రహదారుల బడ్జెట్ 570 శాతం పెరిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో 400 వందే భారత్ రైళ్ల తయారీ లక్ష్యంలో భాగంగా ప్రస్తుతం 136 రైళ్లు ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నాయి. అలాగే రోజువారీ జాతీయ రహదారుల సగటు నిర్మాణ వేగం 2025లో 34 కిలోమీటర్లకు చేరింది. రైలు ప్రయాణ మరణాల తగ్గింపు లక్ష్యంగా 2024 నుంచి రైల్వే బడ్జెట్‌ను 9 రెట్లు పెంచారు. 2014లో 248 కిలోమీటర్లకు పరిమితమైన మెట్రో సౌకర్యాన్ని 2025 నాటికి 1013 కిలోమీటర్లకు కేంద్ర ప్రభుత్వం విస్తరించింది. గడచిన ఐదేళ్లలో 3600 కిలోమీటర్ల మేర హై స్పీడ్ కారిడార్లను నిర్మించారు. అమృత్, అమృత్ 2.0 పథకాలలో భాగంగా 6,933 పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను పూర్తిచేశారు. 2014 నుంచి గ్రామీణ ప్రాంతాలలో 3.96 లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించారు.

జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 2020–21లో రోజువారి సగటున 37 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేస్తూ సరికొత్త రికార్డు లిఖించారు. ఢిల్లీ–వడోదర ఎక్స్‌ప్రెస్ వేలో 2.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల కాంక్రీట్ పేవ్‌మెంట్‌ని కేవలం 24 గంటల్లో పూర్తిచేశారు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెనను ఇటీవల ప్రారంభించారు. పదివేల అడుగుల ఎత్తున ప్రపంచంలోనే అత్యంత పొడవైన హైవే సొరంగం అటల్ టన్నెల్ నిర్మాణం దేశానికే గర్వకారణం. సుదర్శన్ సేతు నిర్మాణం, ముంబాయిలో నిర్మించిన అటల్ సేతు, నూతన పంబన్ వంతెన వంటివి మౌలిక వసతుల కల్పనలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనాలు. దశాబ్దాలుగా పూర్తికాని యూపీలోని సరయూ నహర్ ఇరిగేషన్ కెనాల్, బీహార్‌లోని కోసీ రైల్ మహాసేతు, కేరళలో కొల్లాం బైపాస్ ప్రాజెక్టు, బ్రహ్మపుత్ర నదిపై బోగీబీల్ రైలు–రోడ్డు వంతెన, ఢిల్లీ చుట్టూ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే వంటివి పూర్తిచేశారు. మౌలిక వసతుల కల్పన, అనుసంధానంలో జరిగిన వృద్ధి వల్ల దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యాపార, వాణిజ్య రంగాలు బలోపేతమవుతాయి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, ప్రజల ఆర్థిక పురోభివృద్ధి మరింత మెరుగవుతుంది. భవిష్యత్ భారతావనికి అవసరమైన మౌలిక వసతుల కల్పన దశాబ్దకాలంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది.

■ వేదుల వి.ఎస్.వి నరసింహం
విశాఖపట్నం

అధిక జనాభా... వరమా, భారమా?

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. మరో నలభై ఏళ్లలో అది 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1 కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది. అలా తక్కువగా కొనసాగడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. కాబట్టి దాన్ని అధిగమించాలా, లేదా ప్రపంచంతోనే నడుస్తూ, భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కరలేదా అన్నది ఒక కోణం.

ఇప్పుడు దృష్టి పెట్టాల్సినవి రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి– జనాభాలో 68 శాతం పని చేయగల వయస్సువారు, అంటే అరవై నాలుగు సంవత్సరాల లోపువారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికలు, వాటి అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఉపాధి వీలైనంత ఎక్కువమందికి చవకగా అందుబాటులో ఉంచాలి. వ్యవసాయం, పరిశ్రమలు, పరిశోధన, సేవలు, ఉత్పాదకత రంగాలను ఆధునిక సాంకేతికత సాయంతో దేశం స్వయం సమృద్ధి సాధించడానికే కాకుండా ప్రపంచ దేశాలకు అందించే స్థాయికి తీసుకురావాలి. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి. పెరుగుతున్న ఆర్థిక అంతరాల్ని తగ్గించే విధానాలు ఉండాలి. దేశ సంపద, ఆదాయాలు ఒక్క శాతం మంది చేతిలో నలభై శాతం ఉండడం, ఏభై శాతం మంది ప్రజలు, ఆరు శాతం సంపదతో సరిపెట్టుకోవాల్సి రావడం సమర్థనీయం కాదు. ఈ అంతరంతో సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదు. అందుకనే సంపద పంపిణీ, పేదరిక నిర్మూలనలపై విధానాల్ని పునస్సమీక్షించుకోవాలి. ఇక రెండోది– వృద్ధులు జనాభాలో ఏడు శాతం. జీవన ప్రమాణాల పెంపుతో ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. వారికి సామాజిక రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కనుక నూతన విధానాలతో ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉంటుంది.

ఇక, జననాల రేటు తగ్గినా అది దేశవ్యాప్తంగా ఒకేలా లేదు. అందుకనే దక్షిణాది రాష్ట్రాలు పిల్లల్ని ఎక్కువగా కనమని పిలుపు ఇస్తుంటే, ఉత్తరాది వారు ఎక్కువమందితో సతమతమవుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కూడా దీనితో ప్రభావితమవుతోంది. ప్రాంతీయ అసమానతలు ఎక్కువ కాకుండా చూడాలి. సున్నితత్వంతో, దీర్ఘకాలిక వ్యూహంతో వ్యవహరిస్తే అధిక జనాభా దేశానికి వరం. లేదంటే పెను భారం.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

శనివారం 14 జూన్ 2025



సన్నబియ్యం సంబరం

జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం అన్నం

- పాఠశాలలు మొదలైన రోజు నుంచే ప్రారంభం
- కడుపునిండా తింటున్న పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులు
- ఇంటి భోజనంలా ఉందని ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నందిగామ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరకు సాధారణ రకం బియ్యాన్ని సరఫరా చేయడంతో కొందరు విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉన్నారు. అది తినడం వల్ల అజీర్తి సమస్యలతో బాధపడ్డారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మంత్రి నారా లోకేశ్ మిగతా 6లో..

పటమట జెడ్పీ హైస్కూల్లో..



అమ్మ చేసిన అన్నంలా..



నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజనం చేయడం సంతోషంగా ఉంది. ఇంట్లో అమ్మ చేసిన అన్నంలా ఉంది. ఇటువంటి బియ్యం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు.

- ప్రజాపతి ఉమిద్, ఏడో తరగతి విద్యార్థి

ఇంట్లో తిన్నట్టే ఉంది



మధ్యాహ్న భోజనం ఇంట్లో తిన్నట్టే ఉంది. ఇలా అయితే అందరూ ఇక్కడే తింటారు. మాకోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. బిర్యానీ వండినా పొడిగా బాగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- నకిరికంటి శిరీష, ఏడో తరగతి విద్యార్థి

మెట్రో సీఎంపీ రెడీ



16న సమగ్ర రిపోర్టును సమర్పించనున్న కన్సల్టెన్సీ

- వారంలో కేంద్రానికి పంపనున్న ఏపీఎంఆర్‌సీ
- డీపీఆర్ ఆమోదం పొందితే.. వెంటనే అనుమతులు
- కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే టెండర్ల ప్రక్రియ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) పూర్తయింది. కన్సల్టెన్సీ సంస్థ తుది సీఎంపీని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులకు సోమవారం అందించనుంది. ప్రిలిమినరీ నివేదికపై మెట్రో స్టేక్ హోల్డర్స్ అయిన జిల్లా యంత్రాంగం, పోలీసు, ట్రాఫిక్, వీఎంసీ తదితర శాఖలకు ఏపీఎంఆర్‌సీ ఎస్పీ రామకృష్ణారెడ్డి శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీల్డ్ కవర్‌లో ఉన్న తుది సీఎంపీని ఏపీఎంఆర్‌సీ ఉన్నతాధికారులు సోమవారం అందుకోనున్నారు. ఆరోజు కన్సల్టెన్సీతో మెట్రో అధికారులు చర్చిస్తారు. అనంతరం వారంలో సీఎంపీని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. విజయవాడ మెట్రో డీపీఆర్ ఆమోదానికి సీఎంపీ కీలకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ సీఎంపీని పరిశీలించాక మెట్రో డీపీఆర్‌కు ఆమోదం తెలుపుతుంది. డీపీఆర్ ఆమోదం పొందితే మెట్రో ప్రాజెక్టు ప్రక్రియ పూర్తయినట్టే. కేంద్రం అనుమతులు కూడా లభిస్తాయి. ఆ తర్వాత పనులు ప్రారంభించటానికి వీలుగా మిగతా 6లో..

● థాంక్యూ సీఎం సార్..

అభివందనం

రెండు జిల్లాల్లో తల్లికి వందనం సంబరాలు

అర్హులైన వారి ఖాతాల్లో డబ్బు జమ మొదలు



భవానీపురంలో తమ ఫోన్‌కు వచ్చిన బ్యాంక్ మెసేజ్‌ను చూపిస్తున్న ఓ తల్లి

- ఎన్టీఆర్ జిల్లాలో 1,41,990 మంది తల్లులు.. రూ.210 కోట్ల లబ్ధి
- కృష్ణాజిల్లాలో 1,11,458 మంది తల్లులు.. రూ.175 కోట్ల లబ్ధి
- ఉదయం నుంచి తల్లుల ఫోన్లకు క్రెడిట్ మెసేజ్‌లు
- ముగ్గురు, నలుగురు పిల్లలున్న వారికి భారీ ప్రయోజనం

> అమ్మ కళ్లలో ఆనందం కనిపించింది. విద్యార్థులు సంతోషంతో సంబరాలు చేసుకుంటున్నారు. కూటమి సర్కారు కొలువు తీరి ఏడాదైన సందర్భంగా 'తల్లికి వందనం' నిధులను జమ చేశారు. ఆ డబ్బు గురువారం సాయంత్రం నుంచి తల్లుల ఖాతాల్లో పడటం మొదలవడంతో అంతటా తల్లికి వందనం సంబరాలు చేసుకుంటున్నారు. ముగ్గురు, నలుగురు పిల్లలున్న తల్లుల ఖాతాల్లో కూడా రూ.39 వేలు, రూ.52 వేలు జమ అవుతుండటంతో రెండు జిల్లాల్లో ఎక్కడచూసినా ఇదే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : తల్లికి వందనం పథకం డబ్బు శుక్రవారం నుంచి జమ అవుతుండటంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 2,13,846 మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక కాగా, 1,41,990 మంది తల్లులను లబ్ధిదారులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ కలిపి రూ.210 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. కృష్ణాజిల్లాలో 1,70,963 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 1,11,458 మంది తల్లుల ఖాతాల్లో రూ.175 కోట్ల మేర ప్రభుత్వం జమ చేయనుంది.

తల్లుల ఖాతాలకు డబ్బు జమ

లబ్ధిదారుల జాబితాలను విద్యాశాఖ అధికారులు గురువారమే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి పంపారు. ఈ జాబితాల ఆధారంగా ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే, అందరికీ తల్లికి వందనం నగదు జమ అవుతుంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి తల్లులు ఖాతాల్లో నగదు మిగతా 6లో..



● చందర్లపాడు మండలం ఏటూరు గ్రామానికి చెందిన జూపల్లి కవితకు నలుగురు పిల్లలు. ఆమె భర్త రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆమె తన పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు సిద్ధు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండగా, కవల పిల్లలైన లక్ష్మీ, రాజులు ఎంపీపీ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నారు. చివరి కుమారుడు తేజ నాల్గో తరగతి చదువుతున్నాడు. ఈ నలుగురు పిల్లలు కూడా తల్లికి వందనం పథకం కింద ఎంపిక కావటంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయం ద్వారా తమ పిల్లలను మరింత సమర్థవంతంగా చదివించుకుంటానని కవిత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని తన భర్త కలలు కనేవాడని, ఆయన మరణంతో పిల్లల భవిష్యత్తును తలచుకుని భయపడుతున్న తరుణంలో తల్లికి వందనం కింద తాను ఎంపికైనందుకు ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



● చందర్లపాడు మండలానికి చెందిన కలితిరిపి వాణీకి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. భర్త వెంకటేశ్ మృతిచెందాడు. పిల్లల్ని చదివించాలన్న పట్టుదలతో వారిని చదివించుకుంటోంది. వారిని చదివించుకోవటం కష్టంగా మారినా వాటన్నింటినీ భరిస్తూ ఆమె తన పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద అమ్మాయి రమ్యశ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కుమారుడు వెంకటరమణ ఆరు, ధాత్రిశ్రీ నాల్గో తరగతి చదువుతుండగా, బాలాజీ రెండో తరగతి చదువుతున్నారు. ఈ పిల్లలు తల్లికి వందనం పథకానికి ఎంపిక కావడంతో వాణి ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తన పిల్లల విద్యాభివృద్ధికి సాయం చేయడం అభినందనీయమన్నారు.



కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న చంద్రిక

రవిశంకర్ ఎక్కడ?

పిల్లలతో కలిపి పురుగు మందు తాగినట్టు సమాచారం

- పుట్టినరోజే చావు నిర్ణయం.. హోటల్ యజమాని బంధువుకు ఫోన్
- ఇంకా తెలియని ఆచూకీ.. ప్రత్యేక బృందాల గాలింపు
- బెహరాన్ నుంచి వచ్చిన చంద్రిక.. కన్నీరుమున్నీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మైలవరంలో ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపేసి వెళ్లిపోయిన తండ్రి వేములవాడ రవిశంకర్ ఆచూకీ ఇంకా లభించలేదు. ఈ కేసులో దర్యాప్తు చేసే కొద్దీ కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. పిల్లలిద్దరికీ విషమిచ్చి చంపాలని ముందే రవిశంకర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈనెల 8న రవిశంకర్ తన ఇద్దరు పిల్లలు లక్ష్మీ హిరణ్య, మిగతా 6లో..



రవిశంకర్, చంద్రిక (ఫైల్)

కన్నీరుమున్నీరైన చంద్రిక

తన ఇద్దరు పిల్లల మృతి, భర్త అదృశ్యంతో చంద్రిక కన్నీరుమున్నీరైంది. బెహరాన్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం మైలవరం చేరుకున్న ఆమె ప్రభుత్వాసుపత్రిలో పిల్లల మృతదేహాలను చూసి విలవిల్లాడిపోయింది. తమకు చెప్పుకోదగ్గ అప్పులేమీ లేవని, ఎవరు ఎలాంటి వేధింపులు చేయలేదని చెబుతూ రోదించింది. కాగా, పిల్లల మృతదేహాలకు మైలవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయడం కుదరకపోవడంతో శుక్రవారం సాయంత్రం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈ నెల 20 వరకు అర్జీల గడువు

సచివాలయాల్లో తల్లికి వందనం వివరాలు : కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకానికి సంబంధించి అభ్యంతరాలు, అర్జీలు ఈ నెల 20 వరకు స్వీకరించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులతో పాటు అనర్హుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామని, ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు అర్జీలను పరిశీలించి అర్హుల జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు. కొత్తగా అర్హత సాధించిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జూలై 5న నగదు జమ అవుతుందని పేర్కొన్నారు.

పదేళ్ల కల!

సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్ నిర్మించాలని దశాబ్దకాలంగా కోరుతున్న ప్రజలు 8

నీరుపయోగంగా..

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

17 వేల ఎకరాలకు సాగునీరందించే పథకంపై నిర్లక్ష్యం ● సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా పట్టని అధికారులు

- మరమ్మతులకు మూడుసార్లు అంచనాల రూపకల్పన
- ఫలితంగా నిధుల విడుదలలో జాప్యం
- ఖరీఫ్‌కు సాగు చేపట్టాలా వద్దా అని రైతుల ఆందోళన
- ప్రత్యామ్నాయమైనా చూపాలంటూ వేడుకోలు

> వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులు రైతుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంచనాల రూపకల్పనలో ఆలస్యమవుతోంది. ఫలితంగా ఇంతవరకు నిధులు విడుదల కాక, మరమ్మతులకు నోచుకోక, సాగు చేపట్టాలా లేదా అనే మీమాంసలో ఆయకట్టు అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లైనా చేయాలని కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

నందిగామ, ఆంధ్రజ్యోతి : నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని 17 వేల ఎకరాలకు నీరందించే వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాలు వైసీపీ అధికారంలోకి వచ్చే నాటి వరకు సమర్థవంతంగా పనిచేశాయి. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టగా, ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలో విస్తరించారు. దాదాపు 130 అడుగుల ఎత్తు వరకూ కృష్ణాజలాలను ఎత్తిపోసి, అక్కడి నుంచి 430 మీటర్ల మేర పైపులైన్ ద్వారా గ్రావెటీపై నీటిని సాగర్ కాల్వకు విడుదల చేశారు. 2,300 అశ్వసామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లతో ఈ పథకం పూర్తి ఆయకట్టుకు సునాయాసంగా నీరందించింది. గతంలో టీడీపీ హయాంలో జలవనరుల శాఖ మంత్రిగా పనిచేసిన దేవినేని ఉమామహేశ్వరరావు భారీగా నిధులందించి పూర్తిస్థాయి మరమ్మతులు చేయించారు. ఆ తర్వాత అధికారంలోకి మిగతా 6లో..

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలి

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులు ఆలస్యమవుతున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ పథకాల నీటిని భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి చెర్వుమాధవరం ట్యాంక్ నుంచి ఆ మేర నీటిని విడుదల చేయించాలి. కానీ హక్కుగా రావాల్సిన వాటాలు ఇచ్చేందుకే తెలంగాణ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్న సమయంలో అదనపు నీటి విడుదల సాధ్యమవుతుందా.. అనే అనుమానాలు కూడా ఉన్నాయి.

ప్రమాదాలను.. పసిగట్టేద్దాం!

» విమాన ప్రయాణికులు సాంకేతిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలి
» సిబ్బంది జాగ్రత్తలను తు.చ తప్పక పాటించాలి
» ప్రతికూల పరిస్థితులను అంచనా వేయాలి



అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాదం.. ప్రయాణికుల వెన్నులో ఒణుకు పుట్టిస్తోంది. రోడ్డు, రైలు ప్రయాణాల కంటే విమాన ప్రమాదాలు అతి తక్కువగా ఉండటం.. సురక్షితమని భావిస్తున్న వేళ.. ఎయిర్ ఇండియా ప్రమాదం అనేక భయాలను, సందేహాలను లేవనెత్తుతోంది. విమాన ప్రమాదాల్లో సింహభాగం సాంకేతిక సమస్యల కారణంగానే జరుగుతున్నాయి. సాంకేతిక సమస్యలపై విమాన ప్రయాణికులు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం ముందుగా అంచనా వేసిన ఓ ప్రయాణికుడు అప్రమత్తం కావడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విమానం టేకాఫ్‌కు సిద్ధమౌతున్న తరుణంలో ప్రయాణికులు లోపల పరిస్థితులను గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ 50 విమానాలు దేశీయంగా ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, కడప, తిరుపతికి.. మరో రెండు అంతర్జాతీయ సర్వీసులు షార్జాకు రాకపోకలు సాగిస్తున్నాయి. దేశీయంగా ఎయిర్ ఇండియాతో పాటు ఇండిగో సంస్థ విమానాలను నడుపుతుండగా.. అంతర్జాతీయంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలను నడుపుతోంది.

ఎయిర్ ఇండియా ఘోర ప్రమాదంతో విమాన ప్రయాణికుల వెన్నులో భయం పుడుతోంది. విమానాలకు ప్రమాదం సంభవిస్తే నష్టం అపారం. ప్రయాణికులు విమాన స్థితిగతులపై అవగాహన కలిగివుండాల్సిన అవసరం ఉంది. విమాన సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారం కొన్ని అంశాల పట్ల ప్రయాణికులు అవగాహన కలిగి ఉండటం అవసరం.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

విమానంలో సాంకేతిక లోపాలను పైలట్లు మాత్రమే గుర్తించగలరు. ప్రయాణి కులు కూడా ముందుగా పసిగట్టి సమాచారం ఇవ్వటం ద్వారా ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. సహజంగా విమానం టేకాఫ్ సమయంలో ఇంజిన్ సమతుల్యంగా ధ్వని వస్తుంది. ఒక్కసారిగా ఇంజిన్ శబ్దం తగ్గినా, ధ్వని తగ్గుతూ, పెరుగుతూ కొట్టుకుంటున్నా విమాన సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలి. టేకాఫ్ సమయంలో విమానం తేలికగా పైకి ఎగురుతుంది. ఇలాంటి సందర్భంలో సీట్లలో ప్రయాణికులు అధిక ఒత్తిడికి గురైనా, కంపించినా, ఒక వైపుకు వంగినా ప్రమాదసంకేతంగా భావించాలి. టేకాఫ్ తర్వాత విమానం సజావుగా కాకుండా ఒడిదుడుకులతో వెళుతున్నా.. తగినంత ఎత్తు ఎగరలేకపోతున్నా, మెటల్ తెగిపోయే శబ్దాలు, ప్రెషర్ శబ్దాలు వచ్చినా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒక క్రూగా అప్రమత్తంగా ఉంటూ విమాన సిబ్బందితో నిర్ధారణ చేసుకోవటం సేఫ్టీ ప్రయాణానికి తొలి మెట్టు అని భావించాలి.

టేకాఫ్ సమయంలోనే ప్రమాదాలు..

టేకాఫ్ సందర్భాల్లోనే నూటికి 90 శాతం పైగా విమాన ప్రమాదాలు జరుగుతున్నాయన్నది నిపుణుల మాటగా ఉంది. టేకాఫ్ సమయంలో వాతావరణ పరిస్థితులు, వ్యవస్థల వైఫల్యం, పైలట్, సాంకేతిక లోపాలు, ఎయిర్ డైన మిక్స్ తప్పిదాలు వంటివి కారణమౌతాయి. ప్రధానంగా ఎయిర్ స్పీడ్ తగ్గడం ద్వారా విమానాన్ని పైకి లిఫ్ట్‌చేసే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. ఫలితంగా విమానం గురుత్వాకర్షణకు లోనౌతుంది. ఇంజిన్ ఫెయిల్యూర్స్ కావటం చాలా



అరుదు. ఒక ఇంజిన్ పనిచేయకపోయినా రెండో ఇంజిన్ మీద నడిపించవచ్చు. ఒక ఇంజిన్ చెడిపోయి రెండో ఇంజిన్‌ను ఆన్ చేసిన తర్వాత అది తన పవర్‌ను కోల్పోతే విమాన వేగం తగ్గి గురుత్వాకర్షణకు లోనౌతుంది. విమానాల టేకాఫ్ సమయంలో గాలి దిశ మారినా, వేగం మారినా విమాన వేగం తగ్గటానికి అవకాశం ఉంటుంది.

చేయకూడని తప్పులివే

- కొడాలి శేషాద్రిరావు, ఎయిర్ సేఫ్టీ ఆఫీసర్



విమానంలో 240 మంది ప్రయాణికులు, వారి లగేజీతో కలిపి బరువు ఎక్కువగా ఉంటుంది. లగేజీని కన్వయిర్ బెల్టుతో పంపేటపుడు విమానానికి నాలుగు వైపులా సర్దకుండా సులువుగా ఉంటుందని అక్కడికక్కడ పడేస్తారు(ఫైలింగ్ చేయడం) ఇది ప్రమాదాలకు దారితీస్తుంది. టేకాఫ్ అయిన కొద్ది సమయానికే కూలిపోవడానికి ఇదే కారణం. ఇతర దేశాలకు వెళ్లే విమానంలో ఇంధనం కూడా అధిక మొత్తంలో ఉంటుంది. దీనివల్ల టేకాఫ్ సమయంలో కష్టంగా ఉంటుంది. పైలట్లు వీటన్నింటిని అంచనా వేస్తూ జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. టేకాఫ్ సమయంలో బర్డ్ హిట్(ఇంజిన్‌లోకి పక్షి దూరిపోవడం) జరగవచ్చు. బర్డ్ హిట్ చాలా ప్రమాదకరం. టేకాఫ్ సమయంలో గాలి పక్క నుంచి కాని క్రాస్‌గా కాని వచ్చినా ఎయిర్‌క్రాఫ్ట్ బ్యాలెన్స్ తప్పే ప్రమాదముంది. ఏవియేషన్‌లో మెయింటినెన్స్ చాలా ముఖ్యం. ఇది అధిక ఖర్చుతో కూడుకున్నది. సుమారు 500 గంటలకు ఒకసారి ఎలక్ట్రానిక్ భాగాలు, కొన్ని ముఖ్యమైన పార్ట్స్ మార్చాలి. సర్వీస్ చేయాలంటే మొత్తం ఎయిర్‌క్రాఫ్ట్‌ను చెక్ చేయాలి. విశ్రాంతి లేకుండా వెంటవెంటనే విమానాన్ని నడపడానికి సన్నద్ధం చేయడం వల్ల పైలట్ల ఏకాగ్రత దెబ్బతింటుంది.



వైదిక బృందం, అర్చకులు, అధికారులతో సమావేశంలో ఈవో

ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధం కావాలి

» 26 నుంచి దుర్గగుడిలో ఆషాఢ ఉత్సవాలు
» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధం కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ అన్నారు. శుక్రవారం మహామండపంలో ఆలయ వైదిక సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ, ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు), జూలై 8 నుంచి 10 వరకు శాకంబరీ దేవి ఉత్సవాలు జరుగనున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో సూచించారు. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, వైదిక కమిటీ సభ్యులు వి.శ్యావాశ్వ మహర్షి, సీహెచ్ ఆంజనేయ ఘనాపాటి, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఉప ప్రధానఅర్చకుడు కోట ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ ఎస్.రమేష్ బాబు, బి.వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో కళావేదికపై శుక్రవారం శ్రీభరత్ కళ ఆర్ట్స్ అకాడమీ, చెన్నైకు చెందిన కళాబృందం నృత్య కళార్చన నిర్వహించారు. గురువు రోజా రాణి ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.



హాజరైన సెకండరీ గ్రేడ్ టీచర్లు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవోలు

2780 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈనెల 10 నుంచి నాలుగు రోజుల పాటు సెకండరీ గ్రేడ్ టీచర్లకు మచిలీపట్నం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, కృష్ణాజిల్లా డీఈవో పీవీజే రామారావులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 10న 200, 11న 903, 12న 803, చివరి రోజైన శుక్రవారం 847 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 54 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 2297 మంది, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న 429 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియను అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, రీజనల్ డైరెక్టర్ నాగమణి సందర్శించి పరిశీలించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరిన విధంగా వెబ్ ఆప్షన్లు కాకుండా మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. స్క్రీన్‌పై ప్రదర్శించిన పాఠశాలలను ఉపాధ్యాయులు కోరుకోవడంతో వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎన్‌పీసీఐ స్పెషల్ క్యాంప్

భారతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని షెడ్యూల్ కులాల విద్యార్థులకు 'తల్లికి వందనం' స్కాలర్ షిప్ మంజూరుకు బ్యాంక్ ఖాతా, పోస్టల్ ఖాతాలకు ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అనుసంధానం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమాధికారి, సాధికారత అధికారి జి.మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9వ, 10వ తరగతితో పాటు ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులకు 'తల్లికి వందనం' స్కాలర్‌షిప్ మంజూరుకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం, బ్యాంక్, పోస్ట్ ఆఫీస్‌ల్లో సంప్రదించి బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల కోసం నేడు ఏపీ సంచాలకులు, సాంఘిక శాఖ వారి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కారులో మృతుడు అన్నెబోయిన నాగరాజు

కారులో శవం కలకలం!

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

జి.కొండూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కందులపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో కారులో శవం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన అన్నెబోయిన నాగరాజు (35) సుమారు 14 ఏళ్ల క్రితం శివపార్వతిని వివాహం చేసుకుని జి.కొండూరు వెలగలేరులో పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. పిల్లలతో కలిసి భద్రాచలం వెళ్లి వద్దామని మూడురోజుల క్రితం విజయవాడ సింగ్‌నగర్‌లోని భవానీ ట్రావెల్స్ నుంచి కారును అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం కందులపాడు క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ బడ్డీ కొట్టు వద్ద పూటుగా మద్యం సేవించి మత్తులో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు అతడ్ని లేపి కారు సీటులో కూర్చోబెట్టారు. పూటుగా మద్యం సేవించి డీ హైడ్రేషన్ వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజధాని జీవవైవిధ్యంపై క్షేత్రస్థాయి మూల్యాంకనం

» రెండోరోజు వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల ప్రముఖులు.. పలు అంశాలపై చర్చలు



అమరావతిలో పర్యటిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ అభివృద్ధి' అంశంపై నిపుణుల నేతృత్వంలో జరిగిన రెండోరోజు వర్క్‌షాపు ముగిసింది. శుక్రవారం ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం అనంతవరం హిల్స్, శాకమూరు పార్క్, ఏజీసీ ప్రాంతం, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్, ఏడీసీఎల్, వాటర్‌బాడీ, వెంకటపాలెం నర్సరీ వంటి కీలకమైన పర్యావరణ ప్రాంతాలను సందర్శించింది. ఈ ప్రదేశాలు అమరావతి గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ ప్లానింగ్‌లో అంతర్భాగాలుగా ఉన్నాయి. అనంతరం ఏడీసీఎల్ హార్టికల్చర్ బృందంతో కలిసి వివిధ జాతుల చెట్లు పెరగడానికి అనుకూలమైన స్థలం, డిజైన్ మెరుగుపరిచే విధానంపై కార్యాచరణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి అమరావతిని ప్రకృతిలో ఎలా అనుసంధానం చేయాలో ఈ బృందాలు వివరించాయి. అనంతరం ఏపీ సీఆర్‌డీఏ భవనంలో జరిగిన సమావేశంలో ఢిల్లీకి చెందిన నీలా హౌస్ కన్‌స్ట్రక్టెడ్ వెట్‌ల్యాండ్ సంస్థ సభ్యులు మొక్కలు, జలసంబంధమైన ప్రణాళికల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పర్యావరణాన్ని పునరుద్ధరించే మొక్కల జాతులు గురించి ప్రదర్శించారు. అనంతరం అమరావతి గ్రీన్‌ఎనర్జీ మౌలిక సదుపాయాలు, పార్కులు, అవెన్యూలు, బఫర్ ప్లాంటేషన్, నగర వ్యాప్తంగా నీలి, ఆకుపచ్చ పర్యావరణ నెట్‌వర్క్ అభివృద్ధి గురించి ప్రెజెంటేషన్ చేశారు. ముగింపు సెషన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ వర్గీకరణ శాస్త్రవేత్త, మాజీ వైస్ చాన్సలర్ సీఆర్ బాబు, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాద్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.చంద్రమోహన్ రెడ్డి, ఏడీసీఎల్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ ధర్మజ, సీనియర్ ప్లానర్ ప్రమాన్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ స్ట్రాటజీ డివిజన్ డైరెక్టర్ ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పర్వతనేని రవికుమార్

» ప్రస్తుత అధ్యక్షుడు ఆర్వీ స్వామి తొలగింపు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ (ఆప్హా) నూతన అధ్యక్షుడిగా ఐరా హోటల్ అధినేత పర్వతనేని రవికుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న ఆర్వీ స్వామి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకుంటున్నారనే ఆరోపణలపై శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 13 జిల్లాల నుంచి వచ్చిన సభ్యులు బహిష్కరించడంతో ఆయన్ను అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించారు. సంఘంలో ఉండగానే, ఆయన సొంతగా ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడాన్ని ఖండించారు. వాస్తవానికి ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడి హోదాలో ఆర్వీ స్వామి ఏర్పాటు చేశారు. అయితే, సమావేశానికి పిలుపునిచ్చిన కొద్దిరోజులకే ఆయన వేరే సంఘాన్ని పెట్టుకున్నారు. అప్పటికీ ఆయన ఆప్హాలో కొనసాగుతున్నారు. దీనిపై 13 జిల్లాలకు చెందిన సభ్యులు ఆయన్ను ట్రోల్ చేయడంతో రాజీనామా లేఖను సమర్పించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పర్వతనేని రవికుమార్ మాట్లాడుతూ, కొందరి ప్రయోజనాల కోసం కాకుండా అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, స్టార్ హోటళ్ల సమస్యలపై పనిచేస్తామన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే

నూతన అసోసియేషన్ ఏర్పాటు : ఆర్వీ స్వామి

గుణదల : సమస్యల పరిష్కారం కోసమే నూతన అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని.. పదవుల కోసం కాదని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి తెలిపారు. గుణదలలోని హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ హోటల్స్ అసోసియేషన్‌కు రాజీనామా ఇవ్వడం జరిగిందని చెప్పారు. అయినప్పటికీ స్టార్ హోటల్స్ అసోసియేషన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అన్ని సాధారణ సమస్యలపై కలిసి పనిచేస్తామన్నారు.

మెట్రో సీఎంపీ రెడీ

(5వ పేజీ తరువాయి)

ఏపీఎంఆర్‌సీ అధికారులు టెండర్లు పిలుస్తారు.

విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు తొలిదశలో గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు రింగ్‌రోడ్డు, ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్‌కు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-2కు మొత్తంగా రూ.5,900 కోట్లు అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 20 శాతం వాటా భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం వాటా భరించాలి. మిగిలిన 60 శాతం వాటాను రుణ సంస్థల నుంచి తీసుకోవాలి. ఇప్పటికే జైకా,ఏఐఐబీ, ఏడీబీ, వరల్డ్ బ్యాంక్, కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థలతో ఏపీఎంఆర్‌సీ అధికారులు సంప్రదింపులు జరిపారు. అతి తక్కువ వడ్డీకి, షరతుల లేకుండా రుణం ఇవ్వటానికి ఏఐఐబీ, ఏడీబీ సంస్థలు ఆసక్తి చూపాయి. దీంతో ఈ రెండు సంస్థల పేర్లను ఏపీఎంఆర్‌సీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఒక సంస్థ నుంచే రుణం తీసుకోవాలా? రెండిటి నుంచి తీసుకోవాలా? అన్నది ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

అభివందనం

(5వ పేజీ తరువాయి)

జమ అవుతూ వస్తోంది. డబ్బు క్రెడిట్ అయినట్టుగా కొందరికి మెసేజ్‌లు కూడా వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు, వారి తల్లుల ఆధార్‌కార్డు నెంబర్లు బ్యాంకు ఖాతాల నెంబర్లకు అనుసంధానం కాకపోవడం, కొందరి పేర్లు ఎక్కువసార్లు నమోదు కావడం వంటి సమస్యలు తలెత్తాయి. ఇలాంటి వారికి డబ్బు జమ కాలేదు. వీటిని సరిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వాటిని సరిచేసే పనిలో ఎంఈవోలు, సచివాలయ సిబ్బంది బిజీగా ఉన్నారు. అర్హులైన తల్లులు కొందరు తమకు మెసేజ్‌లు రాకపోవటంతో ఆందోళన చెందారు. అయితే, అర్హులైన వారందరికీ నగదు జమ అవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎంఈవోలు స్పష్టం చేస్తున్నారు.

ముగ్గురు, నలుగురు పిల్లలున్న వారికి లబ్ధి

ముగ్గురు, నలుగురు పిల్లలున్న కుటుంబాలకు భారీగా లబ్ధి కలిగింది. ముగ్గురు పిల్లలున్న కుటుంబాలకు రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు జమ అయ్యాయి. చందర్లపాడు మండలంలోని ఏటూరు, వెలదికొత్తపాలెం గ్రామాల్లో నలుగురు చొప్పున పిల్లలను చదివిస్తున్న తల్లులకు రూ.52 వేల వరకు జమ అయ్యింది. పేదరికంలో ఉన్నా.. పిల్లలను చదివించాలన్న ఆకాంక్ష ఉన్న తల్లులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

వైసీపీ కార్యకర్త ఆనందం

తల్లికి వందనం జమతో వాట్సాప్ స్టేటస్

మైలవరం టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా తల్లికి వందనం డబ్బు జమ కావడంతో ఓ వైసీపీ కార్యకర్త ఆనందం వ్యక్తం చేశాడు. మండలంలోని పొందుగల గ్రామానికి చెందిన పుల్లూరు రమేశ్ తన పిల్లల డబ్బు జమ కావడంతో ఆనందంతో ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు.

రవిశంకర్ ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

లీలసాయికి పురుగు మందు ఇచ్చినట్టు సమాచారం. అదేరోజు రవిశంకర్ పనిచేస్తున్న హోటల్ యజమాని సురేష్ బంధువుకు ఫోన్ చేశాడు. అప్పుల బాధలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాడు. వారికిచ్చిన హామీని నెరవేర్చలేకపోతున్నానని ఆవేదన చెందాడు. తాను, పిల్లలిద్దరూ పురుగుల మందు తాగామని చెప్పాడు. నాలుగైదు నిమిషాలు మాట్లాడాక రవిశంకర్ కాల్ కట్ అయ్యింది. ఆ తర్వాత అవతలి వ్యక్తి తిరిగి ఫోన్ చేసినప్పటికీ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఫోన్‌లో చార్జింగ్ అయిపోయిందని అవతల వ్యక్తి భావించాడు.

అమ్మ పిలిస్తే అనారోగ్యం అన్నాడు

ఈనెల 8న రవిశంకర్ పుట్టినరోజు. దీనికి నాలుగైదు రోజుల ముందు నుంచి అతడు హోటల్లో పనికి వెళ్లడం మానేశాడు. వంట మాస్టర్‌గా పనిచేస్తున్న అతడు కొంతకాలంగా నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. రెండేళ్ల కిందట రవిశంకర్‌కు కాళ్లలో నరాలు వాచిపోయాయి. ఆపరేషన్ చేయించాక ఎక్కువసేపు నిలబడలేకపోయేవాడు. అప్పటికే భార్య చంద్రిక దుబాయిలో పనిచేస్తోంది. ఆపరేషన్‌కు అయిన రూ.2 లక్షలను ఆమె సర్దుబాటు చేసింది. ఆ తర్వాత నరాల నుంచి రక్తస్రావం మొదలైంది. విజయవాడలో చూపించగా, మళ్లీ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. ఈసారి ఆపరేషన్ చేస్తే నిలబడటం కష్టంగా ఉంటుందని చెప్పారు. దీంతో రవిశంకర్ వెనక్కి తగ్గాడు. పిల్లలను చంపడానికి నాలుగైదు రోజుల ముందు నుంచి అతడు హోటల్లో పనికి వెళ్లడం మానేశాడు. భీమవరంలో భార్య చంద్రికకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని విక్రయించి అప్పులు తీరుస్తానని చెప్పి అక్కడికి వెళ్లాడు. అప్పటికే పిల్లలిద్దరూ భీమవరంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నారు. రవిశంకర్ ఇంటికి రాకపోవడంతో తండ్రి లక్ష్మీపతి అతడికి ఫోన్ చేసేవాడు. తాను భీమవరంలో ఉన్నానని, స్థలం అమ్మేసి డబ్బు తీసుకొచ్చి అప్పులు తీరుస్తానని చెప్పాడు. ఈ నెల 6న భీమవరం నుంచి పిల్లలతో సహా మైలవరం వచ్చేశాడు. 8న రవిశంకర్ పుట్టినరోజు కావడంతో తల్లి ఫోన్ చేసి ఇంటికి రమ్మని చెప్పింది. పిల్లలకు ఆరోగ్యం బాలేదని చెప్పి వెళ్లలేదు. ఆ రోజే పిల్లలను చంపి తాను చనిపోవాలనుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. పిల్లలిద్దరూ ఇంట్లోనే చనిపోవడంతో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. రవిశంకర్ జీవించి ఉన్నాడా, లేదా అనే విషయం ఇప్పటివరకు తెలియలేదు.

ఇబ్రహీంపట్నంలో చివరి లొకేషన్

రవిశంకర్ ఆచూకీ కోసం మైలవరం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. సాంకేతికంగా విచారణ సాగిస్తున్నారు. ఇంట్లో పిల్లలకు విషం ఇచ్చాక అతడు ఇంటి ముందు ఆటో ఎక్కి ఇబ్రహీంపట్నం చేరుకున్నట్టు భావిస్తున్నారు. రవిశంకర్ సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేయగా, చివరి లొకేషన్ ఇబ్రహీంపట్నం చూపించింది. మైలవరం నుంచి విజయవాడకు అనుసంధానంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా, ఎక్కడా రవిశంకర్ కనిపించలేదు. ఆటోలో వెళ్లిపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. పోలీసులు ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. పిల్లలకు విషం ఇచ్చాక భయంతో ఇబ్రహీంపట్నం వచ్చి నదిలో దూకి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

కనస్ట్రక్షన్ కంపెనీలో గంజాయి వ్యాపారం!

» ఐదుగురిని పట్టుకున్న సీటీఎఫ్

విజయవాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : చూసిన వాళ్లకు కనస్ట్రక్షన్ కంపెనీలా కనిపిస్తుంది. కంపెనీలో అడుగు పెడితే గంజాయి ప్యాకెట్లు కనిపిస్తాయి. కనస్ట్రక్షన్ కంపెనీ ముసుగులో జరుగుతున్న గంజాయి వ్యాపారాన్ని విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. మైనర్ సహా ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు నారాయణపురం కాలనీకి చెందిన టిక్కి నరేంద్ర శ్రీ మణికంఠ కనస్ట్రక్షన్స్ కంపెనీని ఏర్పాటు చేశాడు. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ వైద్యురాలిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రెండు కార్లు కొనుగోలు చేసి మొదటి భార్యకు బంధువు అయిన పెనమలూరుకు చెందిన హరి పవన్‌కుమార్ తల్లి పేరున పెట్టాడు. విజయవాడ కరెన్సీ నగర్‌కు చెందిన దాసరి కృష్ణవంశీ, పోరంకికి చెందిన గోపవరపు సుధీర్‌తోపాటు మరో మైనర్‌తో కలిపి గ్యాంగ్‌ను తయారు చేశాడు. ఒడిసా నుంచి కిలోల కొద్దీ గంజాయిని తెచ్చి బెంగళూరులో విక్రయిస్తాడు. కొద్దిరోజుల క్రితం ఒడిసా నుంచి 25 కిలోల గంజాయిని రప్పించాడు. దాన్ని విక్రయించి ఎండీఎంఏకు ఆర్డర్ ఇచ్చి వస్తుండగా ఏలూరు రోడ్డులో ఉన్న పాతబస్టాండ్ వద్ద పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 25 కిలోల గంజాయి, రెండు కారులు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నీరుపయోగంగా..

(5వ పేజీ తరువాయి)

వచ్చిన వైసీపీ పాలకులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఐదేళ్లుగా ఈ పథకం మూలకు చేరింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. మరమ్మతులు చేయిస్తారన్న వారి కలలు ఇంతవరకు నెరవేరలేదు. ఏడాదిగా నిధుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. అవి అందకపోవడంతో సాగు చేపట్టాలా, లేదా అని యోచిస్తున్నారు.

భరోసా ఇస్తారా?

గత ఏడాది ఖరీఫ్ నాటికి కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. దీంతో కచ్చితంగా మరమ్మతులు చేస్తారన్న నమ్మకంతో ఆయకట్టులో అన్నదాతలు సాగు చేపట్టారు. వాణిజ్య, ఆహార పంటలు చేపట్టారు. కానీ, ఈ పథకం మరమ్మతులకు నిధులు అందలేదు. దీంతో నీటి కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తెలంగాణాలోని సీఎం ట్యాంక్ నుంచి దిగువకు రావాల్సిన సాగర్ నీరు కూడా పూర్తిస్థాయిలో అందలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయాయి. మిర్చి, మొక్కజొన్న, మాగాణి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆ చేదు అనుభవాల నడుమ తిరిగి ఖరీఫ్ ప్రారంభమైంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఆదేశించినా పనులు ముందుకు సాగకపోవడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు తగ్గే నాటికి మోటార్లు బిగించి నీటిని విడుదల చేసినా సాగుకు సరిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా నిధులు కేటాయించి మరమ్మతులు ప్రారంభిస్తుందని స్థానిక రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి శాసనసభ సమావేశంలోనే నందిగామ ఎమ్మెల్యే సౌమ్య.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సమస్యను వివరించారు. మరమ్మతులకు నిధులు అందించాలని కోరగా, సంబంధిత మంత్రిని కలవాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో కలిసి సౌమ్య.. మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 5న ముప్పాళ్ల వచ్చిన చంద్రబాబుకు కూడా వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే నిధులు విడుదల చేసి ఖరీఫ్‌కు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే, అంచనాలు రూపొందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. స్థానిక అధికారులు రూపొందించిన అంచనాలపై ఉన్నతాధికారులు రిమార్కులు పెట్టడం, వాటిని సరిచేసి స్థానిక అధికారులు తిరిగి పంపడం జరుగుతోంది. ఇప్పటికే మూడుసార్లు ఇలా జరిగింది. ఈసారైనా అధికారులు, పాలకులు దృష్టిసారించి ఖరీఫ్‌కు పథకాలను సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.

సన్నబియ్యం సంబరం

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యంతో మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థులకు ఆహారం అందించాలని నిర్ణయించారు. మెనూలో కూడా మార్పులు చేసిన ఆయన అన్ని పాఠశాలలకూ సన్నబియ్యం సరఫరా చేయించారు. పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే ఈ బియ్యం అందుబాటులోకి వచ్చేశాయి. నందిగామ మండలం లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది నాణ్యమైన బియ్యంతో విద్యార్థులకు బిర్యానీ వండి పెట్టారు. లింగాలపాడులో సన్న బియ్యంతో అన్నం తిన్న పలువురు విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

విజయవాడ తూర్పు

షాపుల వేలం వాయిదా

వన్‌టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పరిధిలో ఉన్న పటమటలంకలోని శ్రీనల్లూరి వారి ధర్మతోటకు చెందిన కల్యాణమండపం, దుకాణాలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే కాంట్రాక్ట్, కల్యాణమండపం లైటింగ్‌కు ఈనెల 18న నిర్వహించే బహిరంగ వేలం పాట సీల్ టెండర్లను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఈవో కార్యనిర్వహణాధికారి కె.వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి తేదీని తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.


నూతన ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న జీడీఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘ ప్రతినిధులు

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏడుకొండలు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఏడుకొండలు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీజీఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

డీజీ లక్ష్మి పథకంపై అవగాహన

కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : డీజీ లక్ష్మీ పథకం ద్వారా సుమారు 200 సర్వీసులు అందుబాటులో ఉంటాయని నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకట నారాయణ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, విజయవాడ నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగా ఎన్నుకున్న డీజీ లక్ష్మీలకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీ లక్ష్మీ కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ) ఏర్పాటు చేశామన్నారు. దీనికి సంబంధించి ఒక్కొక్క ఎస్‌ఎల్‌ఎఫ్ నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేశామన్నారు. డిగ్రీ అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి, వారికి శిక్షణ తరగతులు నిర్వహించి డీజీ లక్ష్మీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామని వివరించారు. అలాగే బయోమెట్రిక్ డివైస్‌ను సైతం అందించడమే కాకుండా ఏవిధంగా ఉపయోగించాలో తెలియజేశామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారికి లాగిన్ ఇచ్చి, సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సీఎస్‌సీ సెంటర్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సర్వీసులు అన్ని అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సర్వీసులను ప్రజలకు చేరువ చేసేందుకు నగర పరిధిలోని మూడు సర్కిల్‌లలో 450 సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ ఫణికుమార్, సుజాత్, బాజీ షాహీద్, రెడ్డి లత, ద్రాక్షాయని తదితరులు పాల్గొన్నారు.


డీజీ లక్ష్మిలకు బయోమెట్రిక్ డివైస్‌ను అందిస్తున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ

మల్లేశ్వరుని సన్నిధిలో ఉచిత ప్రసాదం పంపిణీ ప్రారంభం

ఇంద్రకీలాద్రి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై భక్తులకు అమ్మవారి దర్శనం అనంతరం ఉచిత ప్రసాదం అందిస్తుండగా, మహాదేవుడైన మల్లేశ్వరుని ఆలయ ప్రాంగణంలో కూడా భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ ప్రారంభమైంది. శుక్రవారం ఈవో వి.కె.శీనానాయక్ ఉచిత ప్రసాదం పంపిణీని ప్రారంభించారు.

దుర్గమ్మను శుక్రవారం విశ్రాంత ఐఏఎస్ అధికారి సతీష్ చంద్ర కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. దర్శనానంతరం వారికి వేద పండితులు వేద ఆశీస్సులు అందించి, ఈవో శీనానాయక్ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

తాడికొండ సుబ్బారావు మోడల్ స్కూల్

రాణిగారితోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 18వ డివిజన్‌లోని తాడికొండ సుబ్బారావు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతుంది. ఈ సంవత్సరం నుంచి పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చడంతో అన్ని సౌకర్యాలు, పూర్తిస్థాయి సిబ్బంది ఉండటంతో గత ఏడాది కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ పాఠశాలలో ఒకటి తరగతి నుండి 5వ తరగతి వరకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల ఉన్నారు. కొత్త ఫర్నిచర్‌తోటు స్కూల్ అవరణలో ఆటల పరికరాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఇప్పటికే పెరిగిందని, ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు.


విద్యార్థులతో కళకళలాడుతున్న తరగతి గది

అక్షరాస్యతలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి

గుణదల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా నూటికి నూరుశాతం అక్షరాస్యత స్థానం కైవసం చేసుకోవడానికి అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన భూమిక పోషించనున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి తెలిపారు. రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ బాల్యం నుంచి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే ప్రక్రియ అంగన్వాడీ కేంద్రాల్లోనే జరుగుతుందన్నారు. విద్యాభ్యాసంతోపాటు ఆటపాటలు, కథలు, ఇంగ్లీష్ రైమ్స్ నేర్పడం జరుగుతుందన్నారు. చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.


బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న స్వర్ణకుమారి

తల్లికి వందనం నగదు జమ.. లబ్ధిదారుల ఆనందం

విద్యాధరపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో నగదు జమకావటంతో శుక్రవారం తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఒక లబ్ధిదారురాలు గాడు పద్మ మాట్లాడుతూ శుక్రవారం తన ఖాతాలో నగదు జమ అయిందని తెలిపారు. భవానీపురం బాలభాస్కర్ నగర్‌కు చెందిన పద్మకు ముగ్గురు కుమార్తెలు, వారికి సంబంధించిన నగదు తన ఖాతాలో జమ కావటంతో ఆనందం వ్యక్తంచేశారు. భవానీపురం జోజినగర్‌లో ఉంటున్న మసీదు మౌజర్ షేక్ షహీషా తనకు ముగ్గురు సంతానం అని వారికి ముగ్గురికి సంబంధించిన తల్లివందనం పథకానికి సంబంధించిన నగదు తన బ్యాంకు ఖాతాలో జమఅయినట్టు తెలిపారు.

కొండపైన అనధికార కట్టడాలను నివారించండి

● విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజల క్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, కొండపైన అనధికార కట్టడాలను నిర్మూలించాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం వన్‌టౌన్, పంజా సెంటర్, చిట్టినగర్, కేఎల్ రావు పార్క్, సీవీఆర్ ఫ్లైఓవర్, ఫైపుల రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాల్లో ధ్యానచంద్ర పర్యటించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణాలకు ఎటువంటి హానిజరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వన్‌టౌన్ బ్రిడ్జి వద్ద కూలిన గోడను చూసి త్వరగా మరమ్మతులు చేయాలన్నారు. గోడ నిర్మాణం పూర్తయ్యేలోపు వెంటనే మెస్ వేయాలన్నారు. కేఎల్ రావు రోడ్డు, కేఎల్ రావు పార్కు ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీవీ ఆర్ ఫ్లైఓవర్ కింద ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్ వద్ద డీసిల్టింగ్ ప్రక్రియను పరిశీలించి కమిషనర్ పలు సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీవీఆర్ ఫ్లైఓవర్ వంతెన కింద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర


ఎంపీ కేశినేని చిన్నిని సత్కరిస్తున్న ఎస్‌సీఆర్‌ఎంయూ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకరరావు, డివిజనల్ సెక్రటరీ ఎం.లీల

మర్యాదపూర్వకంగా..

● ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన ఎస్‌సీఆర్‌ఎంయూ నాయకులు

రైల్వేస్టేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శంకరరావు ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ఎంపీ వారితో చర్చించారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ, విస్తరణ, ప్రగతిపై సమాలోచన చేశారు. ప్రజల ప్రయోజనం కోసం రైల్వేసేవల్లో పురోగతికి తాను అందుబాటులో ఉండి పనిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. డివిజనల్ సెక్రటరీ ఎం.లీల, రాష్ట్ర జనరల్ సెక్రటరీ జీఎస్ శ్రీనివాస రావు, ఏడీఎస్ కె.పాములు, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి క్యాడెట్లు

గుణదల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండటంతోపాటుగా మరొకరికి ప్రాణదానంతో సమానం అని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. నగరంలోని పలు కళాశాలల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో చాలామంది రక్తస్రావం ఎక్కువగా జరగడం వల్ల సరైన సమయంలో రక్తం దొరక్క చనిపోతున్నారన్నారు. అటువంటి వారికి ఈతరహా రక్తదానం వల్ల ప్రాణప్రదాయినిలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి వ్యక్తి యేడాదికి ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎం.మాల్యాద్రి, ఎన్ ఎస్ఎస్ అధికారి కె.రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరాధారం

● ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీర్లంకయ్య

విజయవాడ(స్పోర్ట్స్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీర్లంకయ్య శుక్రువారం మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారణమైనవన్నారు. విజిలెన్స్ రిపోర్ట్‌లో తనపై చేసిన ఆరోపణలను సమీక్షించి, సంబధిత నిర్ణయాలను పునర్విచారించాలని కోరారు. అసోసియేషన్ 2016-18సంవత్సారాలకు సంబంధించి ఆడిట్ రిపోర్టులు, ఖాతాలు, వినియోగ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్2019 ఆగష్టు లోనే సమర్పించామన్నారు. విజిలెన్స్ రిపోర్టులో పేర్కొన్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. తాను 2023లోనే పదవి నుంచి తప్పుకున్నానన్నారు. ప్రభుత్వ మెమో అమలును పునర్పించాలని కొరుతూ అవసరమైన సమాచారాన్ని అందించడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటానని తెలిపారు.

కమ్యూనిస్టుల పాలనలోనే నగరాభివృద్ధి

● సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

వన్‌టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల పాలనలోనే విజయవాడ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ 53, 37 డివిజన్ శాఖల రెండో మహాసభ శుక్రవారం వన్‌టౌన్‌లోని మా ఇల్లు కల్యాణ మండపంలోకొరగంజి దుర్గాంబ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జూలై 7,8 తేదీల్లో సీపీఐ విజయవాడ నగర సమితి మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ముందుగా నగరంలోని 75 సీపీఐ శాఖల మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో స్థానిక సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను కలుపుకొని స్థానిక సమస్యలపై పోరాడాలని డివిజన్ నాయకులకు సూచించారు. నగర పార్టీ సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టు రమణారావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్13(ఆంధ్రజ్యోతి): కృష్ణలంక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, మెయింటినెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్య నిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రామలింగేశ్వర నగర్, ఎంజీ రోడ్డు, పకీరుగూడెం, ప్రగతినగర్, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్ నగర్, చంద్రమౌళిపురం, మొహిద్దీన్ ఎస్టేట్, పటమటలంక, కన్నా నగర్, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్, ఈనాడు, రాఘవ నగర్, నేతాజీ రోడ్, సీతారామ నగర్, ఆశ్రమం రోడ్డు, మసీదు వీధి, సత్యనారాయణ నగర్, పోలీస్ కాలనీ, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అడ్డదిడ్డ పార్కింగులతో ఇబ్బందులు

భారతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీలోని జామాక్ అపార్టుమెంట్ సమీపంలోని అంతర్గత రోడ్డు భారీ వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది. ఆటోనగర్‌కు సమీపంలో ఉండడంతో కొందరు తమ భారీ వాహనాలను ఈ రోడ్లపై నిలిపివేస్తున్నారు. అంతే కాకుండా వాటి మరమ్మతులు చేయడంతో ఈ రోడ్డు అంతా ఇరుకుగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


జామాక్ అపార్టుమెంట్ పక్క రోడ్డుపై నిలిపిన భారీవాహనాలు



మధురానగర్ ఆర్వోబీపై ..

ఈనెల 3న పప్పులమిల్లు వద్ద ఆర్వోబీ ప్రతిపాదనను ఎంపీ కేశినేని చిన్నికి వివరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

తొలగిన సందిగ్ధం

మధురానగర్, మధ్యకట్టవాసులు నగరంలో బీఆర్టీఎస్ రోడ్డుకు రావాలంటే పప్పులమిల్లు గేటు దాటుకుని రావాలి. రెండుట్రాక్‌లు..రోజూ 70కు పైగా రైళ్ల రాకపోకలు, ఉదయం నుంచి రాత్రి వరకు 72 సార్లు పడే గేటు కారణంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటి నుంచో ఇక్కడ వంతెన కోసం 29, 30, 31 డివిజన్ వాసులు ఎదురుచూస్తున్నారు. తాజాగా పప్పులమిల్లు రోడ్డులో ఆర్వోబీ నిర్మించాలని నిర్ణయించడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది.



గవర్నమెంట్ ప్రెస్ నుంచి తిన్నగా ఉన్న మార్గం (ఎరుపు రంగు), నేతాజీ కాలనీ మీదుగా ఉన్న మార్గంలో మలుపులు (నీలి రంగు)

పప్పులమిల్లు వైపు నిర్మించాలని నిర్ణయం

మధురానగర్, బుడమేరు మధ్య కట్టవాసులకు తీరనున్న ఇబ్బందులు

● గేట్ల బంధనాల నుంచి ప్రజలకు విముక్తి

(ఆంధ్రజ్యోతి-మధురానగర్)

మధురానగర్ ఆర్వోబీ నిర్మాణం విషయంలో సందిగ్ధం తొలగింది. ముందుగా అనుకున్న నేతాజీ కాలనీ రోడ్డులో కాకుండా పప్పుల మిల్లు రోడ్డుమీదుగా ఆర్వోబీని నిర్మించనున్నారు. సెంట్రల్ నియోజవర్గం సింగ్‌నగర్, వాంబేకాలనీ నుంచి నగరంలోకి రావడానికి సింగ్‌నగర్ ఫ్లైవోవర్ ఒక్కటే దారి. టీడీపీ అధికారంలోకి రాగానే సెంట్రల్ నియోజకవర్గం బుడమేరు, ఏలూరు కాల్వ, రైవస్ కాల్వల మీద రైల్వే గేట్ల వద్ద వంతెనల ప్రతిపాదన వచ్చింది. అందులో భాగంగా మధురానగర్‌లో ఒక వంతెన అనుకున్నారు. మధురానగర్ రెండువైపులా రెండు రైల్వేగేట్లు ఉంటాయి. మధురానగర్ స్టేషన్ వద్ద గేటు స్థానంలో ఆర్‌యూబీ నిర్మించినా ట్రాఫిక్ నియంత్రణకు ఇది సరిపోవడం లేదు. దీంతో పప్పులమిల్లు గేటు మీద రద్దీపెరిగింది. ఈ రద్దీని తగ్గించడం కోసం ప్రత్యామ్నాయం అలోచించి చివరకు ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలని నిర్ణయించారు.

నేతాజీ, పప్పులమిల్లు రోడ్ల పరిశీలన

ఆర్వోబీ నిర్మాణానికి నేతాజీ రోడ్డు, పప్పుల మిల్లు రోడ్లను అధికారులు పరిశీలించారు. గవర్నమెంట్ ప్రెస్ నుంచి వీవీ నరసరాజు రోడ్డు మీదుగా నేతాజీ కాలనీ రోడ్డులోకి ఎల్ టర్నింగ్ తీసుకుని బీఆర్టీఎస్ వంతెన పక్కన కిందకు దింపాలని అనుకున్నారు. ఈ నిర్ణయంతో నేతాజీకాలనీ వాసులు తమ ఇళ్లు కోల్పోతామని ఎమ్మెల్యే బొండా ఉమాను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన మార్చి 12న వీఎంసీ అధికారులతో కలిసి నేతాజీ కాలనీకి వచ్చి సర్వే చేశారు. నేతాజీ కాలనీ రోడ్డు మీదుగా ఆర్వోబీ వస్తే కాలనీలో ప్రధాన రోడ్డుకు మధ్యలో మలుపు ఉండటం, ఇరువైపులా ఉన్న ఇళ్ల మొత్తాన్ని కదిలించాల్సి వస్తుందని గుర్తించారు. స్థానికుల ఆందోళన న్యాయమైనదని భావించి రైల్వే అధికారులను మళ్లీ సర్వే చేయమని కోరారు. వారు మే 14న వీఎంసీ, ఆర్ అండ్ బీ, ఇతర శాఖల అధికారులతో కలిసి వచ్చి నేతాజీ రోడ్డు, పప్పుల మిల్లు రోడ్డును పరిశీలించి నిర్ణయాన్ని స్థానికులకు వదిలేశారు.

పప్పులమిల్లు రోడ్డు ఖాయం చేశారిలా..

ఈనెల 3న ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే బొండా ఉమా గవర్నమెంట్ ప్రెస్ నుంచి వీవీ నరసరాజు రోడ్డుమీదుగా పప్పులమిల్లు వంతెన వరకు రోడ్డును పరిశీలించారు. మధ్యలో వీవీ నరసరాజు రోడ్డులో కలిసే నేతాజీ రోడ్డు కూడలి వద్ద ఆగి పరిశీలించారు. ఆర్వోబీకి ఇక్కడ మలుపు అనువుగా లేదని గుర్తించారు. గవర్నమెంట్ ప్రెస్ నుంచి తిన్నగా పప్పుల మిల్లు వంతెన వరకు ఉన్న రోడ్డు ఒకేమార్గంలో ఎక్కడా అడ్డంకి లేకుండా ఉండటంతో చివరకు పప్పుల మిల్లు రోడ్డు ఆర్వోబీ నిర్మాణానికి అనువుగా ఉంటుందని తేల్చారు.

పదేళ్ల కల!

సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్ నిర్మించాలని దశాబ్దకాలంగా కోరుతున్న ప్రజలు

● ట్రాఫిక్ కష్టాలు తప్పించాలని డిమాండ్

● ఫ్లై ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్): అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై నానాటికీ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించేందుకు ఒక్కటే మార్గం కావడంతో ట్రాఫిక్ భారం పడుతోంది. మూడు దశాబ్దాల క్రితం అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉండేవారు. అప్పట్లో వాహనాల సంఖ్య చాలా తక్కువ. అనేక మంది సైకిళ్లు, రిక్షాలు, ఆర్టీసీ బస్సుల్లోనే నగరంలోకి ప్రవేశించేవారు. అజిత్‌సింగ్‌నగర్ రైల్వే ట్రాక్‌ను దాటుకుని రావాల్సి వచ్చేది. రైల్వే ట్రాక్ వద్ద గేటు పడిన సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. సమస్యను అధిగమించేందుకు మూడు దశాబ్దాల క్రితం ఫ్లై ఓవర్ నిర్మించారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. జనాభా నాలుగు లక్షలకు చేరింది. ప్రతి ఇంట్లో ఒకటి, రెండు వాహనాలు ఉన్నాయి. పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాలే కాకుండా నున్న, నూజివీడు, ఆగిరిపల్లి, విస్సన్నపేట, తిరువూరు, ఖమ్మం, సత్తుపల్లి ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించాలంటే ఈ ఫ్లై ఓవర్ ఒక్కటే మార్గం. ఒకటిన్నర కిలోమీటరు ఉండే ఈ ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య రోజూ లక్ష పైమాటే. నేడు ఫ్లై ఓవర్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఫ్లై ఓవర్ కింద ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. రామవరప్పాడు ఫ్లై ఓవర్, పాల ఫ్యాక్టరీ ఫ్లై ఓవర్ ఉన్నా అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయం కాలేకపోతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు పక్కనే రెండవ ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ పదేళ్లుగా ఉంది. నేటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.



ఎమ్మెల్యే, ఎంపీల కసరత్తు

అజిత్‌సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్, ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జిల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఫ్లై ఓవర్, అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరుతూ ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యేలు రైల్వే అధికారులను కలిశారు. ఎంపీ చిన్ని రైల్వే శాఖా మంత్రికి సమస్యను విన్నవించనున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇటీవల సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఇబ్బంది

ఉదయం, సాయంత్రం రాత్రి వేళల్లో ఫ్లై ఓవర్‌ను దాటాలంటే అరగంట సమయం తీసుకుంటుంది. ఫ్లై ఓవర్‌పై వాహనాలు మొరాయించినా, రోడ్డు ప్రమాదాలు జరిగినా ఇక ఫ్లై ఓవర్ దాటడం కష్టమే.

ముంపు సమయంలో నానా ఇబ్బందులు

ఇటీవల సంభవించిన వరద ముంపు సమయంలో ఫ్లై ఓవర్ మీదుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఫ్లై ఓవర్‌పై నిలిచిపోయాయి. ముంపు ప్రాంతాలకు సహాయక చర్యలు అందించడంలో అధికారులు ఇబ్బంది పడ్డారు. ఒకటిరెండు రోజులు హెలికాప్టర్లను వాడాల్సి వచ్చింది.



నంద్యాల జిల్లా పాండురంగాపురంలో బిహార్ సర్పంచుల బృందం

ఏపీలో పంచాయతీ సేవలు అమోఘం

» బిహార్ సర్పంచుల బృందం ప్రశంస.. నంద్యాల జిల్లాలో పర్యటన

నంద్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ సేవలు అమోఘమని బిహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచులు కొనియాడారు. నంద్యాల జిల్లా పాండురంగాపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం బిహార్ సర్పంచుల బృందం పర్యటించింది. ముందుగా డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ సుగుణ శ్రీతో కలిసి గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఆర్‌డీ సెంట్రల్ హెడ్ అశోక్‌కుమార్ బాంజా మాట్లాడుతూ పలు అవార్డులతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీ, మహిళా స్నేహపూర్వక గ్రామం గుర్తింపు దక్కడంతోనే బీహార్ బృందంతో వచ్చినట్టు తెలిపారు. వాటర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వినియోగం అద్భుతంగా ఉందని బిహార్ సర్పంచులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ కన్సల్టెంట్లు నాగేశ్వరరావు, ఆశలత, ఈవోఆర్డీ శివలక్ష్మి, సర్పంచ్ డోలావతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బ్రాండ్లతో రైతులకు టోకరా!

» తక్కువ ధరకు ఇస్తామంటూ ఎర


» నాసిరకం వ్యవసాయ పరికరాలు కొని నష్టపోతున్న అన్నదాతలు

» అధీకృత కంపెనీల్లోనే కొనుగోలు చేయాలి: ఆగ్రోస్

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ పరికరాలు తయారు చేస్తున్న కొన్ని అనధికార కంపెనీలు బ్రాండెడ్ కంపెనీలను తలపించేలా స్టిక్కర్లు వేసి, రైతులకు టోకరా వేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పైగా బ్రాండెడ్ కంపెనీల కన్నా తక్కువ ధరకు ఇస్తామంటూ కొన్ని కంపెనీలు రైతులకు ఎర వేస్తున్నట్టు ఏపీ ఆగ్రోస్ దృష్టికి వచ్చింది. ఏపీ ఆగ్రోస్ గుర్తింపు పొందిన బ్రాండెడ్ కంపెనీల నెట్ డీలర్ ప్రైస్ (ఎన్‌డీపీ) కన్నా తక్కువ ధరకు పరికరాలు మార్కెట్‌లో ఉండటంతో.. చౌకగా ఇస్తున్నారంటూ వాటిని కొని రైతులు మోసపోతున్నట్టు వ్యవసాయ శాఖ దృష్టికి వచ్చింది. ప్రస్తుతం బ్రాండెడ్ కంపెనీల రోటావేటర్లు మోడల్‌ను బట్టి రూ.1.30 లక్షల నుంచి రూ.1.45 లక్షల దాకా ఉండగా.. రూ.50 వేలు సబ్సిడీతో ఏపీ ఆగ్రోస్ రైతులకు ప్రముఖ కంపెనీల రోటావేటర్లు రాయితీపై అందిస్తోంది. అయితే మార్కెట్‌లో ఇంత కన్నా తక్కువ ధరకు రైతులు కొనుగోలు చేసిన విషయాన్ని ఏలూరు జిల్లాకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు దృష్టికి తెచ్చారు. దీంతో డైరెక్టర్ ఆగ్రోస్ అథరైజ్డ్ కంపెనీల ధరలు, రైతులు కొనుగోలు చేసిన రోటావేటర్ల ధరలపై ఆరా తీశారు. ఆరేడేళ్ల క్రితం ఉన్న ధరకు ఇప్పుడెలా అమ్ముతున్నారనే విషయంపై ఆగ్రోస్ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. ఆగ్రోస్‌లో రిజిస్టర్ కాని కంపెనీల్లో తయారైన రోటావేటర్లకు బ్రాండెడ్ కంపెనీల పేర్లుకు పోలిక ఉండేలా ముద్రలువేసి, విక్రయిస్తున్నారని అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో నకిలీ కంపెనీలతో మోసపోకుండా, ఏపీ ఆగ్రోస్ ద్వారా గుర్తింపు పొందిన కంపెనీల డీలర్ల ద్వారా వచ్చిన వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.20.5 లక్షల విరాళం

తిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన పలు ట్రస్టులకు శుక్రవారం రూ.20.50 లక్షలు విరాళంగా అందాయి. విజయవాడలోని ఫార్చ్యూన్ ఫైన్ జ్యూవెలర్స్‌కు చెందిన కోమటి సునీల్ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10.50 లక్షలు అందజేశారు. అలాగే తాడేపల్లిగూడేనికి చెందిన మాతురు పంచాక్షరి.. బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళాల డీడీలను దాతలు అందజేశారు.



రూ.10.5 లక్షల డీడీ అందజేస్తున్న సునీల్ కుటుంబ సభ్యులు

నెల్లూరులో మరో కొవిడ్ కేసు

● జిల్లాలో 12కు చేరిన పాజిటివ్‌ల సంఖ్య

నెల్లూరు (వైద్యం) జూన్ 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో మరో కొవిడ్ కేసు నమోదయ్యింది. నెల్లూరుకు చెందిన 30 ఏళ్ల యువకుడు కరోనా బారిన పడినట్లు శుక్రవారం పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 12కు చేరింది. మరోవైపు కొవిడ్‌ను నిర్ధారించే ర్యాపిడ్ కిట్లు 400 వరకు శుక్రవారం జిల్లాకు చేరుకున్నాయి. వీటిని పీహెచ్‌సీలకు తరలించనున్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

● ఆలిండియా రేడియో కార్యాలయ ప్రాంగణంలో 'యోగాంధ్ర'

విజయవాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవితం యోగాతో సాధ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధతలో భాగంగా నగరంలోని ఆలిండియా రేడియో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆసనాలు వేశారు. పీఐబీ విజయవాడ అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి, ఆలిండియా రేడియో విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో వివిధ విభాగాలకు చెందిన 150 మంది సిబ్బంది పాల్గొన్నారు.



ఆలిండియా రేడియో ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

థర్డ్‌పార్టీ ప్రీమియం పెంపు సరికాదు

● ఐఆర్‌డీఏఐకు ఏపీ లారీ యజమానుల సంఘం లేఖ

విజయవాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాలపై థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని 20 నుంచి 25 శాతం మేర పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు.. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ)కు శుక్రవారం లేఖ రాశారు. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంపుదల లక్షలాది చిన్న, మధ్య తరహా రవాణా వాహనదారులకు ఆర్థిక భారమన్నారు. 2020 నుంచి 2025 వరకు వాహన వర్గాలకు సంబంధించిన థర్డ్‌పార్టీ క్లెయిమ్స్ వివరాలు బహిర్గతం చేయాలన్నారు. చాలాకాలంగా రవాణా రంగం తరఫున తాము థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌పై 12 జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రీమియం ఫీజులు పెంచే ముందు స్టేక్‌హోల్డర్స్‌కు ప్రాతినిధ్యం వహించే ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) ప్రతినిధులతో చర్చ జరిపాకే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతవరకు థర్డ్‌పార్టీ ప్రీమియం పెంపును నిలిపివేయాలని కోరారు.

ఐకానిక్ టవర్స్ వద్ద మౌలికవసతులకు ఆమోదం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఐకానిక్ టవర్స్, హైకోర్టు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాసం తదితర ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలోని 1450 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.1052 కోట్లతో టెండర్లు పిలవడానికి ఆమోదం లభించిందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం సీఎం నివాసం వద్ద సీఎం అధ్యక్షతన సీఆర్‌డీఏ 49వ అథారిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ విలేకరులతో మాట్లాడారు. సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ హైవే-16కు కలిపేందుకు రూ.682 కోట్లతో టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో మాట్లాడామన్నారు. 217 చ.కి మీలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ సిటీగా ఏర్పాటు చేశామన్నారు.

సమస్యలు తలెత్తకుండా ఎన్‌హెచ్-65 విస్తరణ

● డీపీఆర్ పక్కాగా రూపొందించాలి

● అధికారులకు ఎంపీ కేశినేని చిన్ని ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

కలెక్టరేట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్ నుంచి విజయవాడ సెక్షన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ 226 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 65 రహదారిని ఆరులైన్ల రహదారిగా విస్తరించడం శుభపరిణామం. రహదారిగా విస్తరణలో భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తుది డీపీఆర్‌ను పక్కాగా రూపొందించాలి.' అని అధికారులకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 65 రహదారిని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆరు లైన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, నగరపాలక సంస్థ తదితర శాఖలతో ఐకాన్స్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను భాగస్వామ్య పక్షాలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, ఎన్‌హెచ్ఏఐ డైరెక్టర్ ఎం.విద్యాసాగర్ పాల్గొన్నారు.

పీ-4 అమలుకు చేయూతనివ్వండి

రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ 4 విధానాన్ని అమలుచేస్తోందని, దీని అమలుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. శుక్రవారం ఏపీ రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుతో పాటు ఎన్టీఆర్ జిల్లా కొత్త కార్యవర్గ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ చైర్మన్ వెలగా జోషి, సభ్యులు కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో పాటు భవిష్యత్తు కార్యాచరణను డాక్టర్ సమరం కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

కక్ష కట్టారు.. ఖతం చేశారు!

యువకుడిని చంపేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం ● ముగ్గురు నిందితుల అరెస్టు

ఇబ్రహీంపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తమ తండ్రిపై కర్రతో దాడి చేసి మతి స్థిమితం కోల్పోయేందుకు కారకుడైన యువకుడిపై కుమారులిద్దరూ కక్ష పెంచుకున్నారు. పథకం ప్రకారం చంపేసి..రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దర్యాప్తులో పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. సినీఫక్కీలో జరిగిన ఓ మర్డర్‌ను పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామానికి చెందిన నడకుదిటి ఏసుబాబు(25)ను హత్య చేసిన ముగ్గురు నిందితులు సైకం కుమారస్వామి(36), తిరుమలశెట్టి శంకర్(40), సైకం నవీన్‌బాబు(40)ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితులను మీడియా ఎదుట సీఐ ఎ.చంద్రశేఖర్ హాజరుపరిచి, వివరాలు వెల్లడించారు. కాచవరం గ్రామానికి చెందిన సైకం ప్రభాకర్(55), నడకుదిటి ఏసుబాబు(25) ఆటో డ్రైవర్లు. మే 2న రాత్రి స్నేహితుడి ఆటోను ప్రభాకర్ రిపేరు చేస్తుండగా ఆటో శబ్దం రావడంతో ఏసుబాబు వెళ్లి గొడవపడ్డాడు. ప్రభాకర్ ముక్కుపై ఏసుబాబు బలంగా కొట్టి, కర్రతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ప్రభాకర్‌కు మతి స్థిమితం పోయింది. తమ తండ్రి మతి స్థిమితం కోల్పోయేలా చేసిన ఏసుబాబు(25)ను ప్రభాకర్ కుమారులు నవీన్‌బాబు, కుమారస్వామి బెదిరించారు. కారుతో ఢీకొట్టించి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేలా సైకం నవీన్‌బాబు పథకం రచించాడు. దాన్ని అమలు చేసేందుకు అప్పటికే ఓ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్న మామ తిరుమలశెట్టి శంకర్ సాయాన్ని కోరారు. కారును తీసుకుని ఈనెల 5 తేదీ రాత్రి కాచవరం వద్ద కాపుకాసి, తాగి వస్తున్న ఏసుబాబును ఎదురుగా వేగంగా వచ్చి ఢీ కొట్టి మర్డర్ చేశారు. అనంతరం కారుతో పరారయ్యారు. కారును మిర్యాలగూడలో దాచారు. ఏసుబాబు తల్లి అంజలి ఫిర్యాదుపై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కారు ఎవరిదో గుర్తించారు. కుమారస్వామి భార్య పేరుతో కారు రిజిస్టర్ అయి ఉండటంతో ఆకోణంలో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. ఇంతలో శుక్రవారం ముగ్గురు నిందితులు కాచవరం వెళ్లి వీఆర్వో అనూష వద్ద లొంగిపోయారు. ఆమె వారిని పోలీసులకు అప్పగించారు. ఏ1గా కుమారస్వామి, ఏ2గా శంకర్, ఏ3గా నవీన్‌బాబుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిందితులను మీడియాకు చూపుతున్న సీఐ చంద్రశేఖర్

విజయవాడ ఏఎంసీ చైర్మన్, పాలకవర్గ ప్రమాణస్వీకారం రేపు

గొల్లపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం సాయంత్రం గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తామని చైర్మన్‌గా నియమితులైన నర్రా వాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, సత్యకుమార్‌యాదవ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు.



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్న నర్రా వాసు (ఫైల్)

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

టీడీపీలో అంకితభావంతో పనిచేస్తే ప్రతిఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని, అందుకు తానే ఉదాహరణ అని నర్రా వాసు అన్నారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మం త్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ గురించి ఆలోచించడం వృథా: పెమ్మసాని

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ గురించి ఒక నిమిషం ఆలోచన చేసినా వేస్టు అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా రూ.230 కోట్ల ముస్లిం మైనార్టీలకు చెందిన నిధులను పక్కదారి పట్టించారు. దీని వలన ముస్లింల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఇప్పుడు కొత్తగా నిధులు ఇవ్వాలంటే వాటికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ వాటాని కేంద్రం చెల్లించమని కోరుతోంది. దీనిపై దమ్ముంటే ఆ పార్టీ నేత జగన్... లేకుంటే జ్ఞానం కలిగిన నాయకుడు చర్చకు రావాలి. విమాన ప్రమాదం దురదృష్టకరం. ఆ దుర్ఘటన వెనుక ఎలాంటి కుట్రకోణం దాగి ఉందనుకోవడం లేదు' అని పెమ్మసాని స్పష్టం చేశారు.

16 నుంచి లాం ఫాంలో మిరప విత్తనాల విక్రయాలు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని లాం ప్రాంతీయ ఉద్యాన వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 16 నుంచి ఎల్‌సీఏ-625, 643, 657 మిరప రకాల ఫౌండేషన్ విత్తనాలను రైతులకు విక్రయించనున్నట్లు ఫాం అసోసియేట్ డైరెక్టర్ సి.వెంకట రమణ గురువారం తెలిపారు. కిలో విత్తనం రూ.1,200 చొప్పున విత్తన లభ్యత ఉన్నంత వరకు రైతులకు అందిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులు నేరుగా ఫాంలో సంప్రదించాలని కోరారు.

హెల్త్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు సీఎం ఆమోదం

» 8 మంది పేర్లు ఖరారు చేసిన ప్రభుత్వం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం ఎనిమిది మంది సభ్యులతో కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకానికి సీఎం చంద్రబాబు ఆమోదించారు. గుంటూరు మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుబ్బారావు, రంగరాయ మెడికల్ కాలేజీ రిటైర్డ్ ఎనస్థీషియన్ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణుమహేష్ బాబు, స్విమ్స్ నుంచి గైనకాలజిస్ట్ డాక్టర్ కె.మాధవి, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ సూరపనేని సురేష్‌బాబు, మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వై.చంద్రనాయుడు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు ఆమదాలవలసకు చెందిన డాక్టర్ చాపర సుధాకర్, ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ టి.డి.వరుణ్ కుమార్ రెడ్డి, విజయవాడకు చెందిన చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ వై.సాయికిశోర్‌లను ఈసీ మెంబర్లుగా ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్, ఆర్థిక శాఖ సెక్రటరీ, డీఎంఈ, ఆయుష్ డైరెక్టర్లు ఉంటారు. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనుంది.

'వందేభారత్' ఇంజన్‌లో సాంకేతిక సమస్య

● 28 నిమిషాలు నెల్లూరులో నిలిపివేత

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో (20701) సాంకేతిక సమస్య తలెత్తడంతో శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు స్టేషన్‌లో కొంతసేపు నిలిపివేశారు. ఈ రైలు మధ్యాహ్నం 12.30 గంటలకు నెల్లూరు చేరుకుంది. ప్రయాణికులు దిగిన తరువాత ఇంజన్‌లో సాంకేతిక సమస్య కారణంగా రైలు కదల్లేదు. దీంతో రైల్వే టెక్నికల్ ఇంజనీర్లకు సమాచారం అందించగా, వారు సమస్యను గుర్తించి పరిష్కరించారు. తిరిగి 12.58 గంటలకు రైలు తిరుపతికి బయలుదేరి వెళ్లింది.



మేకప్

గుండ్రని ముఖం కోలగా...

మీది చంద్రబింబాన్ని తలపించే గుండ్రటి ముఖం అయినట్టయితే... ముక్కు, కళ్లు, చెక్కిళ్లు తీర్చిదిద్దినట్టు కనిపించడం కోసం ప్రత్యేకమైన మేకప్ చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

ముదురు రంగులు

గుండ్రని ముఖం మరింత గుండ్రంగా కనిపించకుండా ఉండడం కోసం ముదురు రంగులు వాడాలి. చర్మం రంగుకు కనీసం రెండు షేడ్స్ ముదురుగా ఉండే బ్రాంజర్‌ను ఎంచుకోవాలి. అయితే రెడ్ అండర్‌టోన్ కలిగిన బ్రాంజర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. బదులుగా బూడిదరంగు షేడ్స్‌ను వాడుకోవాలి. ఒకవేళ బ్రాంజర్ లేకపోతే, ముదురు రంగు ఫౌండేషన్ లేదా బీబీ క్రీమ్ వాడుకోవచ్చు.

చెక్కిళ్లు ఇలా...

బీబీ క్రీమ్ వాడుకున్నా, బ్రాంజర్ వాడుకున్నా... దాన్ని చెక్కిళ్ల ఎముకల దగ్గర అప్లై చేసుకోవాలి. ఇందుకోసం బ్రాంజ్ సమ్మర్ గ్లో పౌడర్ ఎంతో బాగా నప్పుతుంది. వీటిని చెక్కిళ్ల దగ్గర నుంచి చెవుల వరకూ అప్లై చేస్తూ, చెవుల దగ్గర వెడల్పుగా విస్తరించేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల గుండ్రని ముఖం కోలగా



కనిపిస్తుంది. అలాగే సహజసిద్ధమైన లుక్ కోసం బ్రాంజర్‌ను చర్మంలో కలిసిపోయేలా చక్కగా బ్లెండ్ చేసుకోవాలి.

కాంటూర్

చుబుకం నుంచి నుదురు, కణతల దగ్గర వెంట్రుకల వరకూ బ్రాంజర్‌ను అప్లై చేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం పొడవుగా కనిపిస్తుంది. దవడ ఎముకలు చెక్కినట్టు కనిపించడం కోసం ఆ ప్రదేశాల్లో అప్లై చేసుకోవాలి. అయితే చుబుకానికి బ్రాంజర్‌ను అప్లై చేయకూడదు. అలా చేస్తే, చుబుకం మరింత చిన్నదై ముఖం మరింత గుండ్రంగా కనిపిస్తుంది.

హైలైటర్ ఇలా...

గుండ్రని ముఖం కలిగిన వాళ్లు హైలైటర్‌ను ఎత్తులోనే ఉపయోగించుకోవాలి. అందుకోసం చెక్కిళ్ల ఎముకలకు ఎగువన హైలైటర్‌ను అప్లై చేసుకోవాలి. అలాగే కింది పెదవి దిగువన, చుబుకం పైన, ముక్కు పైన కొద్దిగా అప్లై చేసుకోవాలి.
ఈ కిటుకులను పాటించినట్టయితే గుండ్రంగా ఉండే ముఖం కోలగా కనిపిస్తుంది.

వంటిల్లు

దొండకాయలతో కొత్తగా..

దొండకాయలతో వేపుడు చేస్తే పిల్లలు, పచ్చడి చేస్తే పెద్దలు ఇష్టంగా తింటూ ఉంటారు. ఎప్పుడూ ఇవేనా? దొండకాయలతో కొత్తగా ఏదైనా చేద్దాం అనుకునేవారి కోసమే ఈ రుచులు...



దొండకాయ ఉల్లికారం

కావాల్సిన పదార్థాలు

- దొండకాయలు- పావు కిలో, మెంతులు- పావు చెంచా, జీలకర్ర- అర చెంచా, ధనియాలు- ఒక చెంచా, నూనె- నాలుగు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, ఉప్పు- తగినంత, కారం- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, చింతపండు- రెండు రెమ్మలు, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- దొండకాయలను శుభ్రంగా కడిగి పొడవాటి ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి వేడి చేయాలి. ఇందులో మెంతులు, ధనియాలు, జీలకర్ర వేసి దోరగా వేపి ఒక పళ్లెంలోకి తీసుకోవాలి. తరవాత ఈ గిన్నెలోనే ఒక చెంచా నూనె వేసి వేడి చేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఇవి రెండు నిమిషాలు వేగాక.. స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీలో మెంతులు, ధనియాలు, జీలకర్ర, చింతపండు, కారం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత వేయించిన ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చిన్న గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో కరివేపాకు, దొండకాయ ముక్కలు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత ఉప్పు, పసుపు వేసి బాగా కలిపి మూతపెట్టాలి. మధ్యమధ్యలో కలుపుతూ మగ్గించాలి. దొండకాయ ముక్కలు పూర్తిగా మెత్తబడిన తరవాత గ్రైండ్ చేసిన ఉల్లిపాయ మిశ్రమాన్ని వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న దొండకాయ ఉల్లికారం... వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- దొండకాయలను సన్నని చీలికల్లా కోస్తే తొందరగా మగ్గుతాయి.
- ఉల్లిపాయలు పూర్తిగా వేగాల్సిన అవసరం లేదు. పచ్చివాసన పోతే చాలు.
- కూరలో గ్రేవీ కావాలనుకుంటే ఉల్లిపాయ మిశ్రమంతోపాటు ఒక కప్పు టమాటా గుజ్జు వేసి అయిదు నిమిషాలు ఉడికించాలి. చివరలో ఉప్పు, కారం సరిచూసుకోవాలి.

దొండకాయలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కొవ్వులు ఉండవు. ఎ, బి, సి విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ తగు మోతాదులో ఉంటాయి.

దొండకాయలను తరచూ తినడం వల్ల రక్తంలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. దంతాలు, ఎముకలు బలంగా ఉంటాయి. శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

దొండకాయ 65



కావాల్సిన పదార్థాలు

- దొండకాయలు- అర కేజీ, శనగపిండి- అర కప్పు, బియ్యప్పిండి- పావు కప్పు, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, ఉప్పు- ఒక టీస్పూన చెంచా, పసుపు- పావు చెంచా, కారం- మూడు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, నీళ్లు- రెండు చెంచాలు, నూనె- మూకుడులో సగానికి పైగా, వేరుశనగ గుండ్లు- పావు కప్పు, కరివేపాకు- పావు కప్పు

తయారీ విధానం

- దొండకాయలను శుభ్రంగా కడిగి ఒక్కో దాన్ని నాలుగు పొడవాటి చీలికల్లా కోయాలి. ఒక గిన్నెలో శనగపిండి, బియ్యప్పిండి, కార్న్‌ఫ్లోర్, ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి వేసి బాగా కలపాలి. తరవాత దొండకాయ చీలికలు, అల్లం వెల్లుల్లి పేస్టు, నిమ్మరసం వేసి వేళ్లతో నెమ్మదిగా పొడిపొడిగా ఉండేలా కలపాలి. పిండి మొత్తం దొండకాయలకు పట్టేలా నీళ్ల చుక్కలు చిలకరిస్తూ మరో సారి జాగ్రత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పావుగంటసేపు నాననివ్వాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె పోసి వేడి చేయాలి. తరవాత దొండకాయల మిశ్రమాన్ని కొద్దికొద్దిగా చేతిలోకి తీసుకుంటూ ఒక్కో చీలికను నూనెలోకి జారవిడచాలి. మూడు నిమిషాల తరవాత చిల్లుల గరిటెతో కలుపుతూ కరకరలాడే వరకూ వేయించి ఒక గిన్నెలోకి తీయాలి. అలాగే వేరుశనగ గుండ్లు, కరివేపాకు కూడా వేయించి అదే గిన్నెలోకి తీయాలి. వీటి మీద అర చెంచా ఉప్పు, ఒక చెంచా కారం చల్లి బాగా కలపాలి. ఇలా తయారు చేసుకున్న దొండకాయ 65ని వేడివేడిగా సర్వ్ చేస్తే పిల్లలు ఇష్టంగా తింటారు. సాంబారు, రసంతోపాటు అన్నంలోకి వడియాల మాదిరి తినడానికి కూడా బాగుంటుంది.

జాగ్రత్తలు

- మంట మరీ పెద్దగా, మరీ చిన్నగా కాకుండా మధ్య స్థాయిలో ఉండేలా చూసుకోవాలి. మంట పెద్దగా ఉంటే దొండకాయలు మాడిపోతాయి. చిన్నగా ఉంటే నూనె పీల్చుకుంటాయి.
- పిండిని గట్టిగానే కలపాలి. నూనె మరీ ఎక్కువగా కాగకూడదు.
- సర్వ్ చేసేముందు కొద్దిగా మామిడి పొడి లేదా చిటికెడు నిమ్మ ఉప్పు చల్లితే దీని రుచి మరింత పెరుగుతుంది.

దొండకాయ ఆవకాయ



కావాల్సిన పదార్థాలు

- దొండకాయ ముక్కలు- మూడు కప్పులు, ఆవ పిండి- పావు కప్పు, కారం- అర కప్పు, ఉప్పు- పావు కప్పు, నిమ్మరసం- పావు కప్పు, నూనె- అర కప్పు

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో దొండకాయ ముక్కలు, కారం, ఆవ పిండి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. తరవాత నూనె పోసి కలపాలి. ఇలా తయారు చేసిన దొండకాయ ఆవకాయను గాలి చొరబడని డబ్బాలో లేదా గాజు సీసాలో భద్రపరిస్తే నెల రోజులపాటు నిల్వ ఉంటుంది.

జాగ్రత్తలు

- దొండకాయలను బాగా కడిగి తడిలేకుండా తుడిచి కొద్దిసేపు గాలికి ఆరబెట్టాలి. తరవాతనే ముక్కలు కోయాలి.
- ముక్కలను మరీ చిన్నగా కోయకూడదు. ఒక్కో దొండకాయను ఎనిమిది ముక్కలుగా కోయవచ్చు. పచ్చిగా ఉన్న కాయలను మాత్రమే తీసుకోవాలి.
- నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనెను మాత్రమే వాడుకోవాలి. నూనె వేడిచేయాల్సిన అవసరం లేదు. కల్లుప్పు కలిపితే ఆవకాయ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- ఇష్టమైతే కొన్ని వెల్లుల్లి రెబ్బలు, పావు చెంచా మెంతి పిండి కలుపుకోవచ్చు.

స్ఫూర్తి

ఒకప్పుడు గడప దాటి బయట కాలు పెట్టింది లేదు. ఇంటి పనులు... అత్తమామల సేవకు అంకితమైపోయింది ఆమె జీవితం. ఇవి చాలవన్నట్టు సూటిపోటి మాటలు... వేధింపులు. ఎన్నో ఏళ్లు తనలో తానే రోదించిన ఆమె... చివరకు భర్తను వదిలి నవ జీవన స్రవంతిలోకి అడుగు పెట్టారు. ఆ క్షణం నుంచీ తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితం చేశారు. పంట చేతికి రాక అవస్థలు పడుతున్న రైతుకు అండగా... పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఉద్యమిస్తున్న 51 ఏళ్ల సమితా కౌర్ కథ ఇది.



కాలుష్యంపై ఓ తల్లి పోరాటం

"ఒకటి రెండూ కాదు... పాతికేళ్లు ఇల్లాలి పాత్ర పోషించాను. ఇందులో గొప్పదనమేమీ లేదు కానీ... అక్కడ నన్ను ఎవరూ ఒక మనిషిగా చూడలేదు. తెల్లారింది మొదలు... అర్ధరాత్రి వరకు గొడ్డు చాకిరీ. ఇంటి పనికి తోడు అనారోగ్యంతో మంచానపడ్డ అత్తమామలకు సేవలు. క్షణం తీరిక లేని జీవితం. చుట్టూ అందరూ ఉన్నా... నాకంటూ ఎవరూ లేని ఒంటరితనం. కనీసం తిన్నానా లేదా అని పట్టించుకొనేవారే కరువయ్యారు అక్కడ. భర్త ఉన్నా లేనట్టే. అందుకే ఒకరోజు కఠిన నిర్ణయం తీసుకున్నా. నా ఇద్దరు పిల్లలతో ఇంటిని, భర్తను వదిలి బయటకు వచ్చేశాను. కట్టుబాట్లు, సంప్రదాయాలు, పరువు, ప్రతిష్ఠలు... ఎవరేమన్నా పట్టించుకోలేదు. నా దృష్టిలో విడాకులను సంప్రదాయ విరుద్ధ ప్రక్రియగా చూడకూడదు. నాలాంటి వనితల కథలు వింటే అందులోనూ సానుకూల అంశాలు ఉన్నాయని అర్థమవుతుంది.

విడాకులు తీసుకున్నాకనే నా జీవితాన్ని నేను జీవించడానికి అవకాశం లభించింది. అంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నావని నన్ను చాలా మంది అడుగుతుంటారు. వారికి నేను చెప్పింది ఒక్కటే... 'నా పిల్లలను నేను స్ఫూర్తి కావాలి. వాళ్లు విలువలకు కట్టుబడి ఉండాలి. కంటి ముందు జరిగే అఘాయిత్యాలు, అక్రమాలపై పోరాడాలి' అని. అలానే వారిని పెంచాను. దురదృష్టం ఏంటంటే... తన పిల్లల భవిష్యత్తు కోసం వివాహ బంధాన్ని కొనసాగించాలని మహిళల మీద మాత్రమే ఈ సమాజం ఒత్తిడి తేవడం. ఆమె సమస్యలు, ఇబ్బందులు, వేధింపులు ఎవరికీ పట్టవు. అన్నిటినీ భరించాలి. కానీ మగవారి విషయంలో ఎవరూ ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వరు. ఈ పరిస్థితి మారాలంటే మన పిల్లల్ని విలువలతో పెంచాలి. అదే నేను చేసింది. పంజాబ్ లుధియానా జిల్లా డోరహా పట్టణ ప్రాంతం మాది.

భయపడితే సాధించలేం...

నా భర్త నుంచి విడిపోయాక నా ముందు ఎన్నో ప్రశ్నలు, సవాళ్లు. కానీ అన్నిటినీ నేను సానుకూల దృక్పథంతోనే తీసుకున్నాను. అదే నన్ను ఇక్కడివరకు నడిపించింది. జీవితంలో అత్యంత దుర్భర పరిస్థితులు చూసినవారు... దేనికీ భయపడరు. ఆందోళన చెందరు. రేపటిని తలుచుకొని భయపడితే ఏదీ సాధించలేం. ప్రతి మహిళా ఇది గ్రహించాలి. కుటుంబం ఆమెకు అండగా నిలవాలి. క్లిష్ట సమయంలో నా పిల్లలు, నా తల్లిదండ్రులు, స్నేహితులు అండగా నిలవడంవల్లే నేను ధైర్యంగా నిలబడగలిగాను.

బయటకు వచ్చాక...

రెండున్నర దశాబ్దాలు ఇంటికే పరిమితం అయిన నేను... కట్టు బట్టలతో బయటకు వచ్చాక సామాజిక అంశాలపై దృష్టి పెట్టాను. ప్రధానంగా కరోనా సమయంలో ఢిల్లీ శివార్లలో రైతుల నిరసన నన్ను ఆలోచింపజేసింది. దాంతో రైతు సమస్యలతో పాటు కోరలు చాచిన కాలుష్యంపై కూడా పోరాడాలని నిర్ణయించుకున్నాను. 2020లో 'వియ్ సపోర్ట్ అవర్ ఫార్మర్స్' ఫేస్‌బుక్ పేజీ నిర్వహిస్తున్న బృందాన్ని కలిశాను. చాలా విషయాలు తెలుసుకున్నాను. వ్యవసాయ సంక్షోభంపై పరిశోధించాను. నేను సేకరించిన అంశాలన్నీ ఒకచోట రాయడం రాసుకున్నాను. ఈ క్రమంలో నాకు అర్థమైంది ఏంటంటే... పర్యావరణ సమస్యలకు, వ్యవసాయానికి మధ్య సంబంధం ఉందని. మరి దానికి పరిష్కారం ఏంటి?

అడవులను రక్షించుకున్నాం...

నాలాగా ఆలోచించే 'వారియర్ మామ్స్' బృందాన్ని కలిశాను. వాయు కాలుష్యంపై వారు పోరాడుతున్నారు. ఆ బృందంలో నేనూ సభ్యురాలినయ్యాను. స్వచ్ఛందంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టాను. ముఖ్యంగా ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని దాదుమజ్రా గ్రామం వ్యర్థాలతో నిండిపోయింది. ఆ ప్రాంతానికి వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించాను. అవి పేరుకుపోవడంవల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించాను. అలాగే టెక్స్‌టైల్ పార్కు ప్రాజెక్టు వల్ల విలువైన మత్తేవాడ అడవులు అంతరించిపోయే ప్రమాదం ఉందని గ్రహించి, పంజాబ్ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాశాను. ప్రతి ఎమ్మెల్యే దృష్టికీ సమస్య తీసుకువెళ్లాను. నా లేఖను స్పీకర్ విధాన సభలో చదివి వినిపించారు. అలా రాజకీయ నాయకులు, ప్రజలు, ప్రభుత్వ సహకారంతో అడవులను కాపాడుకోగలిగాం.

నీలి ఆకాశాన్ని చూడలేదు...

పంజాబ్‌ను పీడిస్తున్న అతిపెద్ద భూతం... వాయు కాలుష్యం. ఇక్కడ మేం నీలాకాశాన్ని చూడడం చాలా అరుదు. మా పైన ఎప్పుడూ పొగ కమ్మేసి ఉంటుంది. ఈ సమస్యతో పంజాబ్‌లోని ప్రతిఒక్కరూ బాధపడుతున్నారు. బాధాకరమైన విషయం ఏంటంటే... పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి, దీనికి కారణమైన పరిశ్రమలపై సరైన చర్యలు తీసుకోకపోవడం. పైగా నెపాన్ని రైతుల మీదకు నెట్టడం. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకుండా... ఈ సమస్యలకు పరిష్కారం దిశగా అమృత్‌సర్‌లో తొలి అడుగు వేశాం. అక్కడే ఎందుకంటే... పంజాబ్‌లో అత్యంత కాలుష్య నగరం అది. వ్యర్థాల నిర్వహణను పటిష్ఠంగా అమలు చేయాలని నిర్ణయించాం. సంబంధిత అధికారులు, నాయకులను కలిసి పరిస్థితి తీవ్రతను వివరించాం. ప్లాస్టిక్ రహిత నగరంగా అమృత్‌సర్‌ను మార్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం మా రాష్ట్రం పర్యావరణ పరంగా అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. దీని నుంచి బయటపడేందుకు అన్ని శాఖలు, ప్రజలు, సంస్థలతో కలిసి పని చేస్తున్నాను. నా ఈ ప్రయాణంలో విజయం సాధిస్తానని నమ్ముతున్నాను."



భోజన కుతూహలం

ముళ్ళతోట కూరతో ప్రయోజనాలెన్నో!

సంస్కృతంలో ముళ్ళతోటకూరను 'తండులీయకం' అని పిలుస్తారు. ఈ మొక్కకు ముళ్లు ఉంటాయి కాబట్టి జంతువులు వీటిని తినవు. అందువల్ల కేవలం మనుషులు మాత్రమే తినగలిగిన ఆకు కూర ఇది. సాధారణంగా మనకు రెండు రకాల తోటకూరలు లభ్యమవుతాయి. వీటిలో మొదటిది పెరుగు తోటకూర. ఇది చాలా పెద్దగా పెరుగుతుంది. ఇక రెండోది కోయ తోటకూర. దీనిని కోస్తే మళ్లీ పెరుగుతుంది. అందుకే దీనిని ఒకప్పుడు 'కోయు తోటకూర' అని పిలిచేవారు. అది క్రమేపీ కోయ తోటకూరగా మారింది. ఈ రెండింటి కన్నా ముళ్ల తోట కూర బలవర్ధకమైనది. అంతేకాకుండా దీనిలో అనేక రకాల ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. ఈ ముళ్ల తోటకూర వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం..

- ముళ్ల తోటకూర లేత ఆకులు చలవ చేస్తాయి. మొలల వ్యాధిని పోగొడతాయి. పైత్యాన్ని తగ్గిస్తాయి. రక్తస్రావాన్ని అరికడతాయి. ముఖ్యంగా నీళ్ల విరేచనాలు అవుతున్న సమయంలో ముళ్ల తోటకూర ఒక మంచి మందు.
- ముళ్ల తోటకూర ఆకుల్లో కాల్షియం, ఐరన్, విటమిన్-బి మొదలైనవి ఉంటాయి. క్రమం తప్పకుండా తింటే ఎముకలు బలపడతాయి.
- మహిళల సమస్యలకు ఈ ముళ్ల తోటకూర చాలా మంచి ఔషధం. అధిక రుతుస్రావం, గర్భాశయ సమస్యల నుంచి ఈ తోటకూర ఉపశమనాన్ని ఇస్తుంది. పిల్లలు పుట్టిన తర్వాత గర్భాశయ సాధారణ స్థాయికి చేరుకోవటానికి ముళ్ల తోటకూర ఉపకరిస్తుంది. పిల్లలకు పాలిచ్చే తల్లులు దీన్ని తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.
- ముళ్ల తోటకూర ఆకుల రసాన్ని తీసి... దానితో శరీరంపై ఉన్న పుండ్లను కడిగితే అవి త్వరగా మానిపోతాయి. ఈ ఆకుల గుజ్జును లేదా ఆకుల పొడిని గాయాలపై పూసి కట్టుకడితే మంచి ఫలితాలు లభిస్తాయి.



- ముళ్ల తోట కూర లేత ఆకులతో కూర చాలా రుచిగా ఉంటుంది. లేత ఆకులను బాగా కడిగి ఉడికించాలి. పప్పును కూడా వేరే ఉడికించి.. ఈ రెండింటిని కలపి.. పోపు పెట్టుకుంటే చాలా రుచిగా ఉంటుంది.
- లేత ఆకులను బాగా కడిగి.. కొద్దిగా నూనె వేసి వేయించాలి. దీనిలో పోపు.. చింతపండు రసం వేసి రుబ్బి పచ్చడి చేసుకోవచ్చు.
- ఈ ఆకులను చిన్నగా తరగి.. పెరుగుపచ్చడి కూడా చేసుకోవచ్చు.

- గంగరాజు అరుణాదేవి

ఇలా చేస్తే మోకాళ్ల నలుపు మాయం

కొంతమందికి మోకాళ్లు నల్లగా కనిపిస్తుంటాయి. రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, రాపిడి, మృతకణాలు పేరుకోవడం వల్ల మోకాళ్ల మీద చర్మం నల్లగా మారుతుంటుంది. కొన్ని ఇంటి చిట్కాలతో మోకాళ్ల నలుపును పోగొట్టుకోవచ్చు.

- రెండు చెంచాల తేనెలో ఒక చెంచా పంచదార లేదా అర చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మోకాళ్ల మీద రాసి మెల్లగా మర్దన చేయాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే రక్త ప్రసరణ సజావుగా జరగడంతోపాటు మృతకణాలు తొలగిపోయి మోకాళ్ల చర్మం రంగు మారుతుంది.



- ఒక చెంచా వాల్‌నట్ పొడిలో ఒక చెంచా కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. రాత్రి పడుకొనేముందు ఈ మిశ్రమాన్ని మోకాళ్ల మీద పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే ఫలితం కనిపిస్తుంది.
- కొద్దిగా కలబంద గుజ్జు లేదా పాల మీగడతో మోకాళ్లను రుద్దినా ప్రయోజనం కనిపిస్తుంది.

స్వదేశానికి గంభీర్



బెకెన్‌హామ్: భారత క్రికెట్ జట్టు కోచ్ గౌతం గంభీర్ శుక్రవారం స్వదేశానికి తిరుగు పయనమయ్యాడు. ఇటీవల గంభీర్ తల్లికి గుండెపోటు రావడంతో ఆమెను స్థానిక గంగారాం ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో తల్లిని పరామర్శించేందుకు గంభీర్ అత్యవసరంగా భారత్‌కు రావాల్సి వచ్చింది. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు మొదలవనుంది. అయితే గంభీర్ తిరిగి జట్టుతో ఎప్పుడు చేరతాడనే విషయంలో స్పష్టత లేదు. అలాగే ప్రస్తుతం భారత జట్టు ఇండియా 'ఎ'తో నాలుగు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది. దీంతో గంభీర్ గైర్హాజరీలో జట్టు కోచింగ్ బాధ్యతలు అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే పర్యవేక్షిస్తున్నాడు.

చివరి సన్నాహకం ప్రారంభం

భారత్ 'ఎ'తో సీనియర్ల ప్రాక్టీస్ మ్యాచ్

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టు చివరి సన్నాహకం ప్రారంభించింది. ఇందులో భాగంగా అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్సీలోని భారత్ 'ఎ'తో సీనియర్ జట్టు ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌ను శుక్రవారం ప్రారంభించింది. నాలుగు రోజుల ఈ మ్యాచ్‌లో..తొలి రోజు పలువురు సీనియర్లు బ్యాటింగ్‌కు దిగారు. కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్ అర్ధ శతకాలు సాధించారు. టెస్ట్ మ్యాచ్ సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితుల ఆధారంగా బ్యాటర్లు, బౌలర్లతో ప్రాక్టీస్ చేయించాలని జట్టు యాజమాన్యం నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే ఈ మ్యాచ్‌లో ఒక్కో బౌలర్ రోజూ కనీసం 15 ఓవర్లు వేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపంగా భారత ఆటగాళ్లు చేతులకు నల్ల బ్యాండ్ ధరించి మ్యాచ్‌లో పాల్గొన్నారు.

టాప్‌లో ఎంజీడీ 1 జట్టు

వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చెస్

లండన్: భారత్‌కు చెందిన అథర్వ టయాడే రాణించిన వేళ ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో.. ఎంజీడీ1 జట్టు అగ్రస్థానంలో నిలిచింది. టోర్నీలో ఆడిన 8 మ్యాచ్‌ల్లోనూ అథర్వ గెలవడం విశేషం. 6 విజయాలు, ఒక డ్రా, ఒక ఓటమితో రెండోరోజు తర్వాత 13 మ్యాచ్ పాయింట్లతో అర్జున్ ఇరిగేసి ఆధ్వర్యంలోని ఎంజీడీ1 జట్టు హెక్సామైండ్ టీమ్‌తో కలిసి సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతోంది. విశ్వనాథన్ ఆనంద్ సారథ్యంలోని ఫ్రీడమ్ జట్టు (12 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచింది.

చరిత్రకు చేరువలో..

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 213/2

- మార్‌క్రమ్ అజేయ శతకం
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 207 ఆలౌట్
- రబాడకు నాలుగు వికెట్లు



విజయానికి 69 పరుగుల దూరంలో సఫారీలు

డబ్ల్యూటీసీ ఫైనల్

మార్‌క్రమ్ (102 బ్యాటింగ్)

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో దక్షిణాఫ్రికా అద్భుతంగా కోలుకుంది. రెండు రోజులపాటు బౌలర్ల ఆధిపత్యం చూపిన చోట.. ఆ జట్టు బ్యాటర్లు చరిత్రను సృష్టించేందుకు సిద్ధమయ్యారు. 282 పరుగుల కష్టసాధ్యమైన ఛేదన కోసం బరిలోకి దిగిన సఫారీలకు ఓపెనర్ మార్‌క్రమ్ (159 బంతుల్లో 11 ఫోర్లతో 102 బ్యాటింగ్) అజేయ శతకం, కెప్టెన్ బవుమా (121 బంతుల్లో 5 ఫోర్లతో 65 బ్యాటింగ్) నిలకడైన ఆటతీరుతో అండగా నిలిచారు. దీంతో ఇన్నాళ్లూ తమకందకుండా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌కు ఆ జట్టు కేవలం 69 పరుగుల దూరంలో నిలిచింది. శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 213/2 స్కోరుతో ఉంది. క్రీజులో ఉన్న మార్‌క్రమ్, బవుమా మూడో వికెట్‌కు అజేయంగా 143 పరుగులు జత చేయగా.. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప శనివారం వీరి చరిత్రాత్మక విజయం ఖాయంలా కనిపిస్తోంది. స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌటైంది. స్టార్క్ (58 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించాడు. రబాడకు నాలుగు, ఎన్‌గిడికి మూడు వికెట్లు దక్కాయి. మరోవైపు ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు నివాళిగా ఇరు జట్ల ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ధరించి ఆడారు.



బవుమా (65 బ్యాటింగ్)

స్టార్క్ అండగా పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 144/8తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ మరో 63 పరుగులు జోడించింది. లియోన్ (2)ను ఆరంభంలోనే రబాడ ఎల్బీ చేయగా.. ఆఖరి వికెట్‌కు హాజెల్‌వుడ్‌తో కలిసి స్టార్క్ అద్భుతంగా పోరాడాడు. ఇద్దరూ ఓపిగ్గా ఆడి సఫారీ బౌలర్లను విసిగించారు. ఈ జోడీ 22.2 ఓవర్లు ఆడగా.. ఈ క్రమంలో స్టార్క్ హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. ఎట్టకేలకు 65వ ఓవర్‌లో హాజెల్‌వుడ్‌ను మార్‌క్రమ్ అవుట్ చేయడంతో పదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

శతక భాగస్వామ్యంతో..: రెండో సెషన్‌లో 282 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు పరిస్థితులు కూడా చక్కగా అనుకూలించాయి. తొలి రెండు రోజుల మాదిరి కాకుండా ఎండ కాయడంతో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. కొత్తబంతి చక్కగా స్వింగ్ అవుతున్నప్పటికీ బ్యాటర్లు దీటుగా ఎదుర్కొన్నారు. ఓపెనర్ రికెల్టన్ (6) మూడో ఓవర్‌లో వెనుదిరిగినా మార్‌క్రమ్ జట్టుకు అండగా నిలిచాడు. ముల్డర్ (27)తో కలిసి రెండో వికెట్‌కు 61 రన్స్ జోడించాడు. అనంతరం అతడికి బవుమా జత కలవడంతో ఆసీస్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. రిస్కీషాట్లకు వెళ్లకుండా జాగ్రత్తగా ఆడేస్తూ మార్‌క్రమ్ సెంచరీతో, బవుమా హాఫ్ సెంచరీలతో ఆఖరి సెషన్‌ను వికెట్ కోల్పోకుండా ముగించారు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్.
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్.
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59).
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 213/2 (మార్‌క్రమ్ 102 బ్యాటింగ్, బవుమా 65 బ్యాటింగ్; స్టార్క్ 2/53).

1 టెస్టుల్లో 9, అంతకంటే దిగువ బ్యాటర్‌గా వచ్చి ఎక్కువ హాఫ్ సెంచరీ (9)లు సాధించిన బ్యాటర్‌గా స్టార్క్

2 టెస్టు చరిత్రలో ఆఖరి వికెట్‌కు మూడుసార్లు 50+ పరుగుల భాగస్వామ్యం అందించిన రెండో జోడీగా స్టార్క్-హాజెల్‌వుడ్. గతంలో వాట్లింగ్-బౌల్ట్ (కివీస్) ఉన్నారు.

పసిడి పట్టేసింది

షూటింగ్ వరల్డ్‌కప్‌లో సురుచి సంచలనం



మ్యూనిచ్ (జర్మనీ): భారత యువ షూటర్ సురుచి సింగ్ మరోసారి సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. 19 ఏళ్ల ఈ హరియాణా స్టార్ ఈ ఏడాది వరుసగా మూడోసారి ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో వ్యక్తిగత స్వర్ణం కొల్లగొట్టింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో సురుచి 241.9 పాయింట్లు స్కోరు చేసి చాంపియన్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ రన్నరప్, ఫ్రాన్స్ షూటర్ కామిల్లె (241.7) రజతానికి, చైనాకు చెందిన యావో కియాన్‌గ్జువాన్ (221.7) కాంస్యానికి పరిమితమయ్యారు. ప్రస్తుత వరల్డ్ కప్‌లో భారత్‌కిదే తొలి పసిడి పతకం. ఇప్పటికే అంజుమ్, సిఫ్ట్ కౌర్ కాంస్యాలు నెగ్గారు. ఇక.. ఈ ఏడాది ఆరంభంలో బ్యూనస్ ఎయిర్స్, లిమా వేదికల్లో జరిగిన వరల్డ్ కప్‌లలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సురుచి రెండు స్వర్ణాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

ఫిన్ అలెన్ రికార్డు శతకం

ఓక్లాండ్: ఐపీఎల్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిన న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ టీ20ల్లో రికార్డు సృష్టించాడు. శుక్రవారం యూఎస్‌లో ఆరంభమైన మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)లో శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ జట్టు తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అలెన్.. 5 ఫోర్లు, 19 సిక్సర్లతో 51 బంతుల్లోనే 151 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో పొట్టి ఫార్మాట్‌లో పలు రికార్డులు బద్దలుకొట్టాడు. టీ20ల్లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్, సాహిల్ చౌహాన్ (18)లను అధిగమించాడు. అలాగే ఈ ఫార్మాట్‌లో వేగంగా (49 బంతుల్లో) 150 పరుగులు సాధించిన ఆటగాడయ్యాడు. ఇక 34 బంతుల్లో మెరుపు శతకంతో ఎంఎల్‌సీలో అలెన్ రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో 269/5 స్కోరు చేయగా, ప్రత్యర్థి వాషింగ్టన్ ఫ్రీడమ్ 146 పరుగులకే కుప్పకూలింది.



ఆ ఇద్దరిలా నన్ను ఆదరించలేదు..

- జొకోవిచ్ ఆవేదన



న్యూఢిల్లీ: అధునాతన టెన్నిస్‌లో రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్ దిగ్గజ త్రయం. అయితే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ప్లేయర్‌గా ఫెడరర్, నడాల్‌ను అధిగమించి ముందువరుసలో ఉంటాడు జొకోవిచ్. ఫెడెక్స్, రఫా ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించినా..జొకో మాత్రం ఇంకా ఆటలో కొనసాగుతున్నాడు. కానీ, టెన్నిస్ అభిమానులు ఫెడరర్, నడాల్‌ను ప్రేమించినంతగా తనను ప్రేమించలేదని జొకో వాపోయాడు. 'ఫెడరర్, నడాల్‌పై చూపిన ప్రేమను టెన్నిస్ ఫ్యాన్స్ నాపై చూపలేదు. బహుశా నేను ఆ ఇద్దరి స్థాయి ఆటగాడిని కాదేమోనని భావించారేమో' అని జొకో అభిప్రాయపడ్డాడు. 'వారిద్దరితో సమానంగా అభిమానులు ఆదరించకపోవడం నన్ను బాధించింది. ఫెడెక్స్, రఫా స్థాయిలో అభిమానుల మద్దతు పొందేందుకు ఆట పరంగా నా ప్రత్యేకతను నిరూపించుకొనేందు ఎంతో ప్రయత్నించా' అని ఓ ఇంటర్వ్యూలో జొకో తన మనసులోని ఆవేదనను వెలిబుచ్చాడు.

సోఫీ వచ్చేసింది

భారత్‌తో టీ20లకు ఇంగ్లండ్ మహిళల జట్టు



లండన్: ఈనెల 28 నుంచి భారత్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 14 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టును ప్రకటించారు. కొన్నిరోజుల క్రితం క్రికెట్ నుంచి తాత్కాలిక విరామం తీసుకున్న స్టార్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ తిరిగి జట్టులోకి వచ్చింది. నాట్ షివర్ బ్రంట్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇంగ్లండ్‌లో పర్యటించనున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ తొలుత టీ20లు, తర్వాత 3 వన్డేల సిరీస్‌లో తలపడనుంది.

హాకీ అమ్మాయిల హ్యాట్రిక్

ఆంట్వెర్ప్ (బెల్జియం): ఐరోపా టూర్‌లో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 3-2తో బెల్జియంను చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది.

ప్రపంచకప్ గ్రూప్-సిలో భారత్: ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి చిలీలోని శాంటియాగో వేదికగా జరిగే హాకీ మహిళల జూనియర్ ప్రపంచకప్‌లో పటిష్ఠ జర్మనీ, ఐర్లాండ్, నమీబియాలతో కలిసి భారత్ గ్రూప్-సిలో చోటు దక్కించుకుంది.

బంగారం మళ్లీ లక్ష

రికార్డు స్థాయికి వెండి



న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతలతో శుక్రవారం బులియన్ మార్కెట్ రేసుగుర్రంలా పరిగెత్తింది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.2,200 లాభంతో రూ.1,01,540ని తాకింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న నమోదైన రికార్డు ధర రూ.1,01,600తో పోలిస్తే ఇది రూ.60 మాత్రమే తక్కువ. కిలో వెండి ధర రూ.1,100 లాభంతో రూ.1,08,200కు చేరి సరికొత్త రికార్డును నెలకొల్పింది. తెలుగు రాష్ట్రాల్లోనూ 10 గ్రాముల మేలిమి పసిడి ధర శుక్రవారం రూ.1.02 లక్షలపైన ట్రేడైంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,000 లాభంతో రూ.1.2 లక్షలకు చేరింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజ్‌లోనూ ఆగస్టులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే రూ.2,011 లాభంతో రూ.1,00,403 రికార్డు స్థాయికి చేరింది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పరుగు: అంతర్జాతీయ మార్కెట్లలోనూ పసిడి ధర సెగలు కక్కుతోంది. గురువారం 3,386 డాలర్ల వద్ద వద్ద ముగిసిన ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర శుక్రవారం ఒక దశలో 57.19 డాలర్ల లాభంతో 3,343 డాలర్ల (సుమారు రూ.2,87,732) స్థాయికి చేరింది. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు ధర 3,509 డాలర్ల కంటే ఇది 166 డాలర్లు తక్కువ. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఔన్స్ పసిడి ధర అంతర్జాతీయ మార్కెట్‌లో త్వరలోనే 3,550 డాలర్లకు చేరే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ సంస్థ (కమొడిటీస్ రీసెర్చి) విభాగం ఏవీపీ కయనత్ చైన్‌వాలా తెలిపారు. ఔన్స్ ధర 3,400 డాలర్ల పైన ట్రేడైనంత వరకు పసిడికి ఢోకా ఉండకపోవచ్చన్నారు. ఒకవేళ పడినా 3,240 డాలర్ల వద్ద గట్టి మద్దతు లభిస్తుందన్నారు.

ర్యాలీకి కారణాలు

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ప్రారంభమైన పోరు.
- పెట్టుబడుల రక్షణ కోసం పసిడి కొనుగోళ్లు పెరగడం.
- అమెరికా వాణిజ్య సుంకాలపై కొనసాగుతున్న అనిశ్చితి.
- అమెరికాలో వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలు.
- పడిపోతున్న డాలర్ మారకం రేటు.
- అమెరికా ద్రవ్య లోటు రికార్డు స్థాయిలో ఏడు శాతానికి చేరడం.
- అమెరికా అప్పుల కుప్పగా మారడం.

వడ్డీ రేట్లు తగ్గించిన ఎస్‌బీఐ

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ గృహ రుణాలపై వడ్డీరేటు అర శాతం తగ్గించింది. దీంతో గృహ రుణాలపై ఎస్‌బీఐ వసూలు చేసే కనీస వడ్డీ ప్రస్తుత 8.65% నుంచి 8.15 శాతానికి తగ్గనుంది. ప్రత్యేక డిపాజిట్ పథకాలపై చెల్లించే వడ్డీ రేటు కూడా పావు శాతం కుదించింది. ఆదివారం నుంచే ఈ తగ్గింపులు అమల్లోకి వస్తాయని తెలిపింది.

ఏఎండీ నుంచి ఎం1350 సీరీస్ జీపీయూ

శాన్‌జోస్: చిప్‌ల తయారీలోని అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్ (ఏఎండీ) ఎం1350 సీరీస్ గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్‌ను (జీపీయూ) మార్కెట్లోకి తెచ్చింది. జీపీయూ మార్కెట్లో అగ్రగామి కంపెనీల్లో ఒకటైన ఎన్‌విడియాకు ఇది పోటీ ఇస్తుంది. పాతతరం జీపీయూలతో పోల్చితే నాలుగు రెట్లు అధిక సామర్థ్యం కలిగిన ఈ జీపీయూ ప్రస్తుతం ఉత్పత్తి దశలో ఉందని, మూడో త్రైమాసికం నుంచి కస్టమర్లకు అందుబాటులో ఉంటుందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లిసా సూ చెప్పారు. ఏ టెక్నాలజీ అయినా డెవలపర్ కమ్యూనిటీకి అందుబాటులో ఉన్నప్పుడే ఇన్నోవేషన్‌కు ఆస్కారం ఉంటుందని, ఈ విశ్వాసంతోనే తాము దీనికి సంబంధించిన డెవలపర్ క్లౌడ్ యాక్సెస్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని ఆమె అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,400 ▲	92,950 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,02,530 ▲	92,950 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,400 ▲	92,950 ▲	1,09,000 ▼
ప్రొద్దుటూరు	98,200 ▲	90,340 ▲	1,00,050 ▼
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

బిజినెస్

క్రూడ్ భగ్గు



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో భారీగా పెరిగిన ముడిచమురు ధర

- ఒకదశలో 78.50 డాలర్లకు చేరిన రేటు
- త్వరలో 80 డాలర్లు దాటే అవకాశం

అంతర్జాతీయ కమొడిటీ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్క రోజులో భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఒక దశలో 78.50 డాలర్లకు ఎగబాకినప్పటికీ.. మళ్లీ కాస్త తగ్గి 74.80 డాలర్ల వద్ద స్థిరపడింది. ముడిచమురు ఎగుమతి దేశాల్లో ఒకటైన ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడం ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ జూన్ డెలివరీ క్రూడ్ కాంట్రాక్టు ధర ప్రారంభ ట్రేడింగ్‌లో ఏకంగా 10.08 శాతం (రూ.578) పెరిగి సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.6,311కి ఎగబాకింది. ఆ తర్వాత కాస్త తగ్గి 7.38 శాతం పెరుగుదలతో రూ.6,156 స్థాయిలో ట్రేడైంది. ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే బ్రెంట్ క్రూడాయిల్ రేటు 80 డాలర్లు దాటేయవచ్చని కమొడిటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడి చేసిన ఇజ్రాయెల్.. ఆ దేశ చమురు కేంద్రాలను మాత్రం తాకలేదు. ప్రస్తుతం ఇరాన్ 21 లక్షల బ్యారెళ్ల ముడిచమురును ఎగుమతి చేస్తోంది. భవిష్యత్‌లో ఇజ్రాయెల్ ఇరాన్ చమురు సరఫరాకు భంగం కలిగించినా, ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హార్మజ్ నుంచి ఆయిల్ సరఫరాను అడ్డుకున్నా ధరలు మళ్లీ 100 డాలర్ల దిశగా దూసుకెళ్లవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ క్రూడ్ సరఫరాలో 20 శాతం ఈ సముద్ర మార్గం ద్వారానే జరుగుతుండడమే ఇందుకు కారణం

ఇంధనం, ఎయిర్‌లైన్స్, పెయింట్స్ షేర్లు డౌన్

ముడిచమురు ధరల పెరుగుదలతో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి దేశీయ ఇంధన విక్రయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. క్రూడ్ ధర ఒక డాలర్ పెరిగితే, మన ఇంధన కంపెనీల లాభానికి రూ.200-300 కోట్ల వరకు గండి పడుతుందని అంచనా. పెయింట్ల కంపెనీల తయారీ వ్యయాల్లో సగం వాటా ముడిచమురుదే. ఈ నేపథ్యంలో ఇంధన, ఎయిర్‌లైన్స్, పెయింట్స్, టైర్ల తయారీ సంస్థల షేర్లు గణనీయంగా నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ కంపెనీలైన ఐఓసీ షేరు బీఎస్ఈలో 1.78 శాతం క్షీణించగా.. బీపీసీఎల్ 1.90 శాతం, హెచ్‌పీసీఎల్ 1.41 శాతం తగ్గాయి. ఒకదశలోనైతే బీపీసీఎల్ 6.11 శాతం, హెచ్‌పీసీఎల్ 5.34 శాతం, ఐఓసీ 3.91 శాతం వరకు పతనమైనప్పటికీ మళ్లీ కాస్త కోలుకున్నాయి.


విమానయాన రంగంలో ఇండిగో స్టాక్ 3.71 శాతం, స్పైస్‌జెట్ 1.95 శాతం తగ్గాయి. పెయింట్ల తయారీదారుల్లో ఇండిగో పెయింట్స్ 2.63 శాతం, బెర్జర్ పెయింట్స్ 0.59 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.14 శాతం నష్టపోయాయి. టైర్ల తయారీదారుల్లో సియట్, అపోలో టైర్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

సామాన్యుడిపై ప్రభావమెంత..?

ముడిచమురు ధర 80 డాలర్లు దాటి మరింత ఎగబాకితే దేశీయంగా ఇంధన కంపెనీలు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచాల్సి రావచ్చు. దాంతో వాహనదారులపై భారం పెరగడంతో పాటు సరుకు రవాణా వ్యయం పెరుగుతుంది. ఫలితంగా మార్కెట్లో నిత్యావసరాల ధరలు కూడా ఎగబాకే ప్రమాదం ఉంది. ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియకూ అడ్డుకట్ట పడుతుంది. అంతేకాదు, ప్రభుత్వానికీ ఇది భారమే. ఎందుకంటే, దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతోంది. ముడిచమురు ధరల పెరుగుదల కారణంగా దిగుమతుల వ్యయం పెరిగితే కరెంట్ ఖాతా లోటును నిర్దేశిత లక్ష్యం మేరకు కట్టడి చేయడం సాధ్యపడదు.

స్టాక్ మార్కెట్లో 'అణు' కంపం

- సెన్సెక్స్ 574 పాయింట్లు డౌన్
- 24,750 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ
- 2 రోజుల్లో రూ.8.35 లక్షల కోట్లు ఫట్



ముంబై: ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడుల ప్రకంపనలు ప్రపంచ మార్కెట్లతో పాటు దలాల్‌స్ట్రీట్‌నూ తాకాయి. దాంతో ఈ వారాంతం ట్రేడింగ్ మన సూచీలకు బ్లాక్ ఫ్రైడేగా పరిణమించింది. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1,337.39 పాయింట్లు పతనమై 80,354.59 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 573.38 పాయింట్ల నష్టంతో 81,118.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169.60 పాయింట్లు కోల్పోయి 24,718.60 వద్ద ముగిసింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. ఫలితంగా రెండు రోజుల్లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.8.35 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.447.21 లక్షల కోట్లకు (5.19 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 2.71 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.32 శాతం వరకు నష్టపోయాయి.

- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మన మార్కెట్ నుంచి గురువారం నికరంగా రూ.3,831.42 కోట్ల పెట్టుబడులను ఉపసంహించుకున్నారు. వారాంతం ట్రేడింగ్‌లో మరో రూ.1,263.52 కోట్ల నికర విక్రయాలు జరిపారు.

రూపాయి.. 59 పైసలు నష్టం

ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 55 పైసలు నష్టపోయి రూ.86.11 వద్ద ముగిసింది. క్రూడాయిల్ రేట్లు భారీగా పెరగడంతోపాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.

ఫారెక్స్ నిల్వల్లో భారీ వృద్ధి: ఈనెల 6తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 517 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,665 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ షేర్లకు ఎయిరిండియా సెగ : ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదం నేపథ్యంలో ఎయిరిండియాలో 25.1 శాతం వాటా కలిగిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ షేరు ఒక దశలో 2 శాతానికి పైగా క్షీణించినప్పటికీ, చివరికి 1.7 శాతం నష్టంతో ముగిసింది. కాగా, అమెరికా స్టాక్ మార్కెట్లో బోయింగ్ కంపెనీ షేరు వరుసగా రెండో రోజూ నష్టాల్లో కొనసాగింది. శుక్రవారం ఒకదశలో 4 శాతం వరకు పతనమైంది. బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాల ఇంజన్లను తయారుచేసిన జీఈ ఏరోస్పేస్ షేరు సైతం ఒకదశలో 2.50 శాతం నష్టపోయింది.

ఆరిస్ఇన్‌ఫ్రా ఐపీఓ ధరల శ్రేణి రూ.210-222: ఆరిస్ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ రూ.500 కోట్ల ఐపీఓ ఈనెల 18న ప్రారంభం కానుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.210-222గా నిర్ణయించింది.



ఇజ్రాయెల్ దాడిలో దెబ్బతిన్న ఇరాన్‌లోని ఓ భవనం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు



రక్షణ షెల్టర్లలో ఇజ్రాయెల్ ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

జరిపిన ఈ దాడుల్లో భాగంగా.. ఇరాన్ అణు శుద్ధి కర్మాగారాల్లో అత్యంత ప్రధానమైన నతాంజ్ న్యూక్లియర్ ఎన్‌రిచ్‌మెంట్ ఫెసిలిటీ, డజన్ల కొద్దీ రేడార్ కేంద్రాలు, సర్ఫేస్-టు-ఎయిర్ మిసైల్ లాంచర్లు సహా వివిధ నగరాల్లోని 100 లక్ష్యాలపై 330కు పైగా బాంబులు, క్షిపణులను ప్రయోగించాయి. ఈ దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ చీఫ్ హొస్సేన్ సలామీ, ఆర్మీ చీఫ్ మొహమ్మద్ బాఘేరీ సహా నలుగురు సైనిక జనరళ్లు, కనీసం ఆరుగురు అణు శాస్త్రవేత్తలు, ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు మరణించారు. 'ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్' ఎయిర్‌ఫోర్స్ విభాగానికి చెందిన అగ్రనాయకత్వం సమావేశమైన ఒక అండర్‌గ్రౌండ్ కమాండ్ సెంటర్‌పై తమ యుద్ధవిమానాలు చేసిన దాడిలో పలువురు అధికారులు చనిపోయినట్టు ఇజ్రాయెల్ రక్షణ శాఖ అధికారులు తెలిపారు. కాగా.. శుక్రవారం రాత్రి సమయంలో కూడా ఇరాన్‌లోని ఫోర్డో అణు శుద్ధి కేంద్రం వద్ద రెండు పేలుళ్లు జరిగినట్టు సమాచారం. ఇరాక్‌తో యుద్ధం తర్వాత.. ఇరాన్‌పై జరిగిన అతిపెద్ద దాడులు ఇవే. నిజానికి ఇజ్రాయెల్ దాడుల ముప్పును ముందే ఊహించి.. నతాంజ్‌లోని తన యురేనియం శుద్ధి కర్మాగారాన్ని ఇరాన్ భూమికి 22 మీటర్ల లోతున, 2.5 మీటర్ల మందం ఉండే కాంక్రీట్ గోడలతో నిర్మించింది. అయినా ఇజ్రాయెల్ దాన్ని బంకర్ బస్టర్ బాంబులతో బద్దలుగొట్టింది. తమ దాడుల్లో ఆ కేంద్రం దెబ్బతిన్నట్టు ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఇరాన్ అణు ఇంధన సంస్థ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ కూడా.. నతాంజ్ (ఇరాన్)లోని అణు శుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్ దాడిని ధ్రువీకరించింది. అక్కడ అణుధార్మికత స్థాయులను నిశితంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. ఇక.. తమ దేశంలోని పౌర ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. రక్తపు మరకలు అంటిన చేతులతో ఇజ్రాయెల్ ఈ నేరానికి పాల్పడిందని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. తాము చేసిన దాడులకు ప్రతిగా ఇరాన్ 100 డ్రోన్లను ప్రయోగించిందని.. వాటిని తమ గగనతలానికి ఆవలే అడ్డుకుని కూల్చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఆ ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. తాము ఎలాంటి డ్రోన్లనూ ప్రయోగించలేదని.. త్వరలోనే ప్రతీకార దాడి చేస్తామని స్పష్టం చేసింది. ఇక.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని పలు దేశాలు ఖండించాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నేతలు సంయమనం పాటించాల్సిందిగా ఇరు దేశాలకూ సూచించారు. ఇరాన్ అండతో పనిచేసే లెబనీస్ మిలిటెంట్ గ్రూపు హెజ్బొల్లా కూడా.. ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో చనిపోయినవారికి సానుభూతి తెలిపింది.

మావి ముందుజాగ్రత్త దాడులే..

ఇరాన్ అణు కార్యక్రమాన్ని చాలాకాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్న ఇజ్రాయెల్.. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా ఆపడానికి తాము కట్టుబడి ఉన్నామని చాలాసార్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే.. మూడో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని, మరింత అధునాతనమైన సెంట్రీఫ్యూజ్‌లను ఏర్పాటు చేస్తామని ఇరాన్ గురువారం చేసిన ప్రకటనతో అప్రమత్తమై ఈ దాడులకు పాల్పడినట్టు భావిస్తున్నారు. దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చేసిన ప్రకటన ఇందుకు నిదర్శనం. "టెహ్రాన్ నియంతలు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఇజ్రాయెల్ నాశనానికి బహిరంగంగా, నిస్సిగ్గుగా పిలుపునిస్తున్నారు. అందుకోసం అణ్వాయుధాల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవలికాలంలో ఇరాన్ తొమ్మిది అణుబాంబులు చేయడానికి కావల్సిన శుద్ధి చేసిన యురేనియాన్ని ఉత్పత్తి చేసింది. ఇజ్రాయెల్ మనుగడకే ఇది పెనుముప్పు. ఇరాన్ పాలకుల అణు మారణహోమానికి మా దేశం బలి కాకుండా చూసుకుంటాను" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు, సైనిక స్థావరాలను, ఇరాన్ అణు కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న అధికారులను, సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగినట్టు ఆయన స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా.. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమానికి గుండెకాయలాంటి నతాంజ్ ఎన్‌రిచ్‌మెంట్ ఫెసిలిటీపై తాము దాడి చేశామని.. తాము చేసిన ఈ దాడులు విజయవంతమయ్యాయని.. దేవుడి సహాయంతో తాము మరిన్ని విజయాలు సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న మత రాజ్య పతనం ఈ దాడులతోనైనా మొదలవుతుందని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు.

మమ్మల్ని రక్షించండి..

దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ భారత ప్రధానమంత్రి మోదీ సహా పలు దేశాల అధినేతలకు ఫోన్లు చేశారు. నెతన్యాహూ నుంచి తనకు ఫోన్‌కాల్ వచ్చిందని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా తెలిపారు. నెతన్యాహూకు భారత్ ఆందోళనల గురించి, ఆ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతలు నెలకొనాల్సిన అవసరం గురించి తాను ఆయనకు వివరించానని చెప్పారు. మరోవైపు.. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో తాము తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని, తమను వెంటనే భారత్‌కు తరలించాలని ఇరాన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇరాన్ నడిబొడ్డున ఇజ్రాయెల్ డ్రోన్ల స్థావరం

ఇరాన్‌పై తాము చేపట్టిన ఈ ఆపరేషన్ వెనుక ఎన్నో ఏళ్ల ప్రణాళిక, విస్తృత అధ్యయనం ఉన్నాయని.. తమ సైన్యం, తమ గూఢచార సంస్థ మొస్సాద్, తమ దేశంలోని రక్షణ పరిశ్రమలు.. కలిసి దీన్ని చేపట్టాయని ఇజ్రాయెల్ రక్షణ శాఖకు చెందిన అధికారులు తెలిపారు. ఇరాన్‌పై తమ యుద్ధవిమానాలు దాడి చేసే సమయంలో, ఆ దేశ రక్షణ వ్యవస్థలు పనిచేయకుండా నిర్వీర్యం చేసే ప్రత్యేక ఆయుధాలను, స్ట్రైక్ సిస్టమ్స్‌ను తమ కమాండోలు ఆ దేశంలోకి ఎప్పుడో అక్రమ మార్గాల ద్వారా ప్రవేశపెట్టినట్టు వారు వివరించారు. మొస్సాద్ ఏజెంట్లు భారీగా పేలుడు పదార్థాలు నింపిన కార్లను ఇరాన్‌వ్యాప్తంగా సిద్ధంగా ఉంచారని చెప్పారు. అన్నింటికీ మించి.. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కి సమీపంలోనే విధ్వంసకర డ్రోన్లతో ఏకంగా ఒక బేస్‌నే ఏర్పాటు చేశారని.. దాడి మొదలుకాగానే వాటిని ఉత్తేజితం చేసి టెహ్రాన్‌కు సమీపంలోని మిసైల్ లాంచర్లపైకి ప్రయోగించారని, ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేశారని.. దీంతో తమ దాడులకు అడ్డు లేకుండా అయిందని ఆ అధికారులు వివరించారు.

ఇప్పటికైనా అణు ఒప్పందం కుదుర్చుకోండి: ట్రంప్

ఇకనైనా ఇరాన్ తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని.. లేకపోతే తదుపరి దాడులు మరింత క్రూరంగా, నిర్దయగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆయన తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్‌సోషల్ ద్వారా స్పందించారు. తదుపరి దాడులకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని.. అవి మరింత క్రూరంగా ఉంటాయని అందులో పేర్కొన్నారు. "నేను ఎంత చెప్పినా ఇరాన్ నేతలు కొందరు ధైర్యంగా మాట్లాడారు. కానీ, ఏం జరగబోతోందో వారికి తెలియదు. ఇప్పటికే వారంతా చనిపోయారు. ఇది మరింత ఘోరంగా మారబోతోంది" అని హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌లో ఎంతో విధ్వంసం జరిగిందని, ఎన్నో మరణాలు సంభవించాయని.. ఇప్పటికీ సమయం మించిపోలేదని, మొత్తం నాశనమైపోయేలోగా ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని .. ఒకప్పుడు ఎంతో పేరొందిన ఇరానియన్ సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. "ఇక చావులు ఉండవు. విధ్వంసం ఉండదు. ఆలస్యం కాకముందే చేయండి (ఒప్పందం కుదుర్చుకోండి). దేవుడు మిమ్మల్ని దీవించుగాక" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని గంటలకు మరో సంచలన పోస్టు పెట్టారాయన. "అణు ఒప్పందం కుదుర్చుకోవాలంటూ రెండు నెలల క్రితం ఇరాన్‌కు నేను 60 రోజుల అల్టిమేటమ్ ఇచ్చాను. వారు కుదుర్చుకుని ఉండాల్సింది. ఇవాళ 61వ రోజు. ఏం చేయాలో నేను వారికి చెప్పాను. కానీ, వారు చేయలేదు. ఇప్పుడు వారికి బహుశా రెండో అవకాశం ఉంది" అని అందులో పేర్కొన్నారు. అంతకుముందు.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులపై 'ఏబీసీ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇరాన్‌పై ఇజ్రాయెల్ అద్భుతంగా దాడులు చేస్తోందని ప్రశంసించారు. కాగా.. ఇరాన్‌పై దాడుల్లో తమ ప్రమేయం లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రుబియో స్పష్టం చేశారు.

'ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇరాన్ ఎదురుదాడి

తమ దేశంపై దాడికి ప్రతిగా ఇరాన్ 'ట్రూ ప్రామిస్ 3' పేరుతో.. ఇజ్రాయెల్‌పై ఎదురుదాడి మొదలుపెట్టింది. ఆ దేశంపైకి వందలాది బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ అధికారిక వార్తాసంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. అలాగే.. తమ గగనతలంలోకి వచ్చిన రెండు ఇజ్రాయెలీ యుద్ధవిమానాలను ఇరాన్ సైన్యం కూల్చేసినట్టు తెలిపింది. మరోవైపు.. ఇరాన్ నుంచి డజన్ల కొద్దీ క్షిపణులు దూసుకొచ్చినట్టు ఇజ్రాయెల్ సైన్యం నిర్ధారించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, జెరూసలెం గగనతలంలోకి రాకెట్లు దూసుకొచ్చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దాడుల్లో ఏడుగురు పౌరులు స్వల్పంగా, ఒకమాదిరిగా గాయపడినట్లు స్థానిక అత్యవసర సేవల విభాగాధిపతి తెలిపారు. తమ యుద్ధవిమానాలు టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 350 కిలోమీటర్ల దూరంలోని ఇస్ఫాహన్‌లో ఉన్న అణుస్థావరంపై దాడి చేసినట్టు ఇజ్రాయెల్ ఒక ప్రకటనలో తెలిపింది. అక్కడ వందలాది అణు శాస్త్రవేత్తలు, మూడు చైనీస్ రిసెర్చ్ రియాక్టర్లు ఉన్నట్టు పేర్కొంది.

మృతుల్లో ప్రముఖులు..

సైనిక జనరళ్లు

మేజర్ జనరల్ మొహమ్మద్ బాఘేరీ: ఇరాన్ ఆర్మీ చీఫ్. సుప్రీం లీడర్ ఖమేనీ తర్వాతి అత్యున్నత స్థాయి కమాండర్.

జనరల్ హొస్సేన్ సలామీ: ఇరాన్ ప్రధాన సైనిక శక్తి 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్' అధిపతి.

జనరల్ గులాం అలీ రషీద్: ఇరాన్ సాయుధ బలగాల డిప్యూటీ కమాండర్ ఇన్ చీఫ్.

జనరల్ అమీర్ అలీ హాజీజాదే: ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ఎయిర్‌స్పేస్ విభాగాధిపతి. (ఇజ్రాయల్‌ను సర్వనాశనం చేస్తానని ఈయన పలు బహిరంగ వేదికలపై ప్రకటించారు).

అణు శాస్త్రవేత్తలు

ఫెరెదౌన్ అబ్బాసీ: ఇరాన్ అణు ఇంధన సంస్థ మాజీ చీఫ్

మొహమ్మద్ మెహదీ టెహ్రాన్‌జీ: థియరిటికల్ ఫిజిసిస్ట్, ఇస్లామిక్ ఆజాద్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు.

సయ్యద్ అమీర్ హొస్సేన్ ఫెఖీ: షహీద్ బెహెష్తి యూనివర్సిటీ ఆఫ్ టెహ్రాన్‌లో.. న్యూక్లియర్ ఇంజనీరింగ్ ఫేకల్టీ సభ్యుడు. ఇరాన్ అణు ఇంధన సంస్థ డిప్యూటీ చీఫ్.

..వీరితోపాటు మరో ముగ్గురు అణు శాస్త్రవేత్తలు అబ్దుల్ హమీద్ మినూచెహ్ర్, అహ్మద్ రెజా జోల్ఫాఖారీ, మత్‌లబీజాదేహ్ కూడా మరణించారు. ఈ దాడుల్లో అణుశాస్త్రవేత్త మత్‌లబీజాదేహ్ భార్య కూడా మరణించినట్టు సమాచారం.

రాజకీయ నాయకుడు

అలీ షమ్‌ఖానీ: ఇరాన్‌లోని అత్యంత ప్రభావశీల రాజకీయ నాయకుల్లో ఒకరు, ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి అత్యంత సన్నిహితుడు. అమెరికాతో ఇరాన్ జరుపుతున్న అణు చర్చల్లో కీలక వ్యక్తి.



ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్

చిత్రజ్యోతి

SINCE 1965



షేర్ చేస్తే కఠిన చర్యలు

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం విదితమే. రొమాంటిక్ హారర్ కామెడీగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా టీజర్‌ని ఈనెల 16న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇదివరకే ప్రకటించింది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేసుకుంది. అయితే ఈ చిత్ర టీజర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలు తాజాగా లీక్ అయ్యాయి. ఈ విజువల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారడంతో చిత్రబృందం ఘాటుగా స్పందించింది. లీక్ అయిన కంటెంట్‌ను షేర్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్'కు సంబంధించిన అనధికారిక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్లు తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రేక్షకులకు సినిమాటిక్ అనుభూతిని ఇచ్చేందుకు చిత్రబృందం కష్టపడుతోందని, దానికి అందరూ సహకరించాలని కోరింది. కాగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ సరసన మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

గేదెల రాజు కథ



నటుడిగా గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తెర ముందూ, వెనుకా తనదైన ముద్రతో ఇండస్ట్రీలో సుదీర్ఘ కెరీర్‌ను సొంతం చేసుకున్నారు రఘు కుంచే. ఆయన టైటిల్ రోల్ పోషించిన తాజా చిత్రం 'గేదెల రాజు కాకినాడ తాలూకా'. రఘు కుంచే సమర్పించడంతో పాటు సంగీతం అందిస్తున్నారు. చైతన్య మోటూరి దర్శకుడు. వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం రఘు కుంచే పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'గేదెల రాజు' ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'నేటి సామాజిక పరిస్థితులకు అద్దంపట్టేలా ఈ చిత్రం ఉంటుంది, ప్రతి ఒక్కరి జీవితానికి అన్వయించుకునే కథ ఇది'ని దర్శకుడు చెప్పారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతోందని నిర్మాత అన్నారు. రవి ఆనంద్, చిన్ని బిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాస్, మౌనిక కీలకపాత్రలు పోషించారు.

ఉత్తమ చిత్రానికి రూ. 10 లక్షలు

- ప్రత్యేక అవార్డుకు రూ. 10 లక్షల నగదు బహుమతి
- ఉత్తమ ద్వితీయ, తృతీయ చిత్రాలకు రూ. 7, 5 లక్షలు
- ఉత్తమ నటుడికి, ఉత్తమ నటికి చెరో రూ. 5 లక్షలు
- నేడు గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుక



గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవానికి హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఈ వేడుకను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డుల విజేతలకు అందజేసే నగదు బహుమతిని భారీగా పెంచింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సహా పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొననున్నారు. కాగా, గద్దర్ ఫిల్మ్ అవార్డుల జాబితాను ఇటీవలె ప్రకటించారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తారు. ఇలా ప్రతి ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తారు. 2024వ సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా బహూకరిస్తారు. వీటితోపాటు 2024వ సంవత్సరం నుంచి రఘుపతి వెంకయ్య, బీఎన్ రెడ్డి, ఎన్టీఆర్, పైడి జైరాజ్, కాంతారావు, చక్రపాణి పేర్లతో ప్రత్యేక అవార్డులను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఈ ఆరు ప్రత్యేక అవార్డుల్లో ఒక్కో అవార్డుకు రూ.పది లక్షల చొప్పున, మూడు ఉత్తమ చిత్రాలకు వరుసగా రూ. 10, 7, 5 లక్షల చొప్పున అందజేయనుంది. అదేవిధంగా ఉత్తమ నటుడు, ఉత్తమ నటికి రూ.5 లక్షల చొప్పున అందజేయనున్నారు. 14 సంవత్సరాల విరామం తర్వాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సహించే సంప్రదాయానికి తెలంగాణ ప్రభుత్వం తిరిగి శ్రీకారం చుట్టడం పట్ల అవార్డుల గ్రహీతలు, సినిమా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ కళారంగంలో వేగుచుక్కలాంటి గద్దర్ పేరిట వివిధ విభాగాల్లో సినిమా కళాకారులకు అవార్డులు అందించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాలను అలరించేలా



సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని తెరకెక్కిస్తున్న చిత్రం 'వైల్డ్ బ్రీత్'. హరినాథ్ పులి దర్శకుడు. డా. మురళీ చంద్ గింజుపల్లితో కలసి సీనియర్ సినీ పాత్రికేయుడు పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నటుడు శివాజీరాజా చేతుల మీదుగా ఫస్ట్‌లుక్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాతగా పర్వతనేని రాంబాబు మరెన్నో విజయాలు అందుకోవాలని ఈ సందర్భంగా శివాజీరాజా ఆకాంక్షించారు. పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'వైల్డ్ బ్రీత్ చిత్రీకరణ పూర్తయింది. హరినాథ్ పులి దర్శకుడిగా తానేంటో ఈ చిత్రంతో నిరూపించుకుంటాడు. సక్సెస్‌తో పాటు మా అందరికీ మంచి పేరు తెచ్చే చిత్రమిది' అన్నారు. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోందని హరినాథ్ పులి చెప్పారు.

బాసిల్‌కు బన్నీ గ్రీన్‌సిగ్నల్?



'పుష్ప అంటే ఇంటర్నేషనల్' అంటూ 'పుష్ప 2' సినిమాలో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్‌లానే ఇప్పుడు ఆయన ఇమేజ్ కూడా ఇంటర్నేషనల్ లెవల్‌కు వెళ్లింది. దాంతో ఆయనతో సినిమాలు చేయబోయే దర్శకులు అంటూ రోజుకో పేరు తెరపైకి తెస్తున్నాయి సోషల్ మీడియా వర్గాలు. తాజాగా అల్లు అర్జున్‌ను డైరెక్ట్ చేయబోతున్న దర్శకుల జాబితాలో మలయాళ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్ పేరు చేరింది. ఆయనతో ఓ సినిమా చేసేందుకు బన్నీ ఎస్ చెప్పారంటూ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బాసిల్ చెప్పిన కథ అల్లు అర్జున్‌కు బాగా నచ్చిందని, త్వరలోనే వీరి కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వస్తుందనేది ఆ వార్తల సారాంశం. బాసిల్ జోసఫ్ నటుడిగా, దర్శకుడిగా మలయాళ పరిశ్రమలో వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు. అయితే అవేవీ అల్లు అర్జున్ స్థాయికి తూగేవి మాత్రం కావు. కాబట్టి ఈ ప్రచారంలో నిజానిజాలేమిటో తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు.

ప్రియాంకను అనుకున్నారు.. రకుల్‌ను తీసుకున్నారు!





భారతీయ చిత్ర పరిశ్రమ ఇప్పుడు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'రామాయణ'. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు నితీశ్ తివారి భక్తిశ్రద్ధలతో రూపొందిస్తున్నారు. వివాదాలకు తావు లేకుండా, విజువల్ వండర్‌గా 'రామాయణ' చిత్రాన్ని రూపొందించడానికి కృషి చేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే మొదలైనా గత ఏడాది నవంబర్ నెలలో అధికారికంగా వివరాలు వెల్లడించారు. సాయిపల్లవి సీతగా, రావణుడిగా కన్నడ హీరో యశ్, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణునిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, లారా దత్తా కైకేయిగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇక ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర శూర్పణఖ. రామ, రావణ యుద్ధం జరగడానికి కారణమైన ఈ పాత్రను రకుల్ ప్రీత్‌సింగ్ పోషించనున్నారు. ఆమె కంటే ముందు ఆ పాత్ర కోసం ఎవరిని సంప్రదించారో తెలుసా? పలు భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ప్రియాంక చోప్రాను. ఆమె శూర్పణఖ పాత్ర పోషిస్తే అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ' చిత్రానికి అదనపు ఆకర్షణ అవుతుందని దర్శకనిర్మాతలు భావించారు. అయితే తనకున్న ఇతర కమిట్‌మెంట్స్ వల్ల ఆ పాత్ర చేయలేనని ప్రియాంక చెప్పడంతో అప్పుడు రకుల్‌ను ఈ అవకాశం వరించింది. ప్రియాంక చోప్రా ఇప్పుడు మహేశ్, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా కూడా రామాయణగాథ స్ఫూర్తితో రూపొందుతుండడం విశేషంగా పేర్కొనాలి.

ఏషియన్ సురేశ్ ద్వారా 'మార్గన్'



విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నిర్మించారు. విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నాడు. మర్డర్ మిస్టరీ- క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీస్థాయిలో 'మార్గన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో సురేశ్‌బాబును విజయ్ ఆంటోని కలిశారు. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇదని విజయ్ ఆంటోని తెలిపారు.

తెలుగు, తమిళ, హిందీ భాషల్లో చిత్ర నిర్మాణం

సురేశ్‌బాబు

దుల్కర్ సల్మాన్, రానా హీరోలుగా నటిస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమైందని, తెలుగుతో పాటు తమిళంలోనూ నిర్మిస్తున్నామని నిర్మాత సురేశ్‌బాబు తెలిపారు. వీటిల్లో వెంకటేశ్, రానా నటించే చిత్రాలు కూడా ఉన్నాయన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం తమ బ్యానర్‌లో తెలుగు, హిందీ, తమిళంలో పలు సినిమాల షూటింగులు జరుగుతున్నాయన్నారు. త్వరలో మనోజ్ బాజ్‌పాయ్‌తో హిందీలో ఓ సినిమా నిర్మించనున్నట్లు చెప్పారు. శోభితతో చిత్రీకరించిన ఓ షోను కూడా అమెజాన్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందన్నారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

థగ్‌లైఫ్ మూవీ బ్యాన్.. కోర్టులో విచారణ

కర్ణాటకలో థగ్‌లైఫ్ సినిమా విడుదలకు సంబంధించి నమోదైన పిటిషన్‌లు సుప్రీంకోర్టు, కర్ణాటక హైకోర్టులో శుక్రవారం ఒకే రోజు విచారణకు వచ్చాయి. థగ్‌లైఫ్ హీరో కమల్ హాసన్ బెంగళూరులో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. కమల్ క్షమాపణ చెప్పకపోతే థగ్‌లైఫ్ సినిమాను రాష్ట్రంలో విడుదల చేయనివ్వబోమని కన్నడ సంఘాలు హెచ్చరించాయి. కర్ణాటక చలనచిత్ర వాణిజ్యమండలి కూడా ఈ మేరకు తీర్మానం చేసింది. దీన్ని ప్రశ్నిస్తూ, సినిమా నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం విచారించింది. సినిమా విడుదలకు అభ్యంతరాలు తెలియజేయాలని కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

టాటా గ్రూప్ చరిత్రలో అత్యంత చీకటి రోజు

» ఉద్యోగులకు చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ లేఖ



అహ్మదాబాద్, జూన్ 13: టాటా గ్రూప్ చరిత్రలో అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిన జూన్ 12 అత్యంత చీకటి రోజని ఆ సంస్థ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఈ మేరకు ఆయన టాటా గ్రూప్ సంస్థ ఉద్యోగులకు లేఖ రాశారు. ఘటనతో షాక్‌కు గురయ్యామని, విషాదంలో మునిగిపోయామన్నారు. ఒకరిని కోల్పోతేనే ఎంతో బాధ ఉంటుందని ఒకేసారి ఇంతమంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూకే, అమెరికా నుంచి అహ్మదాబాద్‌కు దర్యాప్తు బృందాలు చేరుకున్నాయని ఆయన తెలిపారు. దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందని, సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. వాస్తవాలు బయటకు వస్తేనే ఘటన ఎలా జరిగిందో తెలుస్తుందన్నారు. ప్రయాణికుల భద్రతే తొలి లక్ష్యంగా ఎయిర్ ఇండియా సంస్థను చేపట్టామని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

మంటల్లోనూ చెక్కు చెదరని 'భగవద్గీత'

అహ్మదాబాద్, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ప్రయాణికులు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయారు. విమానంలోని 1.25 లక్షల లీటర్ల ఇంధనం కారణంగా మంటలు వ్యాపించి అందులోని భాగాలే కరిగిపోయాయి. ఆశ్చర్యకరంగా ఆ విమాన శకలాల్లో చెక్కుచెదరని రీతిలో ఉన్న పవిత్ర గ్రంథం భగవద్గీత సహాయ సిబ్బందికి లభించింది. అట్ట మీద కొన్ని గీతలు పడడం తప్పిస్తే పుస్తకం అంతా భద్రంగానే ఉంది. ఇస్కాన్ వ్యవస్థాపకుడు స్వామి ప్రభుపాద చిత్రం సహా ఏ ఫొటో కూడా దెబ్బతినలేదు. ఒక్కచోట ఓ పేజీ మాసినట్టు కనిపించినా గ్రంథం మొత్తం బాగానే ఉంది. బహుశా ఆ సమయంలో ఏ ప్రయాణికుడైనా ఆ గ్రంథాన్ని చదువుతూ ఉండవచ్చని భావిస్తున్నారు. మంటలు వ్యాపించినా ఆ పవిత్ర గ్రంథం ఏ మాత్రం దెబ్బతినకుండా కనిపించిందని సహాయ చర్యల్లో పాల్గొన్న సిబ్బంది తెలిపారు.

తెలంగాణ ఉద్యోగులకు తీపికబురు

» 3.64 శాతం డీఏను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

» జూలైలో అందుకునే వేతనంతోపాటు చెల్లింపు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త. పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలలో (డీఏ) ఒక డీఏను ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రెండు డీఏలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2023 జనవరి1కి సంబంధించిన 3.64 శాతం డీఏను శుక్రవారం విడుదల చేసింది. తాజా డీఏతో ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం 26.39 శాతం నుంచి 30.03 శాతానికి పెరగనుంది. ఈ పెరిగిన డీఏ 2023 జనవరి 1 నుంచి అమలు కానుంది. ఈ డీఏకు సంబంధించిన నగదును జూన్ నెల వేతనంలో కలిపి జూలైలో చెల్లిస్తారు. డీఏ బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్ల జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో జమ చేస్తారు. సీపీఎస్ ఉద్యోగులకు మాత్రం 2023 జనవరి 1 నుంచి రావాల్సిన బకాయిల్లో 10 శాతం సొమ్మును వారి ప్రాన్(శాశ్వత పదవీ విమరణ) ఖాతాలో జమ చేస్తారు. మిగిలిన 90 శాతం బకాయిలను 28 నెలలు వాయిదాలలో చెల్లిస్తారు.

పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలి

» బొప్పరాజు డిమాండ్

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరికీ వెంటనే పీఆర్‌సీ అమలు చేయాలని, అప్పటివరకు ఐఆర్ ఇవ్వాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన అమరావతి జేఏసీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించాలని కోరారు. ఉద్యోగులకు 2023 జనవరి 1 నుంచి కొత్త పీఆర్‌సీ రావలసి ఉందన్నా రు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఉదాసీన వైఖరి అవలంబించిందని విమర్శించారు. బకాయిలు తీర్చే దాకా పీఆర్‌సీ అమలు జరగదని కొన్ని సంఘాల నాయకులు పేర్కొనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల నియామకాలు జరగడం లేదని, దీనివల్ల పనిభారం పెరుగుతుందని చెప్పారు. ఆప్కాస్ కన్నా మెరుగైన వ్యవస్థను ప్రభుత్వం తీసుకురావాలన్నారు.

బోయింగ్‌ల కుదింపు?

ఎయిరిండియాలో వాటి సేవలపై కేంద్రం యోచన

» తొలుత సాంకేతిక తనిఖీలకు ఆదేశం

» రేపటి నుంచే సోదాలు చేయాలని నిర్దేశం

» దేశంలోని అన్ని విమానయాన సంస్థల్లో కలిపి మొత్తం 209 బోయింగ్‌లు

» ఒక్క ఎయిరిండియా వద్దే 135



న్యూఢిల్లీ, జూన్ 13: ఎయిరిండియా వద్ద ఉన్న బోయింగ్ విమానాల సంఖ్యను కుదించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానం కూలిన ఘోర దుర్ఘటన తర్వాత సదరు ఫ్లైట్లలో సాంకేతిక లోపాలపై విస్తృతంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాల సేవల తగ్గింపుపై కేంద్రం దృష్టి సారించింది. ఈ సంస్థ విమానాలన్నిటినీ భద్రతాపరంగా సమీక్షించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఇప్పటికే భారత, అమెరికా సంస్థల మధ్య చర్చలు నడుస్తున్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం దర్యాప్తు ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని డీజీసీఏ వర్గాలు తెలిపాయి. అటు విమానాల నిర్వహణలో ప్రామాణిక ఆపరేటింగ్ ప్రక్రియను ఎయిరిండియా అనుసరిస్తున్నదీ లేనిదీ కూడా పరిశీలించనున్నట్లు పేర్కొన్నాయి. దానికి ముందుగా బోయింగ్ విమానాలన్నిటినీ ఒకసారి సాంకేతికంగా తనిఖీ చేయాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది. ప్రమాదాలను నివారించేందుకు జెన్ఎక్స్ ఇంజన్లు కలిగిన బోయింగ్ బీ787-8/9 విమానాల నిర్వహణకు సంబంధించి తక్షణమే అదనపు తనిఖీలు చేపట్టాలని అధికారిక ప్రకటనలో పేర్కొంది. 'ఆదివారం నుంచి ప్రతి బోయింగ్ ఫ్లైట్ బయల్దేరబోయే ముందు అన్నీ ఒకసారి కూలంకషంగా తనిఖీ చేయాలి. ఇంధన పారామీటర్ మానిటరింగ్, దాని అనుబంధ వ్యవస్థలను.. క్యాబిన్ ఎయిర్ కంప్రెషర్, అనుబంధ వ్యవస్థలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఇంజన్ కంట్రోల్-సిస్టమ్ టెస్ట్, ఇంజన్ ఫ్యుయెల్ డ్రివెన్ యాక్యురేటర్-ఆపరేషన్ టెస్ట్ చేపట్టాలి. హైడ్రాలిక్ సిస్టమ్ సామర్థ్యాన్ని తనిఖీ చేయాలి. టేకాఫ్ పారామీటర్లను సమీక్షించాలి. తదుపరి ఆదేశాలు వెలువడేదాకా ఫ్లైట్ కంట్రోల్ తనిఖీలు చేపట్టాలి. గత 15 రోజుల్లో బీ787-8/9 విమానాల్లో తరచూ తలెత్తిన లోపాలను సమీక్షించాలి. సోదాల నివేదికను డీజీసీఏకి సమర్పించాలి' అని ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా, భారత విమానయాన సంస్థలు బోయింగ్ విమానాలనే ఎక్కువగా నడుపుతున్నాయి. అన్ని విమానయాన సంస్థల వద్ద మొత్తం వివిధ రకాల బోయింగ్‌లు 209 వరకు ఉన్నాయి. వీటిలో 139 ఒక్క ఎయిరిండియా వద్దే ఉన్నాయి.

బాంబు బెదిరింపుతో ఎయిర్ ఇండియా విమానం అత్యవసర ల్యాండింగ్

ముంబయి, జూన్ 13 : థాయిలాండ్‌లోని పుకెట్ నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో తిరిగి పుకెట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. 156 మంది ప్రయాణికులతో పుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం ఉదయం 9.30(స్థానిక కాలమానం ప్రకారం)కు ఢిల్లీ బయలుదేరిన ఏఐ 379 విమానం అండమాన్ సముద్రం పైకి చేరుకున్నాక బాంబు బెదిరింపు రావడంతో వెనుదిరిగి పుకెట్ విమానాశ్రయంలో దిగింది. విమానంలోని 156 మంది ప్రయాణికులను సురక్షితంగా దించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేసినట్లు థాయిలాండ్ విమానాశ్రయాల అధికారి ఒకరు తెలిపారు. లైవ్ ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్24లో ఈ విమానం మధ్యలోనే వెనుదిరగడం కనిపించింది.

కొనుగోలు ఆర్డర్లు కుదింపు?

వాస్తవానికి విమానాల సరఫరాకు బోయింగ్ పలు సంస్థలు, దేశాలతో ఒప్పందం చేసుకుంటున్నా.. వాషింగ్టన్, ఒరెగాన్ ప్లాంట్లలో సమ్మెలు, ఇతర సమస్యల కారణంగా సకాలంలో ఇవ్వలేకపోతోంది. ఈ కారణంగా కొనుగోలు సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చాలా విమానయాన సంస్థలు తమ తమ ఆర్డర్లను కుదించుకుని ఇతర విమాన తయారీ కంపెనీల వైపు చూస్తున్నాయని అంటున్నారు. మొత్తం కొత్త విమానాలనే నడపాలన్న ఉద్దేశంతో ఎయిరిండియా 2023లో 220 జెట్ల కోసం బోయింగ్‌కు ఆర్డర్లు ఇచ్చింది. ఇవి గాక అదనంగా 50 మ్యాక్స్ (737), 20 డ్రీమ్‌లైనర్లు (787) విమానాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తూ సంతకాలు కూడా చేసింది. అలాగే 200 సింగిల్ ఐసిల్ జెట్ల కోసం ఎయిర్‌బస్, బోయింగ్‌లతో చర్చలు జరుపుతోంది. ఇండిగో 900 విమానాల కోసం ఎయిర్‌బస్‌కు ఆర్డర్లు ఇచ్చింది. మూడేళ్ల కిందట కార్యకలాపాలు మొదలుపెట్టిన ఆకాశ్ ఎయిర్ కూడా 226 బోయింగ్ 737 మ్యాక్స్ జెట్ల కోసం ఆర్డర్ ఇచ్చింది. అయితే బోయింగ్ ఒక్క విమానం కూడా సరఫరా చేయలేదు. ఇప్పుడు అహ్మదాబాద్ ప్రమాదం కారణంగా బోయింగ్ విమానాలను భద్రతాపరంగా స్క్రుటినీ చేస్తున్న నేపథ్యంలో సరఫరాలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1,148 డ్రీమ్‌లైనర్లు ఉన్నాయి.

లోకం తీరు



రూ.1,000 కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లకు చాన్స్

న్యూఢిల్లీ, జూన్ 13: అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయిన ఘటనలో 240మందికి పైగా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన రూ.1,000 కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లకు దారితీయవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇది ఇప్పటి వరకు దేశంలోనే అతిపెద్ద ఏవియేషన్ బీమా చెల్లింపుగా మారనుందంటున్నారు. దేశంలోని వైమానిక బీమా రంగం నుంచి వసూలైన మొత్తం వార్షిక ప్రీమియం కన్నా ఈ బీమా క్లెయిమ్‌లు ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఇక 1999లో కుదిరిన మాంట్రియల్ కన్వెన్షన్ ప్రకారం విమాన ప్రమాదాల్లో చనిపోయిన ప్రయాణికులకు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) ఆధారంగా విమానయాన సంస్థలు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌డీఆర్ ప్రకారం.. ఒక్కో ప్రయాణికుడికి 1,71,000 డాలర్ల (సుమారు రూ.1.47 కోట్లు) పరిహారం అందనుంది. విమాన ప్రమాదంలో మరణించిన వారికి సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియలో సడలింపులు ఇచ్చినట్టు ఎల్ఐసీ వెల్లడించింది. మరణ ధ్రువీకరణ పత్రాలకు బదులుగా విమాన ప్రమాదంలో పాలసీదారుడు మరణించినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ఏదైనా ఆధారం లేదా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/విమానయాన సంస్థలు చెల్లించిన పరిహారాన్ని మరణ ధ్రువీకరణగా అంగీకరించనున్నట్టు తెలిపింది.

శవజాగారం!

» అహ్మదాబాద్ ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల పడిగాపులు

» ఇప్పటిదాకా 7 మృతదేహాలు మాత్రమే గుర్తింపు.. అందజేత



న్యూఢిల్లీ, జూన్ 13: అది అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ కాలేజీ! విమాన ప్రమాదంలో మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ టెస్టు నిర్వహిస్తున్నారక్కడ! అహ్మదాబాద్‌కే చెందిన కామిని అనే మహిళ విమాన ప్రమాదంలో మృతిచెందింది. మృతురాలి భర్తను వెంటబెట్టుకొని, ఆమె మరదలు సోనాల్ జోషి, బిగ్గరగా రోదిస్తూ మెడికల్ కాలేజీకి వచ్చింది. ఆకుపచ్చ రంగు పట్టుచీరలో ఉన్న కామిని ఫొటోను పట్టుకొని తిరుగుతోంది. మృతురాలు తన వదిన అని.. ఫొటోలోని రుద్రాక్ష లాకెట్‌ను చూపిస్తూ ఆ ఆనవాలు మృతదేహం గుర్తింపులో సాయపడగలదేమో చూడండంటూ సిబ్బందిని వేడుకుంటోంది. మనసును కదిలించే ఇలాంటి దృశ్యాలెన్నో కనిపిస్తున్నాయి. తమ ప్రాణప్రదమైన వారు విమాన ప్రమాదంలో మృతిచెందారనే బాధపడుతున్నవారికి మృతదేహాల అప్పగింతలో తీవ్ర జాప్యం జరుగుతుండటం మరింత బాధ కలిగిస్తోంది. విమాన ప్రమాదంలో 241 మంది చనిపోగా.. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను మాత్రమే గుర్తించి.. కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ టెస్టు అనివార్యంగా మారింది. ఇందుకు కుటుంబసభ్యులు తమ రక్తనమూనాలను ఇస్తున్నారు. రక్తనమూనాలు ఇచ్చేందుకు క్యూలో 8నెలల బాలుడు కూడా ఉన్నాడు. ఆ శిశువు తండ్రి మహ్మద్ అద్నాన్ విమాన ప్రమాదంలో చనిపోయాడు. జూన్ 6న ఈద్ అల్-అదా కోసం అద్నాన్, ఆయన భార్య మంతషా, కుమారుడు ఇబ్రహీం లండన్ నుంచి భారత్ కొచ్చారు. తర్వాత.. భార్య, కుమారుడిని ఇక్కడే ఉంచేసి, అద్నాన్ ఒక్కడే లండన్‌కు బయలుదేరి మృత్యువాతపడ్డాడు. అద్నాన్ కుటుంబం నుంచి ఎవ్వరూ అహ్మదాబాద్‌లో అందుబాటులో లేకపోవడంతో ఎనిమిది నెలల కుమారుడైన ఇబ్రహీం రక్త నమూనాలను ఇవ్వాల్సి వస్తోంది అని ఆయన బావ నబీల్ చెప్పాడు. కాగా రక్తనమూనాలు ఇచ్చాక రిపోర్టు కోసం కనీసం 72గంటలు పడుతుండటంతో బాధిత కుటుంబసభ్యులకు నిరీక్షణ తప్పడం లేదు. భారీ సంఖ్యలో బాధితులు కారిడార్లలో వేచి ఉన్నారు. మరోవైపు.. మృతదేహాల్లో 135 మృతదేహాల దంత నమూనాలను సేకరించామని అక్కడి ఫోరెన్సిక్ దంతవైద్యుడు జైశంకర్ చెప్పారు.

యాడ్‌లాగే ఆ ప్రమాదం!

గుజరాత్ విమాన దుర్ఘటనలో ఆసక్తికర కోణం

» అదే రోజు ఉదయం ఓ పత్రికలో.. భవనం నుంచి విమానం బయటకొస్తున్నట్లు యాడ్

» విమానం మీద ఎయిరిండియా లోగో

» మధ్యాహ్నం అదే తరహాలో ప్రమాదం





మిడ్ డేలో కిడ్‌జానియా ప్రకటన; అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దృశ్యం

న్యూఢిల్లీ, జూన్ 13: ఊహాప్రపంచం.. కళ్ల ఎదుట వాస్తవమై నిలిస్తే ఎలా ఉంటుంది? సాధారణంగా, కళా ప్రపంచంలో ఈ మాటలు వింటూ ఉంటాం. కానీ, ఓ కఠిన వాస్తవానికి, ఓ ఘోర విపత్తుకు ఆ ఊహాప్రపంచం అద్దం పడితే?.. గుజరాత్‌వాసులది ఇదే పరిస్థితి. గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన దారుణ విమాన ప్రమాదం గురించి తెలియగానే.. వారికి అదే రోజు ఉదయం చూసిన ఓ న్యూస్‌పేపర్ యాడ్ గుర్తుకొచ్చింది. గుజరాత్‌లో బహుళ ప్రజాదరణ ఉన్న మిడ్ డేలో గురువారం ఉదయం ఓ ప్రకటన ప్రచురించారు. 'ఫాదర్స్ డే'ను పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ కిడ్‌జానియా అనే చిల్డ్రన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించే గేమ్స్ గురించి ఈ ప్రకటన. దీంట్లో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఓ భవనంలోంచి ఎయిర్ ఇండియా విమానం బయటకు వస్తున్నట్లుగా ఉంటుంది. కిడ్‌జానియాలో పిల్లలు.. ఏవియేషన్ థీమ్‌తో కూడిన గేమ్స్‌లో పైలట్లుగా ఆడుకోవచ్చు అని చెప్పటానికి సంకేతంగా ఈ యాడ్‌ను ఇలా రూపొందించారు. పొద్దున పేపర్ మొదటి పేజీలో కిడ్‌జానియా ప్రకటన చూసిన గుజరాతీలు.. మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో సరిగ్గా అదే విధంగా ఎయిరిండియా విమానం కూలిపోయి, ఓ భవనంలోంచి దాని శకలం దూసుకెళ్లటం చూసి షాకయ్యారు. సోషల్ మీడియాలో కూడా పలువురు స్పందిస్తూ.. మిడ్‌డే యాడ్‌ను, విమాన దుర్ఘటన ఫొటోలను కలిపి షేర్ చేశారు. కాగా, విమాన ప్రమాదం యాదృచ్ఛికమేనని కిడ్‌జానియా తాలూకు యాడ్ సంస్థ పేర్కొంది. జరిగిన ఘటనపై కిడ్‌జానియా ఒక ప్రకటన విడుదల చేసింది. 'పిల్లలకు విమానయానం, ఎయిర్‌పోర్టుల పనితీరు గురించి ప్రాథమిక అవగాహన కలిగించే మా ఏవియేషన్ అకాడమీ కోసం ఈ యాడ్‌ను రూపొందించాం. భారత్‌లో ఎయిరిండియాతో ఒప్పందం ఉంది. అందువల్లే ఆ యాడ్‌లో ఆ కంపెనీ లోగో వాడాం. చాలా రోజుల కిందటే ఈ యాడ్ తయారైంది. విమాన ప్రమాదం నేపథ్యంలో, ఈ యాడ్‌ను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నాం' అని పేర్కొంది.

గగన విషాదాలు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన దారుణ విషాద విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశంలో ఇప్పటి వరకూ విమాన ప్రమాదాల్లో చనిపోయిన ప్రముఖులు ఎవరన్నది ఒకసారి పరిశీలిద్దాం.

హోమీ బాబా 1966

దేశం గర్వించదగ్గ ప్రముఖ అణు శాస్త్రవేత్త హోమీ జహంగీర్ బాబా. ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా 101 విమానం జెనీవా ఏటీసీతో ఏర్పడిన సమాచార లోపంతో స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణిలోని బ్లాంక్ కొండను ఢీకొట్టింది. 1966 జనవరి 24న జరిగిన ఆ ప్రమాదంలో హోమీ బాబా దుర్మరణం పాలయ్యారు.

సంజయ్ గాంధీ 1980

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పెద్ద కుమారుడు, కాంగ్రెస్ పార్టీ నేత సంజయ్ గాంధీ 1980 జూన్ 23న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లైయింగ్ క్లబ్‌కు చెందిన విమానంలో వైమానిక విన్యాసాలు చేస్తున్న క్రమంలో పట్టుకోల్పోయి సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో ఆయన నడుపుతున్న విమానం కుప్పకూలింది.

మాధవరావ్ సింధియా 2001

పౌర విమానయాన శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాధవరావు సింధియా కూడా విమాన ప్రమాదంలోనే మృతి చెందారు. కాన్పూర్‌లో జరుగుతున్న రాజకీయ సభలో పాల్గొనడానికి 10 సీట్ల ప్రైవేటు విమానంలో బయలుదేరారు. అననుకూల వాతావరణ పరిస్థితుల్లో ఆ విమానం ఉత్తరప్రదేశ్‌లోని మణిపురి వద్ద 2001, సెప్టెంబరు 30న కూలిపోయింది.

జీఎంసీ బాలయోగి 2002

తెలుగుదేశం పార్టీ నేత, లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. 2002, మార్చి 3న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సభలో పాల్గొని ఓ ప్రైవేటు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదవశాత్తు కృష్ణా జిల్లా కైకలూరులోని ఓ చెరువులో కుప్పకూలింది.

ఓపీ జిందాల్, సురేందర్ సింగ్ 2005

పారిశ్రామికవేత్త, హరియాణా మంత్రి ఓమ్ ప్రకాశ్ జిందాల్, వ్యవసాయ మంత్రి సురేందర్ సింగ్ హెలికాప్టర్‌లో ఢిల్లీ నుంచి చండీగఢ్ బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ యూపీలోని సహరన్‌పూర్ సమీపంలో ప్రమాదానికి గురయింది. 2005లో జరిగిన ఈ ప్రమాదంలో మంత్రులిద్దరూ దుర్మరణం పాలయ్యారు.

సినీనటి సౌందర్య 2004



ప్రముఖ సినీ నటి సౌందర్య (కేఎస్ సౌమ్య) ఒక రాజకీయ సభలో పాల్గొనడానికి బెంగళూరు నుంచి కరీంనగర్ బయలుదేరారు. తన సోదరుడితో కలసి 2004, ఏప్రిల్ 17న హెలికాప్టర్‌లో బయలుదేరారు. నాడు జరిగిన ప్రమాదంలో వారిరువురూ మరణించారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009

ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రయాణమయ్యారు. తీవ్ర అననుకూల వాతావరణ పరిస్థితుల్లో ఆయన ప్రయాణిస్తున్న బెల్ 430 హెలికాప్టర్ నల్లమల అటవీప్రాంతంలో కూలిపోయింది.

సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ 2021



జనరల్ బిపిన్ రావత్.... దేశపు మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్. ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన 2021, డిసెంబరు 8న సూలూరు ఎయిర్ బేస్ నుంచి వెల్లింగ్టన్ మిలటరీ కాలేజీకు హెలికాప్టర్‌లో ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న ఆర్మీ హెలికాప్టర్ తమిళనాడులోని కూనూరు సమీపంలో ప్రమాదానికి గురయింది. ఆ దుర్ఘటనలో జనరల్ బిపిన్, ఆయన భార్య సహా మరో 11 మంది దుర్మరణం పాలయ్యారు.

మెట్ల గుండా దిగి.. ప్రాణాలు కాపాడుకొని..

» అహ్మదాబాద్ దుర్ఘటనలో చెన్నై విద్యార్థికి తప్పిన ప్రమాదం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో గురువారం ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన యావత్ భారతాన్ని షాక్‌కు గురిచేసింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే దగ్గరలోని మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. అయితే ఈ మెడికల్ కాలేజీ హాస్టల్‌లో బసచేస్తున్న చెన్నైకి చెందిన అరుణ్ ప్రసాద్ అనే విద్యార్థి తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అరుణ్ ప్రసాద్ అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేట్ చదువుతున్నాడు. విమానం కూలిన సమయంలో హాస్టల్ ఐదో అంతస్తులో ఉన్న మెస్‌లో అరుణ్‌ప్రసాద్ భోజనం చేస్తున్నాడు. చెవులు పిక్కటిల్లేలా శబ్దం రావడంతో భయంతో ఆ భవనం నుంచి మెట్ల గుండా కిందకు పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నానని అరుణ్‌ప్రసాద్ పేర్కొన్నాడు.

ఆర్థిక సంఘం నిధులివ్వాలి

» సర్పంచ్‌ల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కటకటలాడుతున్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో విడత కింద సుమారు రూ.1,121 కోట్లను కేంద్రం 5 నెలల కిందటే రాష్ట్రానికి విడుదల చేసింది. ప్రభుత్వం వాటిని పంచాయతీలకు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిలిచిపోయాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కూటమి సర్కారు రాకతో పంచాయతీలకు మహర్దశ పట్టిందని భావిస్తున్న తరుణంలో నిధుల విడుదలలో తాత్సారంపై విమర్శలొస్తున్నాయి. పంచాయతీలకు సత్వరమే నిధులు విడుదల చేయాలని కోరుతూ అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు ఇటీవల పాడేరు ఐటీడీఏ పరిధిలో ధర్నాలు నిర్వహించారు. నిధులు లేక పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నాయంటూ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత్ పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు ఇప్పటికే పలుమార్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమా ర్, కమిషనర్ కృష్ణతేజను కలిసి విన్నవించారు. శుక్రవారం కమిషనరేట్‌లో కృష్ణతేజను జాస్తి వీరాంజనేయులు కలిసి 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

చేనేతలకు వేతనాల పెంపు: మంత్రి సవిత

» ఆప్కో, లేపాక్షి పనితీరు మెరుగుకు ఐఐఎంతో ఒప్పందం

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వేలాది మంది చేనేతలకు లబ్ధిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందని రాష్ట్ర బీసీ, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆప్కోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మిక సహకార సంఘాల కింద పని చేసే నేత కార్మికులకు వేతనాలు, చార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చేనేతలకు 50 సంవత్సరాలకే పింఛను ఇస్తామన్న హామీని నిలపెట్టుకునేలా ప్రతి నెలా రూ.4 వేల చొప్పున 92,274 మంది నేతన్నలకు పింఛను అందజేస్తున్నామన్నారు. మర మగ్గాలకు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని తెలిపారు. పలు కేటగిరీల్లో ఉత్తమ డిజైన్లను ఎంపిక చేసి విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆప్కో, లేపాక్షి పని తీరు మరింత మెరుగుపరచడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎం)తో ఒప్పందం చేసుకున్నామన్నారు. పీపీపీ విధానంలో ఇతర రాష్ట్రాల్లో లేపాక్షి షోరూమ్‌లను ఏర్పాటు చేయబోతున్నామని సవిత తెలిపారు.

బెజవాడలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం రెడీ

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. విజయవాడలోని పోలీసు కంట్రోల్ రూం వద్ద నూతనంగా నిర్మించిన స్టాలిన్ సెంట్రల్ భవనంలో ఏర్పాటు చేసిన ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాన్ని ఈ నెల 16న ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ టి రబిశంకర్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలో మొత్తం 19 రాష్ట్రాల్లో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. కొత్తగా 20వ ప్రాంతీయ కార్యాలయం విజయవాడ స్టాలిన్ సెంట్రల్ కాంప్లెక్స్‌లో కొలువుదీరనుంది. ఇప్పటికే ఈ భవనంలో ఆడిట్ జనరల్ కార్యాలయం ఉంది.

మంత్రిమండలి సమావేశం 24కి వాయిదా

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరగాల్సిన మంత్రిమండలి సమావేశం 24వ తేదీకి వాయిదా పడింది. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నోట్ జారీ చేశారు. 20వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ప్రతిపాదిత అంశాలు పంపించాలని ఆయా శాఖల కార్యదర్శులను సీఎస్ కార్యాలయం ఆదేశించింది.

నేడు నీట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 4న నిర్వహించిన నీట్ (యూజీ) పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 14న నీట్ (యూజీ) ఫలితాలు విడుదల కావలసి ఉంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్షకు 20.8 లక్షల మంది హాజరయ్యారు. గతేడాది ఆ సంఖ్య 23.33 లక్షలుగా ఉంది. ఈ ఏడాది దరఖాస్తు చేసిన వారిలో 91.4 శాతం మంది పరీక్ష రాశారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన బాలకృష్ణ

» బసవతారకం ఆసుపత్రి రజతోత్సవాలకు ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ 25వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి వేడుకల్లో పాల్గొనవలసిందిగా కోరారు. ఆసుపత్రి 25 ఏళ్ల ప్రయాణాన్ని, రజతోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను గవర్నర్‌కు బాలకృష్ణ వివరించారు.

నేటితరం సివిల్ సర్వెంట్లకు గోపాలకృష్ణ ఆదర్శం

» ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్

న్యూఢిల్లీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ ఎం.గోపాలకృష్ణ నేటి తరం సివిల్ సర్వెంట్లకు ఆదర్శమని ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఇక్కడ ఏపీ భవన్ ఆడిటోరియంలో గోపాలకృష్ణ రాసిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... '86 ఏళ్ల వయస్సులోనూ గోపాలకృష్ణ సమాజహితం కోరుతూ రోజుకు 12 గంటలు కష్టపడుతున్నారు. ఉమ్మడి ఏపీలో విధులు నిర్వర్తించి విప్లవాత్మక కార్యక్రమాలు ప్రవేశపెటారు. గోదావరి ఫెర్టిలైజర్స్‌ను బలోపేతం చేయడంతో పాటు, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను లాభాల బాటలో నడిపించారు' అని తెలిపారు.

నైరుతి కదలికలో స్వల్ప జాప్యం

» కోస్తా, సీమలకు వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల కదలికలో స్వల్ప జాప్యం నెలకొంది. రానున్న మూడు రోజుల్లో విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని శుక్రవారం బులెటిన్‌లో పేర్కొంది. ఆ తర్వాత మూడు రోజుల్లో గుజరాత్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్‌లో పలు ప్రాంతాలకు విస్తరించనున్నాయని పేర్కొంది. శుక్రవారం తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. కర్ణాటక నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించాయి.

కృష్ణా ట్రైబ్యునల్ 'గెజిట్' భేటీ వాయిదా

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వివాద ట్రైబ్యునల్-2 ఆదేశాల అమలుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్యక్షతన ఈ నెల 18వ తేదీన జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు జలశక్తి శాఖ ఆయా రాష్ట్రాలకు శుక్రవారం సమాచారం ఇచ్చింది. తదుపరి భేటీ ఎప్పుడో త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది.

ప్రజలకు మరింత చేరువగా న్యాయ సేవలు

» గ్రామ న్యాయాలయాల ప్రారంభానికి చర్యలు: మంత్రి ఫరూక్

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయశాఖ సేవలను ప్రజలకు మరింత చేరవ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన కోర్టుల భవనాలకు, గృహ సముదాయాల నిర్మాణాలకు వినతులు వస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అవసరాలు, డిమాండ్లను బట్టి ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర న్యాయశాఖకు నివేదించాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలను ప్రారంభించేందుకు న్యాయశాఖ తరఫున అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మైనార్టీల ఖాతాల్లో రూ. 718.95 కోట్లు జమ

తల్లికి వందనం పథకం మైనార్టీ కుటుంబాలకు ఎంతో బాసటగా నిలిచిందని మంత్రి ఫరూక్ ఓ ప్రకటనలో చెప్పారు. గత ప్రభుత్వం కంటే 54 శాతం ఎక్కువగా మైనార్టీలకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో 4.81 లక్షల మంది ముస్లిం (దూదేకుల, నూర్ బాషాల కులాలకు మినహాయించి), క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం ద్వారా రూ.718.95 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. గత ప్రభుత్వంలో 2023-24లో నాటి ప్రభుత్వం కేవలం 3.12 లక్షల మంది విద్యార్థులకు రూ.468 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు.

పౌర సరఫరాల సంస్థలో 'మేనేజర్ల' బదిలీలు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల పౌర సరఫరాల శాఖ మేనేజర్లు, జోనల్ మేనేజర్లు, టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్లను బదిలీ చేస్తూ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పరిపాలన సౌలభ్యం కోసం ఈ బదిలీలు నిర్వహించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అమ్మ కళ్లలో ఆనందం!



దేవనకొండలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చిన్నారులు, కాలనీ వాసులు

ఖాతాల్లో 'తల్లికి వందనం' జమ.. కర్నూలు జిల్లాలో ఒకే ఇంట్లో ఆరుగురికి

» పలు కుటుంబాలకు ఒకేసారి 65 వేలు

» మరికొందరికి 52 వేలు, 39 వేలు కూడా

» హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఒకే ఇంట్లో ఆరుగురు పిల్లలకు.. ఐదుగురు పిల్లలున్న మరికొందరికి ఒకేసారి రూ.65 వేలు.. నలుగురున్న ఇంకొందరికి రూ.52 వేలు.. ముగ్గురు పిల్లలు ఉన్నవారికి రూ.39 వేలు.. ఇలా ఇంట్లో ఒకరు, ఇద్దరికి మించి ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 'తల్లికి వందనం' నగదు పడుతుండటంతో అమ్మ కళ్లలో అంతులేని ఆనందం కనిపిస్తోంది. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వేలాదిమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం నగదు జమ కావడం, మెసేజ్‌లు రావడంతో వారి కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమ పిల్లల చదువుకు సాయం చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. పలు చోట్ల ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

ఒకే కుటుంబంలో ఆరుగురికి..

కర్నూలు జిల్లా దేవనకొండ మండల కేంద్రానికి చెందిన పింజరి చాంద్ బాషా, షకీనాబీ దంపతులకు ఆరుగురు కుమార్తెలు. వారిది పేద కుటుంబం. ఉన్న నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. చిన్నారులు రేష్మ, సైనాజ్, సైరా, అమీష, అసీఫా, సుభాన్‌బీ పాఠశాల విద్య చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.13 వేలు అమ్మఒడి కింద వచ్చింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఆ కుటుంబంలో ఆరుగురు పిల్లలకూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది. శుక్రవారం ముగ్గురు పిల్లలకు రూ.13 వేలు చొప్పున తల్లి షకీనాబీ ఖాతాలో రూ.39 వేలు జమైంది. మరో ముగ్గురు పిల్లలకు మరో రూ.39 వేలు జమ కావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఆరుగురు పిల్లలకూ తల్లికి వందనం పథకం వర్తింపచేయడంతో ఆ కుటుంబం ఆనందం అంతా ఇంతా కాదు. చుట్టుపక్కల ఇళ్ల వారితో కలసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బాబుకు కృతజ్ఞతలు



నలుగురు పిల్లలతో తోట నాగమల్లేశ్వరావు కుటుంబం

నాకు నలుగురు పిల్లలు. కూలినాలీ చేసి చదివిస్తున్నా. కౌలు రైతు కష్టం తెలియనిది కాదు. మాకు ఎంతో అక్కరకు వచ్చేలా తల్లికి వందనం పథకం అమలు చేశారు. ఒకేసారి నలుగురు పిల్లలకు డబ్బులు రావడం.. మాకు చంద్రబాబు చేసిన ఊహించని సహాయం. ఆయనకు ఎప్పుడూ కృతజ్ఞులమే.

- తోట నాగమల్లేశ్వరరావు, ఈమని, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా

ఒకే కుటుంబానికి 65 వేలు జమ



ఐదుగురు బిడ్డలతో రత్నమ్మ

అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం మాళాపురం గ్రామానికి చెందిన రత్నమ్మ, రామాంజినేయులు దంపతులకు ఆరుగురు సంతానం. సుస్మిత, అక్షిత 9వ తరగతి, దివ్య 6వ తరగతి, సాయి, మణికంఠ 3వ తరగతి, శాంతి 7వ తరగతి చదువుతున్నారు. శాంతికి మినహా మిగిలిన ఐదుగురినీ తల్లికి వందనం పథకానికి ఎంపిక చేశారు. తల్లి ఖాతాలో రూ.65 వేలు జమైంది.

కలలో కూడా ఊహించలేదు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పద్మ, రవి దంపతులు

మాకు నలుగురు ఆడపిల్లలు. రెక్కాడితేగాని పూట గడవని పేదరికం. ఆడపిల్లలను బాగా చదివించాలని బడికి పంపుతున్నాను. గత వైసీపీ ప్రభుత్వంలో ఒకరికి మాత్రమే రూ.13 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు తల్లి ఖాతాలో జమ చేసింది. నాలుగో కుమార్తెను ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరుస్తున్నాం. ఈ అమ్మాయికి కూడా ఇస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రుణం తీర్చుకోలేనిది. మాలాంటి పేదలకు రూ.39 వేలు అంటే కలలో కూడా ఊహించలేని మొత్తం. చంద్రన్న ఇచ్చిన స్ఫూర్తితో మా నలుగురు పిల్లలను బాగా చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దుతాం. మా పెద్దన్న చంద్రన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- హరిజన కల్లుబావి పద్మ, రవి దంపతులు, కోసిగి, కర్నూలు జిల్లా

ఎంతో ఆనందంగా ఉంది



పిల్లలతో అద్దంకికి చెందిన సల్ల సుబ్రహ్మణ్యం, దుర్గ దంపతులు

ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. రోజంతా ఆటో నడిపినా డబ్బులు కుటుంబం పోషణకు సరిపోవటం అంతంతమాత్రమే. పిల్లలకు మంచి బట్టలు కూడా కొనివ్వలేని పరిస్థితి. తల్లికి వందనం డబ్బులు నలుగురు పిల్లలకు రూ.52 వేలు రావటం ఎంతో ఆనందంగా ఉంది. పిల్లలకు అవసరమైనవి కొనిస్తాము.

-సల్ల సుబ్రహ్మణ్యం, దుర్గ దంపతులు, ఎన్‌టీఆర్ నగర్, అద్దంకి

చంద్రబాబు దేవుడు

» నా ఐదుగురు పిల్లలకు 65 వేలు



ఐదుగురు పిల్లలతో తల్లి మేరీ

ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు దేవుడు కన్నా ఎక్కువ. భర్త చనిపోవడంతో నలుగురు ఆడపిల్లలను, కుమారుడిని పోషించడమే కష్టంగా ఉంది. చదివించలేనని అనుకున్నాను. మా పాలిట దేవుడిలా చంద్రబాబు అవతరించారు. తల్లికి వందనం పథకం కింద ఖాతాలో రూ.65 వేలు వేశారు. ఆయన చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోలేం.

- మేరీ, ఈపూరు ఎస్సీ కాలనీ, పల్నాడు జిల్లా

జీవితంలో మరిచిపోలేను



నలుగురు పిల్లలతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న దార్ల జ్యోతి

నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఒంటరి మహిళ దార్ల జ్యోతికి నలుగురు సంతానం. సలోమి 7వ తరగతి, అనిత 5వ తరగతి, గురువమ్మ 3వ తరగతి, కోటేశ్ 2వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద వీరందరికి కలిపి ఒకేసారి రూ.52 వేలు జ్యోతి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. పాచి పని చేసుకుంటూ బిడ్డలను చదివించుకుంటున్న తనకు రూ.52 వేలు సాయం చేయడం తన జీవితంలో మరిచిపోలేనని చెప్పారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే ఇంట్లో ఐదుగురికి..



షేక్ గులాబి, లాల్‌షా కుటుంబం

కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట 31వ వార్డు భాస్కర్‌నగర్‌కు చెందిన షేక్ లాల్‌షా, గులాబి దంపతులకు ఐదుగురు సంతానం. పిల్లలు షేక్ అజీనా (8వ తరగతి), షేక్ ఆయీషా (6వ తరగతి), షేక్ షబీనా (5వ తరగతి), షేక్ అరీఫా (4వ తరగతి), షేక్ ఆజీనా (3వ తరగతి)లకు రూ.13 వేలు చొప్పున తల్లి ఖాతాలో రూ.65 వేలు జమైంది. పిల్లల చదువుల కోసం ఇంత పెద్ద మొత్తం సాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వానికి షేక్ గులాబి, లాల్‌షాలు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లికి ఆనందం!

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులున్నవి మినహా... మిగిలిన అందరికీ శుక్రవారంనాటికి డబ్బులు జమ అయ్యాయి. ఇక... ఒకటో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు కాగానే వారి తల్లులకూ సొమ్ములు అందుతాయి. 'ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ అమ్మ ఒడి ఇస్తాం' అని అధికారంలోకి వచ్చిన జగన్... ఆ తర్వాత, విద్యార్థుల లెక్క పక్కనపెట్టి, తల్లులకు మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు అలా కాదు! 'ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు... చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తాం' అని చెప్పారు! చేసి చూపించారు. అప్పటిలాగానే... విద్యాసంస్థల నిధి కోసం రూ.2వేలు మినహాయించుకుని, ఒక్కో విద్యార్థికి రూ.13వేల చొప్పున, ఇంట్లో ఎంతమంది చదువుకుంటూ ఉంటే అన్ని 13వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారు. దీంతో... ఆయా కుటుంబాలకు భారీగా లబ్ధి చేకూరింది. మరీ ముఖ్యంగా... సంతాన లక్ష్ములకు లక్ష్మీ కటాక్షం లభించింది. ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఐదుగురికి 'తల్లికి వందనం' సొమ్ములు జమ అయినట్లు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడైంది. ప్రభుత్వ అంచనా ప్రకారం... ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువమంది చదువుకుంటున్న పిల్లలున్న కుటుంబాల సంఖ్య లక్షల్లోనే ఉంది. ఒక్కరు పిల్లలున్న కుటుంబాల సంఖ్య 18,55,760. ఇక... ఇద్దరు పిల్లలున్న కుటుంబాల సంఖ్య 14,55,322. వీరందరికీ... వైసీపీ హయాంకంటే రెట్టింపు సొమ్ములు అందినట్లే. ఇక... ముగ్గురు పిల్లలున్న తల్లులు 2,10,684. వీళ్లందరికీ... రూ.39 వేల చొప్పున 'తల్లికి వందనం' అందుతోంది. ఇక... 20వేల కుటుంబాల్లో నలుగురు పిల్లలున్నారు. వీరి ఖాతాల్లో రూ.52 వేలు జమయ్యాయి, అవుతున్నాయి! అతి తక్కువగా ఐదారుగురు పిల్లలున్న తల్లులూ ఉన్నారు. ఏదేమైనా.. జగన్ హయాంతో పోల్చితే రెట్టింపు లబ్ధి జరిగినట్లే!.

24 గంటలు టైమిస్తున్నా!

» వైసీపీకి లోకేశ్ హెచ్చరిక



అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' నగదులో విద్యార్థికి రూ.2వేలు చొప్పున తాను తీసుకున్నట్లు 24 గంటల్లో నిరూపించాలని వైసీపీ నేతలకు మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు. ఆ నగదు తన ఖాతాలోకి వచ్చినట్లు చూపించలేకపోతే సీరియస్ యాక్షన్ తీసుకుంటానని హెచ్చరించారు. తల్లికి వందనం పథకంపై శుక్రవారం మాట్లాడారు. నింద వేసి పారిపోతే ఊరుకోబోమని, నిరూపించలేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని పేర్కొన్నారు. దానిపై చట్టప్రకారం ముందుకెళ్తానని లోకేశ్ తేల్చి చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన తల్లికి వందనం పథకంలో భాగంగా 67,27,164 మంది విద్యార్థులకు రూ.8,745 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. సోమవారం నాటికి అందరి ఖాతాల్లో నగదు జమవుతుందని స్పష్టం చేశారు. అప్పటికీ నగదు రానివారు జూన్ 26 వరకు మనమిత్ర వాట్సాప్ ద్వారా లేదా సచివాలయాల ద్వారా వినతులు సమర్పిస్తే పొరపాట్లు సరిదిద్దుతామని చెప్పారు. 2శాతం మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం వల్ల నగదు జమ కాలేదని, అలాంటి వారికి ఖాతా యాక్టివేట్ చేయించుకోవాలని మెసేజ్‌లు పంపామని వివరించారు. "80శాతం మందికి విద్యార్థి మిత్ర కిట్లు అందజేశాం. మిగిలినవారికి ఈ నెల 20లోగా అందిస్తాం. మధ్యాహ్న భోజనం పథకాన్ని సన్నబియ్యంతో అమలు చేస్తున్నాం. తరగతికి ఒక టీచర్ అనే విధానంతో 9,600 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశాం. మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపండి. వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత మా ప్రభుత్వానిది' అని తల్లిదండ్రులకు లోకేశ్ పిలుపునిచ్చారు.

అప్పట్లో లెక్కలన్నీ తప్పులే

వైసీపీ హయాంలో విద్యార్థుల లెక్కలు తప్పులు తడకలుగా చూపించారని లోకేశ్ ఆరోపించారు. వాస్తవంగా ప్రభుత్వ బడుల్లో ఎంతమంది చదువుతున్నారో తెలుసుకోవడానికి మూడు నెలలు పట్టిందని తెలిపారు. వైసీపీ చెబుతున్నట్లుగా నిజంగా 87లక్షల మంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఆ ప్రభుత్వం ఎందుకు అమ్మఒడి ఇవ్వలేదని లోకేశ్ నిలదీశారు. తల్లికి వందనం కోసం గత ప్రభుత్వ నిబంధనలనే అమలు చేస్తున్నామని చెప్పారు. మినహాయించిన రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి ఖర్చుచేస్తామన్నారు. యూనివర్సిటీల వీసీలను 3 నెలల్లో భర్తీ చేస్తామని చెప్పారు. కాగా, తల్లికి వందనం నగదు విడుదలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి మంత్రి లోకేశ్ సమీక్షించారు. ఇప్పటివరకూ ఎంతమందికి నగదు చేరిందని ఆరా తీశారు. ఆర్బీఐ వద్ద నిధుల విడుదలలో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. అర్హులందరికీ నగదు అందేలా చూడాలని సూచించారు.

20 సిలెండర్లు దెబ్బతిన్నాయ్!

» శ్రీశైలం జలాశయ భూగర్భ వీడియోగ్రఫీలో నిర్ధారణ

» డ్యామేజీపై కొనసాగుతున్న అధ్యయనం

» మిగతా 31 సిలెండర్ల స్థితిగతులూ తెలుసుకోవాలని నిర్ణయం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు జోరందుకుని.. వరదలు వచ్చేలోగా శ్రీశైలం జలాశయం కట్టడాలకు జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర జల-విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిరంతరాయంగా శ్రమిస్తోంది. అదేవిధంగా విశాఖకు చెందిన ప్రైవేటు ఓషనోగ్రఫీ పరిశోధన సంస్థ.. జలాశయం భూగర్భంలో అమర్చిన 62 సిలెండర్లలో 31 సిలెండర్ల స్థితిగతులను వీడియో తీస్తోంది. ఇందులో 12 సిలెండర్లు పూర్తిగా, మరో 8 పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. మిగిలిన 31 సిలెండర్లలో ఎన్ని దెబ్బతిన్నాయో తెలుసుకునేందుకు వాటిని కూడా వీడియోగ్రఫీ తీయాలని నిర్ణయించారు. దీంతో మరికొన్ని రోజులు ఈ ప్రక్రియను కొనసాగించనున్నారు. పూర్తిగా దెబ్బతిన్న సిలెండర్ల స్థానంలో కొత్తవాటిని అమర్చుతామని.. పాక్షికంగా దెబ్బతిన్నవాటికి అండర్‌గ్రౌండ్‌లోనే కొత్త సాంకేతిక విధానాల ద్వారా వెల్డింగ్ చేస్తామని శ్రీశైలం ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణం సానుకూలంగానే ఉందని.. అండర్ గ్రౌండ్ వీడియోగ్రఫీకి ఎలాంటి అవరోధాలూ ఎదురుకాలేదని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంకోవైపు.. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి విషయంలోనూ సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు విస్తృతంగాద అధ్యయనం చేస్తున్నారు. దశాబ్దాల నుంచీ ఈ గొయ్యి 47 మీటర్ల లోతున ఉందని.. అది పెరగలేదని ఇటీవల గుర్తించారు. అయినప్పటికీ.. పాథ్‌మేటిక్స్ అధ్యయనం ద్వారా గొయ్యి స్థిరంగా ఉందో.. ఇంకా పెద్దదైందో తెలుసుకుంటారని శ్రీశైలం అధికారులు చెప్పారు. అప్రోచ్ రోడ్డు, యాప్రాన్‌కు బోర్‌వెల్స్ వేయడం ద్వారా డ్యాం భద్రతపైనా శాస్త్రీయ అధ్యయనం జరుగుతుందన్నారు. ఇప్పటికే డ్యాం డ్యామేజీపై 50 శాతం అధ్యయనం పూర్తయిందని తెలిపారు. వర్షాలు ఉధృతమయ్యేలోగా మిగిలిన నష్టం కూడా అంచనా వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.

ఏపీ 718 టీఎంసీలు... తెలంగాణ 286 టీఎంసీలు

» వాటర్ ఇయర్ ముగిశాక కృష్ణా జలాల లెక్కలు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 2024-25 వాటర్ ఇయర్ (2024 జూన్ 1వ తేదీ నుంచి 2025 మే 31వ తేదీ దాకా) కృష్ణా బేసిన్‌లో ఎవరెంత మేర నీటిని వినియోగించారని కృష్ణా బోర్డు వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాలు మొత్తం 1004 టీఎంసీల నీటిని వాడుకోగా... అందులో ఏపీ వినియోగం 718 టీఎంసీలు, తెలంగాణ వాడకం 286 టీఎంసీలుగా గుర్తించారు. 11 ఏళ్లలో తొలి సారిగా తెలంగాణ నీటి వినియోగం పెరిగింది. 2019-20లో గరిష్ఠ వినియోగం 278 టీఎంసీలు కాగా... 2022-23లో 273 టీఎంసీలే. ఇక శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా ఏపీ 207 టీఎంసీల నీటిని తరలించింది. తెలంగాణ కల్వకుర్తి పథకం కింద 50 టీఎంసీల నీటిని తరలించిందని గుర్తించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఏపీ 164 టీఎంసీలు, గుంటూరు చానల్ నుంచి 2 టీఎంసీల నీటిని తరలించారని పేర్కొన్నారు.


23 నుంచి 'తొలి అడుగు'

కూటమి ఏడాది సుపరిపాలనపై ఇంటింటి ప్రచారం.. ప్రజల్లోకి వెళ్లి అమలు చేసిన పథకాలను వివరించండి

» ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

» ఏడాదిలోపే ముఖ్యమైన పథకాలన్నీ అమలు: సీఎం

» టీడీపీ నేతలు, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్



అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ నెల 23నుంచి నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని టీడీపీ శ్రేణులను ఆదేశించారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదిలో ప్రభుత్వ కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు. ఇందులో లీడర్ నుంచి కేడర్ వరకూ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రచారం చేసే విషయంలో పోటీ పడాలని నిర్దేశించారు. 'మొదటి ఏడాది ఏం చేశామో చెప్పడంతో పాటు ప్రత్యర్థి పార్టీలు మనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' అమలు చేశాం. ఎంత మంది పిల్లలు ఉన్నా పథకం వర్తింపజేస్తున్నాం. 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేల కోట్లు విడుదల చేశాం. తల్లుల ఖాతాలో రూ.13వేలు, పాఠశాల అభివృద్ధికి రూ.2వేలు కేటాయిస్తున్నాం. గత ప్రభుత్వం 42లక్షల మందికే ఇస్తే వారికంటే మనంగా మన ప్రభుత్వం 25లక్షల మందికి అదనంగా పథకాన్ని అమలు చేస్తోంది. వారు చేసిన ఖర్చు రూ.5,540 కోట్లు అయితే మన ప్రభుత్వం చేసే ఖర్చు రూ.8,747కోట్లు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను కలుపుకుంటే ఇది రూ.10వేల కోట్లకు చేరుతుంది. తల్లికి వందనం నిధుల విడుదలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక పథకానికి ఇన్ని వేల కోట్లు ఒకేసారి విడుదల చేయడం ఒక చరిత్ర. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ముఖ్యమైన పథకాలన్నింటినీ ఏడాదిలోపే అమలు చేస్తున్నాం. ఇంత చేస్తున్నా బుద్ధి, జ్ఞానం లేకుండా వైసీపీ వారు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. కార్యకర్తలు, నాయకులు ఎన్నికల ముందు సూపర్-6, మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపిస్తోంది. ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పండి. పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలి. పార్టీ కోసం కష్టపడే వారికి అవకాశం కల్పించాలి. జూలై నుంచి కార్యకర్తలు, నేతలకు నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దుతాం. విశాఖపట్నంలో 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని 5లక్షల మందితో నిర్వహిస్తున్నాం. అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2కోట్ల మందిని యోగాలో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని చంద్రబాబు అన్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా పలువురు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

ముంబై చెక్కేసిన తోపుదుర్తి!

- 'చలో పేరూరు' గొడవలో కేసు నమోదు
- అరెస్టు భయంతో పరార్.. వెంబడించిన పోలీసులు
- తప్పించుకుని శంషాబాద్ వెళ్లి.. విమానమెక్కిన మాజీ ఎమ్మెల్యే

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మరోసారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 'చలో పేరూరు' గొడవకు సంబంధించి తనపై కేసు నమోదు కావడంతో అరెస్టు భయంతో ఆయన ముంబై వెళ్లినట్లు సమాచారం. రామగిరి మండలంలో అత్యాచార బాధిత బాలికను పరామర్శించేందుకు ఆయన గురువారం 'చలో పేరూరు'కు పిలుపిచ్చారు. పోలీసులు అనుమతి నిరాకరించినా.. వైసీపీ శ్రేణులు ధిక్కరించి బలప్రదర్శన చేశాయి. టీడీపీ విజయోత్సవ ర్యాలీపై వైసీపీ శ్రేణులు రాళ్లు రువ్వాయి. తోపుదుర్తితోపాటు మాజీ మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద అడ్డుకుని పోలీసులు వెనక్కి పంపించారు. పేరూరులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినందుకు తోపుదుర్తి, మరికొందరు వైసీపీ నేతలపై రామగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం అనంతపురంలోని తోపుదుర్తి ఇంటికి వెళ్లి 41ఏ నోటీసు ఇచ్చారు. తమకు తెలియకుండా ఎక్కడకూ వెళ్లరాదని, రామగిరి సర్కిల్ కార్యాలయంలో విచారణకు రావాలని సూచించారు. అయితే విచారణ పేరుతో అరెస్టు చేస్తారన్న అనుమానంతో తోపుదుర్తి హైదరాబాద్ బయల్దేరారు. విషయం తెలుసుకున్న చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి ఎస్‌ఐలు సత్యనారాయణ, సోమశేఖర్ తమ సిబ్బందితో ఆయన వాహనాన్ని వెంబడించారు. పోలీసుల నుంచి తప్పించుకున్న ఆయన.. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని.. విమానంలో ముంబై వెళ్లినట్లు తెలిసింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- అనుచిత వ్యాఖ్యల కేసులో హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంకరజాతి తెగ అంటూ రాజధాని ప్రాంత ప్రజలనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో నమోదైన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అమరావతి రైతు దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష ఫిర్యాదు ఆధారంగా తాడేపల్లి పోలీసులు నమోదుచేసిన కేసుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదులు చేస్తే వాటి అన్నింటిలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసులు కోరినప్పుడు దర్యాప్తుకు అందుబాటులో ఉంటామన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

పేర్ని పాపం పండింది

- చేసిన పాపాల వల్లే నిద్రలేని రాత్రులు.. ఇక వదిలేది లేదు: కొల్లు

మచిలీపట్నం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'చేసిన పాపాలకు పేర్ని నాని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఆయన పాపం పండింది. ఇక వదిలేది లేదు' అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తప్పుడు సర్వే నంబర్లతో దొంగ పట్టాలిచ్చిన మాట వాస్తవమో కాదో అందరికీ తెలుసు. 2023లో బదిలీ అయిన తహసీల్దార్ సునీల్ 2024లో పట్టాలు ఎలా ఇచ్చారు? పేదలపై ప్రేమ ఉంటే టిడ్కో ఇళ్లను ఐదేళ్ల పాటు ఎందుకు పాడు పెట్టారు? కేసుల భయంతో పేర్ని నాని వణికిపోతూ నాపై అసత్య ఆరోపణలకు దిగుతున్నాడు. స్ట్రీట్ ఫీల్డ్(రోడ్డు పక్క స్థలాలు)లో పట్టాలిస్తే తప్పేమిటని ప్రశ్నించడానికి సిగ్గుండాలి. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కారు. పేర్ని నాని గిడ్డంగి నుంచి కాకినాడ పోర్టు వరకు వెళ్లిన లారీల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. మాయమైన బియ్యానికి రూ.1.70 కోట్లు ఎందుకు కట్టారు? తప్పు చేసి ఇలా దొరికిపోయారు. అధికారులను బెదిరిస్తూ పేర్ని నాని మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది' అని మంత్రి కొల్లు అన్నారు.

పోలీసులపై పేర్ని వాఖ్యలు అనుచితం

- సీఐను గాడు అనడంపై పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులపై మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు కె.జయపాల్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ ఖాన్ ఖండించారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. 'రేషన్ బియ్యం దుర్వినియోగం కేసులో పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధను రూరల్ సీఐ దర్యాప్తు జరుపుతున్న సమయంలో ఏ విధంగానూ పరుషంగా మాట్లాడలేదు. అయితే పేర్ని నాని సీఐను గాడు అని ఏకవచనంతో సంబోధించడం, ఒక వాతకు పది వాతలు పెడతానని బెదిరించడం సరికాదు. నాని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పోలీస్ అధికారుల సంఘం నేతలు అన్నారు.

'ఫార్ములా-ఈ' కేసులో కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న ఉదయం విచారణకు హాజరు కావాలని, కొన్ని డాక్యుమెంట్లను అందజేయాలని ఏసీబీ కోరినట్లు తెలిసింది. వాస్తవానికి ఈ కేసులో కేటీఆర్‌ను మరో సారి విచారణకు పిలవాలని నిర్ణయించిన ఏసీబీ అధికారులు.. గత నెలలోనే నోటీసు జారీ చేశారు. అయితే, ముందస్తు షెడ్యూల్ ప్రకారం తాను అమెరికా వెళ్తున్నానని వచ్చిన తర్వాత విచారణకు హాజరవుతానని కేటీఆర్ రాతపూర్వకంగా జవాబు ఇవ్వడంతో ఏసీబీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు.

చీరాల 'కుప్పడం' చీరకు జాతీయ గుర్తింపు

- ఓడీఓపీ కింద కేంద్ర ప్రభుత్వ అవార్డు
- జూలై 14న ఢిల్లీలో అందుకోనున్న కలెక్టర్

చీరాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చీరాల కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి(ఓడీఓపీ) కింద కేంద్ర ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జూలై 14న ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ఈ అవార్డును అందుకోనున్నారు. తమ నైపుణ్యానికి తగిన గుర్తింపు కోసం చీరాలలోని వేలాది చేనేత కుటుంబాలు ఎదురుచూస్తూనే ఉన్నాయి. వారి ఆకాంక్షను కూటమి ప్రభుత్వం తీర్చింది. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నేతన్నలు నేసిన చీరను, దాని నాణ్యత వివరాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నేతన్నల ప్రావీణ్యంపై సానుకూలంగా స్పందించిన సీఎం.. చీరాల చీర ప్రాధాన్యతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో ఇప్పుడు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది.

జనవరిలో కేంద్ర బృందం పర్యటన

గత జనవరి 9న కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఇక్కడి చీరల ప్రత్యేకత, నాణ్యతను కలెక్టర్ ఆ బృందం సభ్యులకు వివరించారు. చీరాల చేనేతల కుప్పడం(డిజైన్ కోసం చేతితో ప్రత్యేకంగా నేసే విధానం) ఉత్పత్తులు, అమ్మకాలు, వారి జీవన స్థితిగతులపై కేంద్రానికి నివేదిక ఇచ్చారు. కుప్పడం చీరలు నేయడానికి ప్రత్యేక నైపుణ్యం ఉండాలని, చీర అంచులను రెండు


కేంద్ర బృందం చీరాల పర్యటనలో కుప్పడం ప్రాధాన్యతను వివరిస్తున్న కలెక్టర్ మురళీ(ఫైల్)

విధాలుగా నేయాల్సి ఉంటుందని నేతన్నలు చెబుతున్నారు. తమలో కూడా నైపుణ్యం ఉన్న వారు మాత్రమే ఈ చీరలు నేయగలుగుతారని అంటున్నారు.

చేనేత రంగానికి ఊతం

చీరాల నేతన్నకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. కుప్పడం చీరకు లభించిన గుర్తింపుతో ఉపాధి పెరుగుతుంది. అమ్మకాలు పెరుగుతాయి.

- సిద్ధి బుచ్చేశ్వరరావు, మాస్టర్ వీవర్

గుంటూరు జైలు నుంచి బోరుగడ్డ విడుదల

- అన్ని కేసుల్లో కోర్టుల్లో బెయిల్ మంజూరు

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు అన్ని కేసుల్లో బెయిల్ మంజూరైంది. దీంతో శుక్రవారం అతడు గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యాడు. వివిధ ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై 50కి పైగా కేసులు నమోదయ్యాయి. వీటిలో 15 కేసులు ఒక్క గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై గుంటూరుతో పాటు అనంతపురంలో కూడా కేసు నమోదైంది. పెదకాకాని పోలీసు స్టేషన్ పరిధిలో మండల సర్వేయర్ చిరుమామిళ్ల మల్లికార్జునరావును 2016 మే 9న బెదిరించిన కేసులో గురువారం అతడికి బెయిల్ మంజూరైంది. దీంతో జైలు నుంచి బయటకు వచ్చాడు. గతంలో గుంటూరు అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఏఈఎల్‌సీ చర్చి వివాదంలో తలదూర్చి చర్చి ట్రెజరర్ కర్లపూడి బాబూప్రకాశ్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని బోరుగడ్డ ఫోన్లో బెదిరించాడు. వీడియో క్లిప్పింగ్స్ పంపి బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై బోరుగడ్డతో పాటు ఆయన అనుచరుడైన పండ్ల వ్యాపారి హరిపై కేసు నమోదైంది. ఆ కేసులో గత అక్టోబరు 17న బోరుగడ్డను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. 18న కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ తర్వాత పలు కేసుల్లో ఆయన్ను వివిధ కోర్టుల్లో పోలీసులు హాజరుపరుస్తూ వచ్చారు.

స్త్రీనిధి రుణాల అక్రమాలపై చర్యలు

- అవకతవకలకు పాల్పడిన వారిపై కేసులు
- 2025-26లో 5,700 కోట్ల రుణాలే లక్ష్యం: మంత్రి కొండపల్లి

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో స్త్రీ నిధి రుణాలు దారి మళ్లాయని, వాటిపై విచారణ చేపట్టాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం స్త్రీనిధిపై విజయవాడ సెర్ప్ కార్యాలయంలో ఆయన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లుతో సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో కొందరు ప్రాజెక్టు సిబ్బంది స్త్రీనిధి రుణాలను దుర్వినియోగం చేయడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రుణాలను అక్రమ మార్గంలో మళ్లించినట్లు గుర్తించామని, ఇలాంటి చర్యలు పేద మహిళల అభివృద్ధికి అడ్డంకిగా మారతాయని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్త్రీనిధి ఎండీని మంత్రి ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన అధికారులపై జిల్లా/మండల స్థాయిలో కేసులు నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లను ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి స్త్రీనిధి కింద రూ.5,700 కోట్ల రుణాలు మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో అర్హులైన మహిళలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వారి అవసరాలకు అనుగుణంగా తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని స్పష్టం చేశారు. స్త్రీనిధి కార్యకలాపాల డిజిటలైజేషన్‌లో భాగంగా ఇటీవల ప్రారంభించిన స్త్రీనిధి రికవరీ యాప్ వినియోగంపై స్వయం సహాయక బృందాల సభ్యులకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ఈ యాప్ ద్వారా సభ్యులు తమ రుణ చెల్లింపును సులభంగా ట్రాక్ చేయవచ్చన్నారు. సీఐఎఫ్ రుణాల మంజూరు, రికవరీ పర్యవేక్షణను ఇప్పటి నుంచి స్త్రీనిధి ద్వారా చేయాలని పేర్కొన్నారు. సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ మాట్లాడుతూ 48 గంటల్లో స్త్రీనిధి రుణాలు అందించడం, సభ్యుల అవసరాలను గుర్తించడం ద్వారా ఈ రుణాలను ప్రతి గ్రామ సంఘం వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. స్త్రీనిధిని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి 15 రోజులకు స్త్రీనిధి పనితీరుపై సమీక్షలు నిర్వహించాలని జిల్లా పీడీలకు సూచించారు.

మ్యాట్రిక్స్‌తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

- యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు లక్ష్యం

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, మ్యాట్రిక్స్ ఓవర్సీస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ మధ్య తాడేపల్లిలోని కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా వెల్డింగ్, పైప్ ఫిట్టింగ్ రంగంలో యువతకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ డి.మనోహర్, మ్యాట్రిక్స్ ప్రతినిధి శిజు వర్కీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండండి!

- అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు
- డిబేట్‌లో ఇతరులతో చేయనివ్వొద్దు
- కొమ్మినేనికి సుప్రీం హెచ్చరిక
- రాజధానిపై అసభ్య వ్యాఖ్యల కేసులో జైలు నుంచి విడుదలకు ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని, టీవీ డిబేట్‌లో ఇతరులను అసభ్యకర వ్యాఖ్యలు చేయనివ్వొద్దని సాక్షి చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును సుప్రీం కోర్టు హెచ్చరించింది. అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని స్పష్టంచేసింది. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ఉందని, ఆయన వాక్‌స్వాతంత్ర్యాన్ని, జర్నలిస్టు హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఆయన్ను జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. ట్రయల్ కోర్టు విధించే షరతులకు లోబడి బెయిల్ ఇస్తున్నట్లు పేర్కొంది. సాక్షి చానల్‌లో ఈ నెల 6న జరిగిన చర్చలో అమరావతి వేశ్యల రాజధాని అంటూ ఎనలిస్టు కృష్ణంరాజు దారుణ వ్యాఖ్యలు చేశారు. ఈ డిబేట్‌ను నిర్వహించిన కొమ్మినేని ఆ వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో ఆయన్ను 9న పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు 24 వరకు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ కింది కోర్టులో విచారణలో ఉండగానే కొమ్మినేని సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, కొమ్మినేని తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. కొమ్మినేని అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, లైవ్ డిబేట్‌లో మరొకరు చేసిన వ్యాఖ్యలకు ఆయన్ను బాధ్యుడిని



చేయలేమని దవే అన్నారు. ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని ప్రోత్సహించారని, నవ్వుతూ వాటిని సమర్థించేలామాట్లాడారని రోహత్గీ, లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.ఇతరులు చేసిన వ్యాఖ్యలకు పిటిషనర్‌ను ఎలా అరెస్టు చేస్తారని కోర్టు ప్రశ్నించింది. 'ఎవరైనా అసభ్యమైన వ్యాఖ్య చేస్తే.. మనం దానిని నవ్వుతూ తేలికగా తీసుకుంటాం. వారిని సహకుట్రదారులుగా పరిగణించలేం' అని జస్టిస్ మన్మోహన్ పేర్కొన్నారు. దీనితో జస్టిస్ మిశ్రా ఏకీభవించారు. కొమ్మినేనిని విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 8 వారాల్లో సమాధానమివ్వాలని ఆదేశించింది.

అక్రమ అరెస్టు అని తేలింది: జగన్

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళల పేరిట నిరసనలతో అరాచకం చేశారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేని శ్రీనివాసరావుకు ఆపాదించి దాని చుట్టూ విషప్రచారం చేయించారని ట్వీట్ చేశారు. చంద్రబాబు తన తప్పును తెలుసుకోకుండా డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలను సాక్షి మీడియాకు ఆపాదించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. "కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు చంద్రబాబు కుట్రలను ఎండగట్టాయి. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వచ్చింది" అని పేర్కొన్నారు. జగన్ వ్యాఖ్యల నేపథ్యంలో బెయిల్ వస్తే అక్రమ కేసయితే, వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, పీఎస్సార్ ఆంజనేయులు, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులకు బెయిల్ రాలేదని అంటే ఈ అరెస్టులన్నీ సక్రమమేనని వైసీపీ అధినేత అంగీకరించినట్లేనా అన్న చర్చ వైసీపీలోనే మొదలైంది.

రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో పది మంది దుర్మరణం

బెంగళూరు, బంగారుపాళ్యం, కొత్తూరు (అనకాపల్లి జిల్లా), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రహదారులు రక్తమోడాయి. అతివేగం, అజాగ్రత్తకు పదిమంది బలైపోయారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు-2 డిపో ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి బెంగళూరులోని పుట్టేనహళ్లికి గురువారం రాత్రి బయల్దేరింది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో, హోస్కోటే సమీప గొట్టిపుర గేట్ వద్ద పైపుల లోడుతో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో బస్సు కుడివైపు సగభాగం తుక్కుతుక్కయింది. డ్రైవర్ వెనుకవైపు కూర్చున్నవారిలో ఐదుగురు మృతిచెందారు. 14మంది గాయపడ్డారు. ఆ సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు సహా, 30 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతులను చిత్తూరు జిల్లా ఆలమడుగుకు చెందిన కేశవులు రెడ్డి (44), ఎస్ ఆర్ పుర మండలం పుల్లూరుకు చెందిన తులసి(22), తిరుపతికి చెందిన హరిబాబు కూతురు బేబీ ప్రణతి(4), ఆలమడుగుకు చెందిన గిరిజ, జనార్దనరెడ్డి దంపతుల ఏడాదిన్నర వయసున్న కూతురు, బెంగళూరు జేపీ నగర్‌కు చెందిన శారద(43)గా హోస్కోటే గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ వీఏలికే కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. మరో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు.

అదుపు తప్పి.. సర్వీసు రోడ్డులోకి దూసుకెళ్లి

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలో కారు అదుపు తప్పిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. అనారోగ్యంతో బాధ పడుతున్న పలమనేరుకు చెందిన సయ్యద్ దిలీప్(53) తన భార్య ముబీనా, కుమార్తె హుష్నా, ఆరు నెలల మనవరాలు, అల్లుడు షాహీద్ ఆలీతో కలసి ఉదయం చిత్తూరుకు కారులో బయల్దేరాడు. అతివేగంతో వెళ్తున్న కారు మార్గమధ్యంలోని తిమ్మోజుపల్లె సమీపంలో అదుపుతప్పి, సర్వీసు రోడ్డులో నిలబడి మాట్లాడుకుంటున్న తిమ్మోజుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వక్కల రాజేంద్రనాయుడు(54), సాదరయ్య(45)పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాజేంద్రనాయుడు, సాదరయ్య దుర్మరణం చెందారు. కారు నుజ్జునుజ్జవడంతో అందులోని సయ్యద్ దిలీప్ సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతి చెందాడు.

ఆలయానికి వెళ్లొస్తుండగా..

అనకాపల్లి మండలం పిసినికాడ వద్ద బైకును లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మరణించారు. బవులవాడ పంచాయతీ ఆర్‌వీఎస్ నగర్‌కు చెందిన రంగస్వామి సుబ్రహ్మణ్యం(45), కశింకోట సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం బయటికి వచ్చాక, సీతమ్మ కాలనీకి చెందిన మజ్జి మంగమ్మ(40) కనిపించి లిఫ్ట్ అడిగింది. ఇద్దరూ బైకుపై వస్తుండగా, అనకాపల్లి వైపువస్తున్న లారీ వీరి బైకును వెనుక నుంచి ఢీకొంది. కింద పడిపోయిన సుబ్రహ్మణ్యం ముఖంపై నుంచి లారీ దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మంగమ్మ తలకు తీవ్ర గాయమవడంతో మృతి చెందింది.


కర్ణాటకలోని హోస్కోటేలో లారీని ఢీకొని ధ్వంసమైన బస్సు

ఇక్రిశాట్‌లోని ఐఎస్‌హెచ్ స్కూల్‌లో పవన్ కల్యాణ్ కుమారుడికి అడ్మిషన్

- స్వయంగా వెళ్లి చేర్పించిన ఏపీ డిప్యూటీ సీఎం

పటాన్‌చెరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుమారుడు మార్క్ శంకర్‌ను తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్ (ఐఎస్‌హెచ్)లో చేర్పించేందుకు వచ్చారు. శుక్రవారం స్వయంగా స్కూల్‌కు వెళ్లిన ఆయన.. కుమారుడి అడ్మిషన్ ప్రక్రియను పూర్తిచేశారు. అంతకుముందు మార్క్‌శంకర్ సింగపూర్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుకునేవాడు. ఇటీవల అక్కడ చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఘటనలో స్వల్పంగా గాయపడి, కోలుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన కుమారుడిని ఇక్రిశాట్ పాఠశాలలో చేర్పించేందుకు పవన్ నిర్ణయం తీసుకున్నారు.


ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్‌లోకి వెళ్తున్న పవన్ కల్యాణ్

రూ.611 కోట్ల అగ్రిగోల్డ్ ఆస్తులు బాధితులకు అప్పగించేందుకు కోర్టు అనుమతి

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కంపెనీకి సంబంధించి గతంలో ఈడీ అటాచ్ చేసిన రూ.611 కోట్ల ఆస్తులను బాధితులకు అందించే ప్రక్రియకు నాంపల్లి కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.వెయ్యి కోట్లకు చేరిందని ఈడీ అధికారులు తెలిపారు. అగ్రి గోల్డ్ స్కామ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఈడీ జప్తు చేసిన రూ.3,950 కోట్ల ఆస్తులను బాధితులకు అప్పగించారు. బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియలో మార్కెట్ విలువ ప్రకారం రూ.7,000 కోట్ల ఆస్తులను అప్పగించామని ఈడీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.